- బెంగాలీ కృత్తివాస రామాయణం - భగీరథుని జన్మ వృత్తాంతం
- భావుకత, మానవతల కళాత్మక కలయిక
- శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ నిర్వహణలో ప్రముఖుల కృషి
- తెలంగాణ గడీలు - శిథిలమవుతున్న చరిత్ర
- అంతరించి పోతున్న కళారూపం చిందుబాగోతం
- కుచేలుని కథ - మానవతా విలువలు
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-5
- ఆధునిక తెలుగు సాహిత్యం - మానవతా విలువలు

# మూసీ

# MUSI

• Samputi : 27 • Sanchika : 07 • Pages : 64 • Rs. 20
• May 2024

UGC CARE List
Approved Journal











Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 7
మే - 2024
'క్రోధి' వైశాఖ మాసం

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

బెంగాలీ కృత్తివాస రామాయణం - భగీరథుని జన్మ వృత్తాంతం - డా.ఎ.బి.సాయిప్రసాద్ 7
తెలుగు పరిశోధన : శైలీ పత్ర సమస్యలు ... ఆచార్య వెంకటరామయ్య గంపా 9
భావుకత, మానవతల కళాత్మక కలయిక ... తెలకపల్లి రవి 15
శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ నిర్వహణలో ప్రముఖుల కృషి ... బి. లింగరాజు 19
తెలంగాణ గడీలు - శిథిలమవుతున్న చరిత్ర ... డా. తాడూరి రవీందర్ 25
అంతరించి పోతున్న కళారూపం చిందుబాగోతం ... బాషిపంగు వెంకన్న 30
తెలుగులో నవ్యకవిత్వం : ఆవిర్భావం, వికాసం ... డా. భూక్య తిరుపతి 33
కుచేలుని కథ - మానవతా విలువలు ... తోట రామకృష్ణ 37
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-4 ... డా. అట్టెం దత్తయ్య 39
ఆధునిక తెలుగు సాహిత్యం - మానవతా విలువలు ... ఎం. అనంత లక్ష్మి 43
కె.కె. వెంకటశర్మ కు శ్రద్ధాంజలి ... డా. ఒజ్జల శరత్ బాబు 46

### సమీక్షలు

నిత్య అధ్యయన శీలి 'నిత్యానందరావు' ... ఆచార్య వెలమల సిమ్మన్న 47
వూళ్ళ విశ్వనాథ స్వామి నవల 'పేరులో పెన్నిధి' ... డా. రాపోలు సత్యనారాయణ 51
పాల్కురికి సోమనాథుని కృతులు - పరిశీలన ... ఘట్టమరాజు 55
'ముఖీలు'తో ముఖాముఖి ... డా. పి. విజయ్ కుమార్ 57
తెలంగాణ జాగమీద పానం ... డా. వెల్దండి శ్రీధర్ 59
స్వీకృతి ... 61

### కవితలు

చెడు స్నేహం వద్దు - డా. గన్నోజు శ్రీనివాసాచార్య - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; సాక్ష్యాన్ని కౌగిలించుకోండి ... దొంతం చరణ్ - 14; అట్లనే ... అన్నవరం దేవేందర్ - 32; శబ్దం ... గంగ్రెడ్డి లక్ష్మణ రావు - 36; మలినం కానంత కాలం ... కొమరవెల్లి అంజయ్య - 45; అంబులెన్స్ ... డా. ఎన్. గోపి - 62.



ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2024

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# ప్రయాణం

'అయ గమనే' అనే ధాతువు నుండి 'అయనం' అనే శబ్దం ఏర్పడుతుంది. అయనం అంటే గమనం. కదలిక. ఉత్తరాయణం, దక్షిణాయనం, రామాయణం వంటి పదాలు అయన శబ్దం నుండే ఏర్పడుతాయి. అయన శబ్దం యానంగా మారుతుంది. ప్రకృష్టమైన యానమే ప్రయాణం. కదలడానికి వినియోగపడే వస్తువులన్నీ 'యాన' శబ్దంలోకి వస్తాయి.

ప్రయాణం విషయంలో వాహనం, డ్రైవర్ చాలా ముఖ్యమైన అంశాలు. వాహనం జాగ్రత్తగా నడిపే వాడు అవసరం. నడిపేవాడు చాకచక్యంగా నడపకపోతే చేరవలసిన గమ్యం సమయానికి చేరుకోలేము. అదేవిధంగా వాహనాన్ని పాడుచేయకుండా నడపాలంటే మంచి చోదకుడూ అవసరమే. గమ్యం చేరుకోవడానికి ప్రయాణం చేస్తూనే ఉండాలి. శక్తి కోల్పోకుండా ప్రయాణం చేయాలి. శక్తి తగ్గిపోతే చేరవలసిన గమ్యం పూర్తిగా చేరుకోలేము. అందుకే నిరంతరం శక్తిని పెంచుకునే మార్గం తెలుసుకుంటే త్వరగా గమ్యం చేరుకుంటాం. డ్రైవర్‌కు ఎక్కువ అవకాశం ఇచ్చి అతని ఇష్టం ప్రకారమే ముందుకు వెళ్ళే వాహనం పాడు అవుతుంది, గమ్యం చేరడానికి సమయం చాలా పడుతుంది. అన్ని ఇబ్బందులూ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ప్రయాణం చేస్తుంటే కొన్ని వాహనాలను అధిగమిస్తాం. మరికొన్ని మనను అధిగమిస్తాయి. వెంటబడేవి కొన్ని, హార్న్‌తో ఇబ్బంది పెట్టేవి కొన్ని, ట్రాఫిక్ నియమాలను పాటించనివి ఇంకొన్ని. మార్గ మధ్యంలో ఎన్నో స్పీడ్ బ్రేకర్‌లు, ఎన్నో ట్రాఫిక్ గుర్తులు. అన్నింటినీ గమనిస్తూ మన శక్తిని పెంచుకుంటూ, రోడ్డు ఎలా ఉన్నా చేరాల్సిన గమ్యానికి చేరుకోవడమే ప్రయాణం. వాహన లోపం రాకుండా, అవసరమైన ఇంధనం నింపుకుంటూ ప్రయాణం కొనసాగించాలి.

ప్రయాణం మధ్యలో ఉద్యానవనాలు, సరోవరాలూ వస్తాయి. స్మశానాలు, శవాలూ ఎదురు అవుతుంటాయి. ఎన్నో ప్రమాదాలు కూడా కనిపిస్తూనే ఉంటాయి. ఎన్నో మంచి మంచి ఆహారం దొరికే ప్రదేశాలు (దాబాలు), ఆహ్లాదం కలిగే ప్రదేశాలు కూడా కనిపిస్తుంటాయి. అన్నింటినీ చూస్తూ కూడా ఎక్కడా ఒక దానికి ప్రాధాన్యం ఇవ్వడం, రెండవదానిని పూర్తిగా వదిలివేయడం కూడదు. ప్రయాణం ద్వారా చేరవలసిన గమ్యమే ముఖ్యం. ప్రయాణ మార్గంలో ఎన్నో ఆకర్షణలు కనిపిస్తూ ఉంటాయి. అన్నింటినీ గుర్తు పెట్టుకోలేము. కాని అత్యవసరమైన వానిని మాత్రమే గుర్తు పెట్టుకుంటాం. అవి మన అవసరాలు మాత్రమే. గమ్యం మాత్రమే గమనించేవాడే ఉన్నతుడు.

ప్రయాణం చేస్తున్న సందర్భంలో డ్రైవర్‌కు, ఓనర్ యొక్క వేగం అర్థం కావాలి, వాహనాన్నీ పాడు చేయకుండా నడపాలి. అవసరమైన ఇంధనం, గాలి, నీళ్ళు వాహనంలో నింపుకోవాలి. తగిన విశ్రాంతి మాత్రం ఇస్తూ, ప్రయాణం కొనసాగిస్తుండాలి. డ్రైవర్ నడపడంలో అత్యద్భుతమైన చాకచక్యం చూపించాలి. ఓనర్ మాటకు పూర్తిగా విలువను ఇవ్వాలి. అప్పుడే మార్గం సుగమం.

జీవితం అనే ప్రయాణంలోనూ నడిపేవాడు (మనస్సు) చాలా ముఖ్యమైనవాడు. నడిపేవానిపైననే వాహనం (దేహం) యొక్క స్థితి ఆధారపడుతుంది. నడిపేవాడు ఇబ్బంది పెడితే వాహనం ముందుకు వెళ్ళదు, అదేవిధంగా ఓనర్ (ఆత్మ) ప్రయాణం ఆగిపోతుంది. ఒడిదొడుకులకు తట్టుకునే శక్తి వచ్చి సరియైన విధంగా ప్రయాణం చేస్తుంటే జీవిత విధానమూ అర్థం అవుతుంది. సాఫల్యమూ సిద్ధిస్తుంది. ప్రయాణం ఎన్నో జీవిత సత్యాలను నేర్పిస్తుంది. అడుగడుగున ప్రయాణం చేస్తున్న విధానాన్ని దర్శిస్తూ, ఇంతకు ముందుకన్నా ఇంకా ఉన్నతంగా ఉత్తమంగా ప్రయాణం సాగుతూనే ఉండాలి. లోకం ఆనందమయం కావాలి.

# చెడు స్నేహం వద్దు







ఒంటికాలుతపము ఓర్పు తోడ బకము
తలపు మనమునొకటి తంతువేరు
మౌనరీతి చూడ మర్మము బోలెడు
నమ్మబోకు కొంగ నటన లన్ని!

నక్క జిత్తులన్ని నయవంచనను జేయు
ఎత్తులెన్నొవేసి చిత్తుజేయు
మొసలి దాగి చంపి ముంచితినను జూడ
మూర్ఖజాతి నెపుడ నమ్మరాదు!

ఎలుక తెలివి భంగి ఏకదంతుని మోసి
పుణ్యఫలము తాను పొందె చూడ
ఇంటిలోన దూరి యిబ్బంది కల్గించు
బొరియలన్నిబెట్టు మురిపముగను!

మ్యావుమ్యావుమని మనయింటి పిల్లియు
బుద్ధిగాను తిరుగు ముద్దుగాను
సరగుచూసి తాను సంతసంబొందియు
ఉన్న పెరుగుపాలు వూడ్చిత్రాగు!

ఎలుకలనిల జంప యేతెంచు పిల్లియు
కలుగులోన దూరి కదల దెలుక
మాటుగాయు పిల్లి మర్మము దెల్సియు
తెలివి తేటలున్న తెరువరలు!

అల్పస్వార్థశీలి నాదరించదు చూడ
ముక్క తినెడి కుక్క మూర్ఖముగను
తోటి శునకమునిల తోడుగా రానీదు
కుక్క బుద్ధిరీతి కూడదెపుడు!

పాము పాలు త్రాగి పరగ విషమె జిమ్మి
ఇచ్చి జంపు గాని యిడదు సుధలు
చెడ్డ జీవుల కడ చేరకుయెప్పుడు
భక్తియేమొ గాని ముక్తి లేదు!

చెడ్డజీవి తోడ చేయకు చెలిమిని
చెరపు వాటి వల్ల చేయివదలు
మంచి జంతుజాతి మైత్రిని వీడకు
మేలు చేయవిలను మేదినందు!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్‌నగర్, ఫోన్ : 85558 99493

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 6 హైదరాబాద్ మే : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

క్రోధం శోకాన్ని పెంచుతున్నది
శోకం లోకాన్ని ముంచుతున్నది
మనిషి మతిని కాల్చి కూల్చగా
సన్మతి నది చంపుతుంటది

ఇచట చేయు క్రొత్తదదేమి
పాడుబడ్డ పాతదదేమి
జన్మ మరణ చక్ర భ్రమణమిది
ఎరిగి మెలుగు తుండవదేమి

హాహాకార మెంతజేసినా
అంటుక్కు పాపమొదలునా
పాపభారమందుకొనుటకు
పరులెవ్వరు ముందుకొస్తురా

తుకా పలుకు జగమొక మిథ్య
సత్యమెరిగి మసలితె జనులా
నీటిమూట మాయమాయెను
పరదైవము ముందు నిలుచును




**అనువాదం :**

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7  UGC CARE List Approved Journal
హైదరాబాద్ మే : 2024

# బెంగాలీ కృత్తివాస రామాయణం – భగీరథుని జన్మ వృత్తాంతం

డా. ఎ.బి. సాయిప్రసాద్, బెంగుళూరు. ఫోన్ : 9980 567 541

బెంగాలీ కృత్తివాస రామాయణాన్ని శ్రీ దినేష్ చంద్రసేన్ మహాశయుడు గంగానది లోయ ప్రాంతపు బైబిల్ అని పేర్కొన్నాడు. ఆధునిక బెంగాలి సాహిత్యపు పూర్వయగానికి చెందిన అతి ప్రచారం పొందిన కావ్యంగా కృత్తివాస రామాయణాన్ని విమర్శకులు పరిగణిస్తారు. ఇది ఈనాటికి ఏమాత్రం వన్నె తరగని అత్యుత్తమ బెంగాలీ కావ్యం. శ్రీరామ పాచాలి (పాకాలి) పేరుతో కూడా ఈ కావ్యాన్ని బెంగాలీలు పిలుస్తారు. కృత్తివాస ఓఝూ (1381–1461) 15వ శతాబ్దానికి చెందిన కవి పండితుడు.

రామాయణం, కారణజన్ముడైన రాముడి కథతో సంబంధం ఉన్న కావ్యం. కృత్తివాస రామాయణం ప్రకారం వైకుంఠంలో దివ్య వస్త్రాలతో శోభిల్లుతున్న నారాయణుడి మనస్సున ఒక అంశం నుండి నాలుగు అంశాలుగా ప్రకటిల్లాలన్న కోరిక ఉద్భవించింది. అంతే నారాయణుడు రాముడుగా, భరతుడిగా, లక్ష్మణుడిగా, శత్రుఘ్నుడిగా మారిపోయాడు. లక్ష్మీదేవి నారాయణుడికి ఎడమవైపు సీతగా ప్రత్యక్షమైంది. అప్పుడు నారాయణ నామాన్ని జపిస్తూ దేవ ముని నారదుడు అటు రావడం జరిగింది. వైకుంఠంలో కనుల పండుగగా కనిపిస్తున్న ఆ అద్భుత దృశ్యాన్ని చూసి నారదుడు పరమానంద భరితుడు అయ్యాడు. నారాయణుడి ప్రతి లీల వెనుక ఒక రహస్యం దాగుంటుందన్న సత్యం నారదుడికి తట్టలేదు. నాకు తెలియకపోతే ఏమి? ఆ ముక్కంటికి తప్పక తెలిసి ఉంటుందని నారదుడు నేరుగా కైలాసం చేరుకున్నాడు. ఎందుకైన మంచిదని తనతో కూడా తన తండ్రి బ్రహ్మను కూడా తీసుకువెళ్ళాడు. తండ్రి కొడుకులను చూసి పరమశివుడు ప్రసన్నచిత్తుడయ్యాడు. కుశల ప్రశ్నల తరువాత మీ రాకకు కారణం ఏమని శివుడడిగాడు. నారదుడు వైకుంఠంలో తాను కనులారా చూసిన దృశ్యాన్ని సవిస్తారంగా తెలియజేసాడు. ఒక అంశం నాలుగు అంశాలుగా ఎందుకు మారిందో తెలియజేయ మన్నాడు. శంకరుడు చిరునవ్వును చిందిస్తూ 60వేల సంవత్సరాల తరువాత త్రేతాయుగంలో నారాయణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం రఘువంశంలో దశరథుని పెద్ద కొడుకుగా జన్మిస్తాడు. రావణాది రాక్షసులను సంహరించించేదుకు అవతరించమన్నాడు. ఆ దృశ్యాన్నే మీరు ముందుకు చూసారు. సగరుడి ముని మనుమడు దిలీపుడు సంతానహీనుడిగా దివికేగడం జరుగుతుంది. భగీరథుడి జననం శంకరుడి భవిష్యవాణితో ముడిపడి ఉంది.

అయోధ్యకు రాజు అయిన రఘువంశపు సగరుడు ఒకసారి అశ్వమేధ యాగాన్ని చేయ సంకల్పించాడు. యజ్ఞాశ్వాన్ని ఇంద్రుడు తరలించుకొని పోయి పాతాళంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమంలో కట్టిపడేశాడు. తండ్రి ఆదేశంతో 60వేలమంది యజ్ఞాశ్వాన్ని వెదుకుతూ వెదుకుతూ భూమిని త్రవ్వుతూ పాతాళం చేరుకుంటారు. కపిల మహర్షి ఆశ్రమంలో కట్టబడి ఉన్న యజ్ఞాశ్వాన్ని చూసి కొడుకుల జాడతో పాటు యజ్ఞాశ్వానికి సంబంధించిన విషయాలను సేకరించమని సగరుడు తన పెద్ద కొడుకైన అసమంజుదుని పురమాయిస్తాడు. తండ్రి కోరిక తీర్చడానికి కటిబద్ధుడైన అసమంజుడు పాతాళం చేరుకుంటాడు. కపిల మహర్షి ఆశ్రమంలో యజ్ఞాశ్వాన్ని చూసి కపిలుడే దొంగలించాడనుకుంటారు. వారందరూ కపిలుడి కోపం కారణంగా భస్మం అవుతారు. తన కొడుకుల జాడతో పాటు యజ్ఞాశ్వానికి సంబంధించిన విషయాలను సేకరించమని సగరుడు తన పెద్ద కొడుకైన అసమంజుదుని పురమాయిస్తాడు. తండ్రి కోరిక తీర్చడానికి కటిబద్ధుడైన అసమంజుడు పాతాళం చేరుకుంటాడు. కపిల మహర్షి ఆశ్రమంలో యజ్ఞాశ్వాన్ని చూసి కపిలుడి ద్వారా జరిగిన విషయాన్ని తెలుసుకుంటాడు. తన సోదులకు పుణ్యగతులు ఎలా ప్రాప్తిస్తాయో తెలపమని కపిలుడిని వేడుకుంటాడు. అసమంజుడిపై దయతలచి దివిలో ప్రవహించే గంగానది 60వేల మంది సగరపుత్రుల భస్మంపై ప్రవహిస్తే వారికి పుణ్యగతులు ప్రాప్తిస్తాయని కపిలుడు నుడువుతాడు. గంగను కిందికి తీసుకొని వచ్చే ప్రయత్నంలో అసమంజుడు, అతడి పుత్రుడు అంశుమనుడు, అంశుమనుడి కొడుకు దిలీపుడు అసువులు బాసారు. దిలీపుడు సంతానహీనుడిగా మరణించడం జరిగింది.

దిలీపుడి మరణంతో రఘువంశానికి వారసుడు కరువు అవుతాడు. కొన్నివేల సంవత్సరాల క్రిందటే తాను రఘువంశంలో దశరథుని కొడుకుగా భూమి భారాన్ని తగ్గిస్తాను అని దేవతలకు నారాయణుడు మాట ఇవ్వడం జరిగింది. వారసుడు లేకపోతే నారాయణుడి మాట అనృతం అవుతుంది. ఇది ఇలా జరిగితే భూమి నాస్తికులమయం అవుతుంది. సనాతనధర్మం పట్ల ప్రజల మనసులో విశ్వాసం తగ్గిపోవడం జరుగుతుంది. తరుణోపాయం తెలపమని బ్రహ్మాది దేవతలు దేవుళ్ళకే దేవుడైన పరమశివుడిని వేడుకుంటారు. శంకరుడు ఆలోచించి ఒక నిర్ణయానికొస్తాడు.

శివుడు తన ప్రణాళిక ప్రకారం అయోధ్య చేరుకుంటాడు. శివుడి రాక తెలిసిన దిలీపుడి యిద్దరు విధవలు చంద్ర, మాలా ఎదురేగి శివుడిని స్వాగతిస్తారు. సకల పరిచర్యలు ఎంతో భక్తి శ్రద్ధలతో చేస్తారు. సంతృప్తుడైన పరమశివుడు మీలో ఒకరు అతి త్వరలో గర్భం దాల్చి పండంటి కొడుకుకు జన్మనిస్తారు అని ఆశీర్వదిస్తాడు. శివుడి ఆశీస్సు విని వారు విస్తుపోతారు. స్వామీ ఇది ఎలా సంభవం అని వారు

వినయంతో అడుగుతారు. ఇది దైవ సంకల్పం. మీ యిద్దరి మధ్య జరిగే రతి కారణంగా పుత్రుడు జన్మిస్తాడు అని సెలవిచ్చి శంకరుడు కైలాసం చేరుకుంటాడు.

ఈశ్వరుడి ఆశీస్సు కారణంగా ఋతుస్రావం ఆగిపోయిన మాల రజస్వల అవుతుంది. చంద్ర మాలల సంభోగం జరుగుతుంది. సంభోగం కారణంగా మాల గర్భం దాలుస్తుంది. 10 నెలల తరువాత ఎముకలు లేని పిండాన్ని కంటుంది. ఎముకలు లేనందువల్ల ఆ పిండం నడవలేకపోతుంది. ఆ మాంసపు ముద్దను చూసి ఆ యిద్దరూ బావురుమని ఏడ్చారు. శివుడు వారికి వరమిచ్చాడా లేక శాపమిచ్చాడా అని వారు తేల్చుకోలేకపోయారు. పిండం పెరిగి పెద్దదైతే అభాసుపాలవుతామని భయపడి వారిద్దరు కొంగుచాటులో పిండాన్ని దాచుకొని సరయూ నది తీరాన్ని చేరుతారు. ఆ మాంసపు ముద్దను సరయూలో పారవేయాలని నిర్ణయించుకొంటారు. నది ఒడ్డున ఉన్న చంద్రమాలలను వశిష్ఠుడు చూడడం జరుగుతుంది. తన దివ్యదృష్టితో అంతా తెలుసుకుంటాడు. ఆ పిండం రఘువంశ వారసుడని అతడు అర్థం చేసుకుంటాడు. రఘువంశ పురోహితుడిగా రఘువంశం వారసుడిని కాపాడడం తన విధ్యుక్త ధర్మంగా భావించి వారిద్దరితో, మీరు ఆ పిండాన్ని నదిలో పారవేయకుండా ఒడ్డున వదలిపెట్టండి. దారిన పోయే ఎవరైనా దాన్ని కాపాడగలరు అని చెప్పి తన దారిన తాను వెళ్ళిపోతాడు.

**"కాగల కార్యాన్ని గంధర్వులే తీరుస్తారు"** అన్న సామెత ప్రకారం అప్పుడు సరయూనదిలో స్నానం చేయడానికని అష్టావక్ర మహర్షి రావడం తటస్థించుతుంది. శరీరంలోని ఎనిమిది వంకరల కారణంగా అష్టావక్రుడు వంకర టింకరగా నడుస్తుంటాడు. ఎముకలు లేని కారణంగా ఆ పిండం కూడా అలానే నడుస్తుంటుంది. ఆ పిండం నడక తనను అనుకరిస్తుందన్న అనుమానం అష్టావక్రుడికి కలుగుతుంది. వెంటనే ఒకవేళ ఆ పిండం నన్ను వెక్కిరిస్తుంటే అది భస్మం కాగలదు. అటుకాకుండా జన్మతః ఇది ఇలా ఉంటే నా తపోబలం వల్ల సుందర రూపం దాలుస్తుంది అని అనుకుంటాడు. జన్మతః ఎముకలు లేని కారణంగా అష్టావక్రుడి తపోబలం వల్ల ఆ పిండం సుందరుడైన బాలుడిగా మారుతుంది. తన ఇద్దరు తల్లులకు జరిగిన విషయం తెలియజేస్తాడు.

అయిదు సంవత్సరాల బాలుడిని విద్యార్జన కోసం వశిష్ఠ ముని ఆశ్రమంలో ఇద్దరు తల్లులు చేరుస్తారు. ఆశ్రమంలో కొందరు బాలురు అతని ఉత్పత్తిని గురించి ఎగతాళి చేస్తారు. కోపం గృహం చేరిన తన కుమారుడి ద్వారా ఆశ్రమ వృత్తాంతం తెలుసుకొని అతని జన్మ వృత్తాంతాన్ని తెలియజేస్తారు. రెండు భగాల రతి కారణంగా జన్మించినందుకు అతడు భగీరథుడయ్యాడు.

భగీరథుడు ద్వియోనిజుడు అన్న అంశాన్ని కృత్తివాసుడు బెంగాలి లిపిలో వ్రాయబడిన పద్మపురాణం నుండీ గ్రహించాడు. రెండు భగాల రతి సంభవం అన్న విషయాన్ని గురించి ముఖ్యంగా యిద్దరు రుత్ వనితా, సలీం కిద్వాయి లోతుగా పరిశోధన చేసారు. 14వ శతాబ్దానికి చెందిన బెంగాలీ ధార్మిక గ్రంథాలలో ఇద్దరు స్త్రీల మధ్య రతి సంభవం అని సూచించే గ్రంథాలున్నాయని అమెరికా మోన్‌టానా విశ్వ విద్యాలయపు ప్రొఫెసర్ "సేమ్ సెక్స్ మ్యారేజ్ అండ్ హిందూ ట్రెడిషన్స్"లో వివరించారు. ఆమె ప్రకారం కృత్తివాసుడు (జననం 11.02.1433) పద్మపురాణం నుండి గ్రహించాడు. సుశ్రుత సంహితలో ఇద్దరి స్త్రీల మధ్య జరిగే రతి కారణంగా ఫలదీకరణ ఒకరిలో జరుగుతుందని రాసి ఉందని తమ ఆంగ్లవ్యాసంలో ఇలా రాసారు.

The Sushruta Samhita, states that a boneless child (interpreted by commentators as havig cartilagious bones) is the result of sexual intercourse between two women, in which their sukra or sexual fluids unite in the womb of one of them (Kaviraj Kunjalal Bishagratna, An English Translation of the Sushruta Samhita, Chowkambha Sanskrit Series 30, Varanasi, 1991, P.135).

ద్వియోని సంభవుడైన భగీరథ వృత్తాంతాన్ని చర్చిస్తున్న సందర్భంలో మరో విషయాన్ని గురించి కూడా రుత్ వనిత రాసారు. మేము విధవలం, మాకు సంతానం ఎలా కలుగుతుందని శివుడిని ప్రశ్నించినట్లుగానే మేరీమాత కూడా దేవదూతను ప్రశ్నించిందట... "How shall this be since i do not know a man?" and the angel answered and said to her, "The Holy Spirit will come upon you and the power of the Highest will over shadow you. (Bible, Luke 1: 34 -35, NKJV)

భగీరథుడు ద్వియోని సంభవుడు అన్న వృత్తాంతం నాకు తెలిసినంతవరకు ఏ భారతీయ రామాయణంలోనూ లేదు. అవధి భాషలో రామాయణాన్ని రామచరిత మానస్ అన్న పేరుతో రచించిన తులసీదాసు బెంగాలీ కృత్తివాస రామాయణం నుండి కొంతవరకు ప్రభావితుడయ్యాడని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అందుకు ఉదాహరణంగా లంకా కాండలో మండోదరి ద్వారా లక్ష్మణరేఖను ఇలా చెప్పించారు. **"రామానుజ లఘు రేఖా రచాయి, సోవూ నహీ నాఘేవు సి మనుసాయి"** (లక్ష్మణుడి ద్వారా గీయబడిన చిన్నరేఖను నీవు దాటలేకపోయావు రావణా) అరణ్యకాండంలో తులసీ – **"మరమ వచన జబ్ సీతా బోలా"** అని మాత్రమే రాసారు. రంగనాథ రామాయణకారుడైన గోన బుద్ధారెడ్డియే (14వ శతాబ్దం) లక్ష్మణరేఖను ప్రవేశపెట్టిన తొలి రామాయణకారుడు.

**ఆధారం: కృత్తివాస రామాయణం ఆదికాండం, హిందీ అనువాదం.**

**అనువాదకులు : 1. యోగేశ్వర త్రిపాఠి, యోగి 2. ప్రబంధ్ కుమార్ మజుందార్ 3. నవారుణ వర్మ.**

**ప్రకాశకులు : భువనవాణి ట్రస్ట్, లక్నో. మూడవ ముద్రణ 2023.**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 హైదరాబాద్ మే : 2024


# తెలుగు పరిశోధన : శైలీ పత్ర సమస్యలు

ఆచార్య వెంకటరామయ్య గంపా, తెలుగు ఆచార్యులు, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 99586 07789

**వ్యాస లక్ష్యం**

వ్యాసం యొక్క ప్రధాన లక్ష్యం తెలుగు పరిశోధనలో శైలీ పత్ర ఆవశ్యకతను వివరించడం, ఆంగ్లంలో ఉన్న వివిధ రకాల శైలీ పత్రాలను పరిచయం చేయడం, ఆంగ్ల శైలీ పత్రాలను తెలుగు పరిశోధనకు అన్వయం చేసినప్పుడు ఎదురయ్యే సమస్యలను గుర్తించడం, తెలుగులో శైలీ పత్ర రూపకల్పనకు మార్గాలను గుర్తించడం.

**వ్యాస పరిమితి**


ఈ వ్యాసంలో కేవలం శైలీ పత్రానికి సంబంధించిన అంశం మాత్రమే చర్చించడం జరిగింది. అనువాదంలో ఉన్న సమస్యల కారణంగా వ్యాసంలో పలు చోట్ల సమాచారాన్ని ఆంగ్లంలో పేర్కొనడం జరిగింది.

**పరిచయం**

తెలుగులో మొట్టమొదటి పరిశోధన 1928లో వెలువడింది. విశ్వవిద్యాలయాల ప్రారంభంలో పరిమిత సంఖ్యలో ఉన్న పరిశోధక విద్యార్థుల సంఖ్య నేడు గణనీయంగా పెరిగింది. తెలుగులో ప్రతి సంవత్సరం చెప్పుకోదగిన స్థాయిలో విశ్వవిద్యాలయాలలో పరిశోధన గ్రంథాలు వెలువడుతున్నాయి. వివిధ రూపాలలో పరిశోధన కొనసాగుతూనే ఉంది. సాహిత్యంలో పలు రకాలైన నూతన ప్రక్రియలు వెలువడ్డాయి. సాహిత్య ప్రక్రియల విస్తృతి పెరిగే కొద్దీ పరిశోధనా పద్ధతులూ మారుతూ వస్తున్నాయి. సాహిత్య వస్తువులోనూ మార్పు చోటు చేసుకొంది. సాహిత్య వస్తువును, ప్రక్రియను బట్టి పరిశోధనా విధానంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వివిధ రకాలుగా పరిశోధనలు జరుగుతున్నప్పటికీ, విశ్వవిద్యాలయాలలో జరిగే పరిశోధనకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. అందుకు గల కారణం విశ్వవిద్యాలయాలలో క్రమబద్ధమైన పరిశోధనా విధానాన్ని అనుసరించడం. విశ్వవిద్యాలయాలలో తొలిదశలో జరిగిన పరిశోధనా పద్ధతి (1928 నుంచి 1975వరకు) చెప్పుకోదగిన స్థాయిలో ఉందనేది విమర్శకుల అభిప్రాయం. మలిదశలో జరిగిన పరిశోధనా పద్ధతిలో (1975 నుంచి 2000 వరకు ) ప్రముఖమైన ఆచార్యుల పర్యవేక్షణలో పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. తొలినాళ్లలో పరిశోధనా విధానం అనేది ఆయా పరిశోధకులే తమ పరిశోధనా గ్రంథానికి అనుగుణంగా ఒక పద్ధతిని నిర్మించుకున్నారు. పరిశోధన చేసే అంశాన్ని బట్టి పరిశోధనా పద్ధతి మారుతూ వచ్చింది. విశ్లేషణా పద్ధతి, తార్కిక పద్ధతి మొదలైన వాటిని అవలంబించారు. 1975 తరువాత విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పరిశోధనా పద్ధతిలో పరిశోధకుడు పరిశోధనా సమస్యను ఎలా ఎన్నుకోవాలి? పరిశోధనా ప్రణాళికను ఎలా రూపొందించుకోవాలి? ఏ విధంగా సిద్ధాంత వ్యాసం రాయాలి? మొదలైన విషయాలను వివరించారు. సిద్ధాంత గ్రంథ రూపంలో గ్రంథ పూర్వభాగం, గ్రంథ భాగం, ఆధార విషయ వివరణ అనే భాగాలుగా విభజించి వివిధ భాగాలలో ఉండవలసిన అంశాలను వివరించారు. ప్రస్తుతం పరిశోధకులు తమ సిద్ధాంత గ్రంథాలను ఈ పరిశోధనా పద్ధతిలోనే చేస్తున్నారు.

అయితే సమకాలీన కాలంలో తెలుగులో జరుగుతున్న పరిశోధనా పద్ధతిపై (2000 తరువాత) భిన్నమైన అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా పరిశోధన విధానంలో లోపాలు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి. విశ్వవిద్యాలయాల సంఖ్య పెరగడం, పరిశోధకుల సంఖ్య అధికం కావడం, అధ్యాపకుల కొరత ఉండడం మొదలైన కారణాలు ఉన్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాలలో పరిశోధక విద్యార్థులకు పరిశోధనా పద్ధతులను బోధించడంలో వైఫల్యం కనిపిస్తూ ఉంది. ముఖ్యంగా శైలీపత్రం పైన అవగాహన లేకపోవడంతో అనేక రకాలైన లోపాలు పరిశోధనా గ్రంథాల్లో కనిపిస్తూ ఉన్నాయి.

శైలీపత్రాన్ని అనుసరించడం అనేది పరిశోధన విధానంలో అత్యంత ముఖ్యమైన విషయం. ఆంగ్లంలో ఒక్కొక్క విభాగానికి వివిధ శైలీ పత్రాలు అమలులో ఉన్నాయి. MLA, Chicago, APA, AAA, CSE , AMA , ACS, Bluebook Stylesheet, ALWD, The New York Times Manual of Style and



Usage, MHRA, Associated Press (AP), Cambridge Style of Referencing మొదలైన శైలీ పత్రాలు (Style Sheets) లభిస్తూ ఉన్నాయి. అయితే తెలుగులో శైలీపత్రం విషయంలో అనేక రకాలైన సమస్యలు ఉన్నాయి. తెలుగుకు ఒక ప్రత్యేకమైన శైలీ పత్రం లేదు. కానీ తెలుగులో పరిశోధనా పద్ధతికి సంబంధించిన గ్రంథాలు మాత్రం ఉన్నాయి. గంధం అప్పారావు–కాళిదాసు సూర్యనారాయణ – పరిశోధనా పద్ధతులు (1985), డాక్టర్ జయప్రకాష్ – పరిశోధనా విధానం (1990), డాక్టర్ ఆర్.వి.ఎస్. సుందరం – పరిశోధనా పద్ధతులు (1990), ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, హెచ్.ఎస్. బ్రహ్మానంద – సాహిత్య పరిశోధన సూత్రాలు (1997), కుసుమాబాయి, ఎం. కులశేఖర రావు – పరిశోధన సూత్రాలు (2000), బూదరాజు రాధాకృష్ణ : తెలుగు భాషా స్వరూపం (2001), ఆచార్య పులికొండ సుబ్బాచారి – పరిశోధన విధానం (2014), పి. సత్యనారాయణ – సామాజిక శాస్త్రాల్లో పరిశోధన విధానం (2015), ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ – సాహిత్య పరిశోధన కళ : విధానం (2017) మొదలైన పుస్తకాలు లభిస్తున్నాయి. పైన పేర్కొన్న పుస్తకాలన్నీ దాదాపు పరిశోధనా విధానానికి సంబంధించిన అంశాలను చర్చిస్తాయి. కానీ శైలీ పత్రానికి సంబంధించి ఒక ప్రత్యేకమైన విధానం ఉన్నట్లు కనిపించదు. ఆంగ్లంలో ఉన్న శైలీ పత్రాలను తెలుగులో పేర్కొనే ప్రయత్నం చేశారు, కానీ ఒక తెలుగు పరిశోధనకు అవసరమైన ఒక్క ప్రత్యేకమైన శైలీపత్రాన్ని రూపొందించే ప్రయత్నం చేసినట్లు కనిపించదు. శైలీ పత్రాన్ని ఒక ప్రత్యేక అంశంగా బోధించక పోవడం వలన పరిశోధక విద్యార్థులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆంగ్లంలో ఉన్న MLA, APA, CHICAGO మొదలైన శైలీపత్రాలను తెలుగులో ఉపయోగించడం వలన పరిశోధనా పద్ధతిలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి.

**పరిశోధనా విధానం**

పరిశోధనా విధానం అనేది ఎంపిక చేసిన అంశాలను ప్రారంభం నుండి చివరి వరకు పరిశోధించే వ్యూహం. సాహిత్య సమీక్షలు, పరిశోధనా పరిమితి, సేకరించిన సమాచారాన్ని ఆధారాలతో నిరూపణ, సిద్ధాంత గ్రంథం ముగింపు వరకు అవలంబించే శాస్త్రీయ పద్ధతినే పరిశోధనా విధానం అని చెప్పవచ్చు.

పరిశోధనకు సంబంధించి అనేక నిర్వచనాలను వివిధ పరిశోధకులు పేర్కొని ఉన్నారు. వ్యాస పరిమితి కారణంగా వాటిని ఇక్కడ పేర్కొనడం లేదు.

**శైలీ పత్రం (Style sheet) అంటే..**

శైలీపత్రం అనేది నిర్దిష్ట అంశాల జాబితా, వాటిని ప్రదర్శించ డానికి పరిశోధకుడు/రచయిత ఎంచుకున్న విధానం, ఒక నిర్దిష్ట పదం లేదా పదబంధం యొక్క విరామ చిహ్నాలు, సంఖ్యలు, తేదీలు మొదలైనవాటిని తెలియజేస్తుంది. శైలీపత్రం (Style sheet) అనేది ఒక పత్రం (document) యొక్క దృశ్య ప్రదర్శనను (visual presentation) ఒక పద్ధతిలో చేయడానికి సూచనలు లేదా నియమాలను కలిగి ఉన్న రచన, సాధారణంగా వెబ్ డెవలప్ మెంట్ లేదా టైప్ సెట్టింగ్ సందర్భంలో దీనిని CSS (కాస్కేడింగ్ స్టైల్ షీట్స్), XSL (ఎక్స్టెన్సిబుల్ స్టైల్ షీట్ లాంగ్వేజ్) లేదా DSSSL (డాక్యుమెంట్ స్టైల్ సెమాంటిక్స్ అండ్ స్పెసిఫికేషన్ లాంగ్వేజ్) వంటి వివిధ భాషల్లో రాయవచ్చు.

**CSS (కాస్కేడింగ్ స్టైల్ షీట్స్) :** CSS అనేది ప్రజెంటేషన్ మరియు కంటెంట్ ను వేరుచేసే విస్తృతంగా ఉపయోగించే స్టైల్ షీట్ శీర్షికలు, పేరాగ్రాఫ్ లు మరియు పట్టికలు వంటి ఒక పరిశోధన యొక్క వివిధ అంశాల శైలిని నిర్వచించడానికి దీనిని ఉపయోగిస్తారు.

**XSL (ఎక్స్టెన్సిబుల్ స్టైల్‌షీట్ లాంగ్వేజ్) :** XSL అనేది ఒక స్టైల్ షీట్ లాంగ్వేజ్, ఇది XML డాక్యుమెంట్ లను HTML లేదా PDF వంటి ఇతర ఫార్మాట్‌లుగా మార్చడానికి ఉపయోగించ బడుతుంది. అధ్యాయాలు, విభాగాలు మరియు ఉప విభాగాలు మొదలైన అంశాల శైలిని నిర్వచించడానికి దీనిని ఉపయోగించవచ్చు.

**వర్డ్ ప్రాసెసింగ్ సాఫ్ట్ వేర్ :** మైక్రోసాఫ్ట్ వర్డ్ లేదా గూగుల్ డాక్స్ వంటి చాలా వర్డ్ ప్రాసెసింగ్ సాఫ్ట్వేర్లలో బిల్ట్–ఇన్ స్టైల్‌షీట్ ఫంక్షనాలిటీ కూడా ఉంటుంది. శీర్షికలు, పేరాగ్రాఫ్‌లు మరియు ఉల్లేఖనాలు వంటి వివిధ అంశాలకు స్థిరమైన ఫార్మాటింగ్ సృష్టించ డానికి ఈ శైలీ పత్రాలు అనుమతిస్తాయి.

**శైలీ పత్రాల ఉపయోగాలు :**

అకడమిక్ పరిశోధనలో శైలీ పత్రాల ప్రధాన ప్రయోజనం పరిశోధకుడు పరిశోధనా పనిని సరిగ్గా అర్థం చేసుకోవడం, దాని నిర్మాణాన్ని నిర్ణయించడం.

ఒక స్థిరమైన ఉల్లేఖన పద్ధతి (Reference Format) ద్వారా పాఠకులు ఏదైనా ఇన్–టెక్స్ట్ మూలాన్ని ఉపయోగించి పరిశోధనా గ్రంథంలోని ఉల్లేఖనాలను సులభంగా సమీక్షించవచ్చు. ఫుట్ నోట్‌లు లేదా ఎండ్ నోట్ లు ఒక పద్ధతిలో పేర్కొనవచ్చు.

కొటేషన్ ఎక్కడ నుండి వచ్చిందో అర్థం చేసుకోవడానికి ఇది సహాయపడుతుంది.

సరైన ఉల్లేఖనాలు పాఠకులను తెలుసుకోవడానికి ప్రోత్సహిస్తాయి. ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తాయి.

పరిశోధన యొక్క మూలం, భావన, దాని అనుకూలత, ఔచిత్యాన్ని పరీక్షించడానికి, గుర్తించడానికి శైలీ పత్రం సహాయ పడుతుంది.

ఖచ్చితమైన డేటా లేదా రికార్డులు ఇందులో ఉపయోగించ బడతాయి.

పరిశోధకుడు ఇతరుల అభిప్రాయాలతో ఏకీభవించినా, ఏకీభవించక పోయినా వారి మాటలను ఉపయోగించినప్పుడు, వారికి గుర్తింపు (credit) ఇవ్వాలి. అది కొటేషన్ గుర్తులు మరియు ఉదాహరణలు రెండింటిని ఉపయోగించడం ద్వారా రెఫరెన్స్ గా చెప్పడానికి ఉపయోగపడతాయి.

పరిశోధకుడు ఉపయోగించిన సమాచారాన్ని పాఠకులకు మార్గనిర్దేశం చేయడం, తద్వారా తరువాత పరిశోధకులు వాటిని తిరిగి పరిశీలించడానికి అవకాశం ఉంది.

**రెఫరెన్సు (ఉల్లేఖనం) అంటే :**

రెఫరెన్సు అనేది ఒకరి పనిని గుర్తించడానికి ఉపయోగించే ఒక పద్ధతిగా నిర్వచించవచ్చు. పరిశోధకుడి ఆలోచనకు మద్దతు ఇవ్వడానికి/వ్యతిరేకించడానికి ఇతరుల పనిని ఉదాహరించడం. ఒక రెఫరెన్స్ లో సాధారణంగా రచయిత పేరు, రచన పేరు, ప్రచురణ తేదీ, మరియు ప్రాంతం పేరు ఉంటాయి. ప్రచురణ సంస్థ యొక్క శీర్షిక, పత్రిక యొక్క శీర్షిక లేదా పుస్తకం పేరు, పరిశోధన శీర్షిక మొదలైన అంశాలు ఉంటాయి. రెఫరెన్సు రెండు స్థాయుల్లో చేయబడుతుంది. ముందుగా క్లుప్తంగా.. 'ఇన్-టెక్స్ట్ సైటేషన్' అని పిలువబడే టెక్స్ట్‌బాడీలో రెఫరెన్స్, రెండవది వివరణాత్మక రెఫరెన్స్... డాక్యుమెంట్ చివర జాబితా రూపంలో ఉంటుంది.

**రెఫరెన్సింగ్ (ఉల్లేఖనం) యొక్క ఉద్దేశ్యాలు :**

అకడమిక్ రచనలో రెఫరెన్సింగ్ ఒక అవసరమైన అంశం. పని మూలాన్ని కనుగొనడానికి ఉపయోగించబడుతుంది, తద్వారా ప్రతి ఒక్కరూ సమాచారాన్ని ఉపయోగించుకోవచ్చు. మరొక ఉద్దేశ్యం గ్రంథ చౌర్యాన్ని (plagiarism) దూరం చేయడం.

**శైలీ పత్రం యొక్క నిర్మాణం**

**శైలీపత్రంలో నాలుగు అంశాలు :**


**1. సాధారణ వ్యాఖ్యలు :** ఇందులో వ్యాసం యొక్క ఉద్దేశ్యం, చదివే ప్రేక్షకులు లేదా ఇతర ప్రత్యేక సూచనల గురించి గమనికలు ఉండవచ్చు.

**2. శైలీకి సంబంధించిన విషయాలు**

**స్పెల్లింగ్ సంప్రదాయాలు :** ఈ విభాగంలో, అసాధారణ పదాలను, ముఖ్యంగా పరిశోధకుడు పేర్కొంటున్న కొత్త పదాలను నిక్షిప్తం చేస్తారు.

**వ్యాకరణం :** వ్యాకరణ సమస్యలను నోట్ చేసుకోవడం (ఏకవచన సర్వనామంగా 'వారు' ఉపయోగించడం వంటివి).

**విరామ చిహ్నాలు :** విరామ చిహ్నాల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించడం : ఏకవచనానికి 'లు' జోడించాలా? (ఉదాహరణకు, 'మార్క్స్ సిద్ధాంతాలు') లేక సాధారణ పద్ధతిలో పేర్కొనాలా ...మొదలైనవి.




**3. ఫార్మాటింగ్ :** ఇటాలిక్స్ చేయాల్సిన అవసరం, ఉప శీర్షికలను బోల్డ్ లో ఉంచడం మొదలైన అంశాలు.

**4. అదనపు వ్యాఖ్యలు :** మునుపటి అంశాలకు చెందని ఇతర ముఖ్య విషయాలను జోడించడం.

**ఆంగ్లంలోని వివిధ శైలీపత్రాల క్లుప్త పరిచయం**

**ఎమ్మెల్యే స్టైల్ షీట్ :** ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ 9వ ఎడిషన్ :(MLA)

ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ ను గతంలో ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ ఫర్ రైటర్స్ ఆఫ్ రీసెర్చ్ పేపర్స్ (1977–2009) అని పిలిచేవారు. ఇది మొట్టమొదట 1951 లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా యొక్క ఆధునిక భాషా సంఘంచే ప్రచురించబడింది. 1977 నుంచి 1999 వరకు వెలువడిన తొలి ఐదు ఎడిషన్లతో 28 పేజీల సదస్సుల సమాహారంగా ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత దీనికి ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ ఫర్ రైటర్స్ ఆఫ్ రీసెర్చ్ పేపర్స్, థీసిస్, డిసెర్టేషన్స్ అనే పేరు పెట్టారు. 2003 ఆరవ ఎడిషన్ కు ఎమ్మెల్యే హ్యాండ్ బుక్ ఫర్ రైటర్స్ ఆఫ్ రీసెర్చ్ పేపర్స్ అని పేరు పెట్టారు.

### APA Style Sheet

పరిశోధకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సలహాదారులు మరియు విద్యార్థులతో సహా 1,46,000 మందికి పైగా సభ్యులను కలిగి ఉన్న అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ (APA), యునైటెడ్ స్టేట్స్ మనస్తత్వవేత్తల అతిపెద్ద శాస్త్రీయ మరియు వృత్తిపరమైన సంఘం. పాఠకులకు శాస్త్రీయ రచనను చదవడం సులభతరం చేయడానికి, మనస్తత్వవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు మరియు వ్యాపార నిర్వాహకుల సమూహం 1929లో సమావేశమై సరళమైన ప్రక్రియలు లేదా శైలీ మార్గదర్శకాలను రూపొందించడానికి బయలుదేరింది. ఇది 2009లో దాని ఆరవ ఎడిషన్‌లో విడుదలైంది, అప్పటి నుండి ఇది అనేక మార్పులకు గురైంది.

### Chicago Manual of Style

చికాగో ఒక డాక్యుమెంటేషన్ శైలి 1906 నుండి చికాగో యూనివర్సిటీ ప్రెస్ ద్వారా ప్రచురించబడింది. ఈ ఉల్లేఖన శైలి లో అమెరికన్ ఆంగ్లంలో సాధారణమైన వ్యాకరణం మరియు విరామ

చిహ్నాల నియమాలు ఉన్నాయి. చికాగో శైలీపత్రం రెండు ప్రాథమిక డాక్యుమెంటేషన్ వ్యవస్థలను అందిస్తుంది. సాహిత్యం, చరిత్ర మరియు కళలతో సహా మానవీయ శాస్త్రాలలో చాలామంది శైలీపత్రాన్ని ఇష్టపడతారు.

ఒక్కొక్క శైలీ పత్రం ఒక్కొక్క రచనా పద్ధతిని అనుసరిస్తున్నాయి. పరిశోధకుడు తన పరిశోధనకు అనుకూలమైన శైలీ పత్రాన్ని ఎంపిక చేసుకోవడం ఉత్తమం.

**తెలుగులో శైలీపత్ర సమస్యలు**

Intext Citation :

ఈ పద్ధతిని ఉపయోగించడం వలన తెలుగులో కొన్ని ప్రత్యేక సమస్యలు ఉన్నాయి. కేవలం రచయిత ఇంటిపేరు సంవత్సరం, పుట ఇవ్వడం వలన పాఠకుడికి స్పష్టమైన సమాచారం తెలుసుకోవడం కష్టం అవుతుంది. ఉదాహరణకు ముదిగొండ అనే ఇంటి పేరుతో ముదిగొండ వీరభద్రయ్య, ముదిగొండ శివప్రసాద్, ముదిగొండ వీరభద్రరావు పలు రచనలు చేశారు. అలాగే కొలకలూరి ఇంటి పేరుతో కొలకలూరి ఇనాక్, కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి ఆశాజ్యోతి.. రచయితలుగా తెలుగులో ఉన్నారు. కేవలం ఇంటిపేరునే సూచించి పుస్తకం పేరు ఇవ్వకపోతే చాలా ఇబ్బందులు వస్తాయి. అలాగే ఒకే సంవత్సరము ఒక రచయిత ఒకటి కంటే ఎక్కువ పుస్తకాలు రచించినప్పుడు పాఠకుడికి ఏ పుస్తకాన్ని పరిశోధన గ్రంథంలో పేర్కొన్నారో తెలియదు.

**ఫాంట్ (ఖతి) మరియు ఇతర సమస్యలు :**

ఆంగ్లంలో Times new Roman ఫాంట్ అనేటువంటిది పరిశోధన గ్రంథంలో ఉపయోగిస్తున్న ఖతి. ఫాంట్ సైజ్ 12లో ముద్రిస్తున్నారు. కానీ తెలుగులో ఎక్కువగా ఉపయోగించేది అను ఫాంట్స్, యూనికోడ్ ఫాంట్స్. సిద్ధాంత గ్రంథానికి సంబంధించి ఒక ప్రత్యేకమైన ఫాంట్ సైజు లేదు. పరిశోధకుడు ఫాంటు సైజును తన పరిశోధన గ్రంథంలో ఉన్న పుటలను బట్టి నిర్ణయించుకుంటు న్నాడు. కొంతమంది పరిశోధకులు ఫాంట్ సైజ్ 20 ఉపయోగిస్తుంటే మరి కొంతమంది పరిశోధకులు 16 ఫాంట్ సైజు ఉపయోగిస్తు న్నారు. ఒక ప్రామాణికమైన పద్ధతి లేదు.

Capital letters, Small letters, Articles :

ఆంగ్లంలో ఎక్కడ క్యాపిటల్ లెటర్స్ వాడాలి ఎక్కడ స్మాల్ లెటర్స్ వాడాలి? ఎక్కడ ఆర్టికల్స్ వాడాలి? అంశానికి సంబంధించి ప్రత్యేకమైన నియమాలు ఉన్నాయి. తెలుగులో అటువంటి నియమాలు లేవు.

*Italics :*

ఆంగ్లంలో పుస్తకానికి సంబంధించిన శీర్షికను ఇటాలిక్సులో ఉపయోగిస్తారు. అలా ఉపయోగించడం వలన పుస్తకం యొక్క శీర్షిక ప్రత్యేకంగా కనిపిస్తుంది. కానీ తెలుగులో చాలామంది పరిశోధకులు ఈ పద్ధతిని అనుసరించడం లేదు.

**ఆధార గ్రంథాలు VS ఉపయుక్త గ్రంథాలు :**

పరిశోధకుడు పరిశోధనకు ఎంపిక చేసుకున్న ప్రధానమైన అంశాన్ని ప్రధాన ఆధార విషయంగా, రచనలను ఆధార గ్రంథాలుగా పేర్కొంటారు. శాసనాలు, మౌఖిక సమాచారం పత్రికలు మొదలైన అంశాలపై పరిశోధన చేస్తున్నప్పుడు ఆయా అంశాలు ప్రధాన విషయాలుగా పరిశోధకుడు పేర్కొనవచ్చు. ప్రధాన విషయాన్ని విశ్లేషిస్తున్న సందర్భంలో వివిధ రకాల సమాచారాన్ని పరిశోధన గ్రంథంలో ఉపయోగించవలసి ఉంటుంది. అలా ఉపయోగించుకున్న సమాచారాన్ని ఉపయుక్త గ్రంథ సూచికలో పేర్కొంటారు. ఉపయుక్త గ్రంథ సూచికలో పుస్తకాలను అక్షరక్రమంలో పేర్కొనడం అనేటువంటిది ముఖ్యమైన అంశం. అక్షర క్రమంలో పేర్కొన్న సందర్భంలో సంఖ్యలను (Numbers) పేర్కొనవలసిన అవసరం లేదు . తెలుగులో కొంతమంది పరిశోధకులు ఉపయుక్త గ్రంథ సూచికలో ఒక పద్ధతి అనేది లేకుండా వారికి నచ్చినట్లు ఆధార గ్రంథాలను పేర్కొంటున్నారు. చాలా సందర్భాలలో ఆధార గ్రంథాలకు ఉపయుక్త గ్రంథ సూచికకు భేదం తెలియడం లేదు. ఆధార గ్రంథాలను, ఉపయుక్త గ్రంథాలను ప్రత్యేకంగా పేర్కొనవలసిన ఆవశ్యకత ఉంది.

**ముఖపత్రం, అలంకారాలు ఉపయోగించడం :**

కొంతమంది పరిశోధకులు తెలుగుతోపాటు ఆంగ్లంలో కూడా శీర్షికను పేర్కొంటున్నారు అటువంటి సందర్భంలో తెలుగులో ఉన్న పదానికి ఆంగ్లంలో ఉన్న పదానికి సంబంధించిన స్పెల్లింగ్ చూడాలి. ఒకవేళ అవసరార్థం తెలుగు శీర్షికను ఆంగ్లంలో ఉపయోగించాలి అనుకుంటే phonetic chart ను ఉపయోగించి రోమన్ స్క్రిప్ట్ లో పేర్కొనటం ఉత్తమం. ఆంగ్లంలో ఉన్న శైలీ పత్రాన్ని అనుసరించి ముఖపత్రానికి ఏ రకమైనటువంటి అలంకారాలు ఉపయోగించ కూడదు. కానీ తెలుగులో విభిన్నమైనటువంటి అలంకారాలు రంగులను ఉపయోగించి ముఖపత్రాన్ని ముద్రిస్తున్నారు.

**పుట సంఖ్య** (page number) :

పరిశోధన గ్రంథంలో పుట సంఖ్యను పేర్కొనేటప్పుడు పాఠకుడికి తెలిసేలా సౌకర్యవంతంగా ఉండాలి. కొన్ని సందర్భాలలో కొంతమంది పరిశోధకులు పరిశోధన గ్రంథంలో ఎడమవైపు చివర పుట సంఖ్య ఇవ్వడం వలన బైండింగ్ లో ఉన్న సమస్యల కారణంగా పుటసంఖ్య సరిగా కనిపించదు.

**అధ్యాయాల విభజన :**

ఆంగ్ల శైలీ పత్రాలను అనుసరించి ఒక సిద్ధాంత గ్రంథంలో నాలుగు నుంచి ఆరు అధ్యాయాలు ఉండడం సమంజసంగా

ఉంటుందని పేర్కొంటారు. అలాగే ప్రతి అధ్యాయంలో ఉన్న పుటల సంఖ్య దాదాపు ఒకే విధంగా ఉండాలి అని పేర్కొన్నారు. కానీ తెలుగులో అధ్యాయాల విభజన, సంఖ్య రెండు కూడా భిన్నంగానే ఉంటాయి. కొన్ని సిద్ధాంత గ్రంథాలలో ఒక అధ్యాయం 100 పేజీలు ఉంటే మరొక అధ్యాయం 10 పేజీలలో ముగుస్తుంది. కొంతమంది పరిశోధకులు సిద్ధాంత గ్రంథాన్ని 10 అధ్యాయాలకు పైగా విభజించి నచ్చిన పద్ధతిలో పుటల సంఖ్యను ఉంచుతున్నారు.

**ఒక ప్రాంతానికే పరిమితమైన పదాలు లేదా మాండలిక పదాలు:**

ఆంగ్లంలో ప్రత్యేకమైన పదాలను ఫుట్ నోట్సుల కింద వివరంగా పేర్కొంటారు. అలాగే తెలుగుభాషకు లేదా ఒక ప్రాంతానికే పరిమితమైన కొన్ని పదాలను ఫుట్‌నోట్సుల కింద వివరంగా పేర్కొనాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు రాయలసీమ ప్రాంతంలో మోడీ కాళ్లు, తిరమందారులు అనేవి ఒక సంప్రదాయ విధానంతో నివసిస్తున్న వర్గాన్ని తెలియజేసేటువంటిది. వీరి మధ్య వివాహ సంప్రదాయాలు కొనసాగవు. ఇటివంటి విషయాలను ప్రత్యేకంగా వివరించాలి.

**అనుబంధాలు :**

పరిశోధకుడు పరిశోధన చేస్తున్న సందర్భంలో వివిధ రకాలైన అదనపు సమాచారం లభిస్తుంది. ఆ అదనపు సమాచారాన్ని పేర్కొనడం వలన సిద్ధాంత గ్రంథానికి పాఠకుడికి ఉపయోగం ఉంటుందని భావించినప్పుడు ఆ సమాచారాన్ని అనుబంధంలో పేర్కొనవచ్చు.

**తెలుగు పరిశోధన గ్రంథాలలో శైలీ పత్రానికి సంబంధించి గమనించిన విషయాలు :**


కొన్ని సందర్భాలలో కొందరు పరిశోధకులు రెండు మూడు శైలీ పత్రాలను సిద్ధాంత గ్రంథంలో ఉపయోగించడం జరుగుతూ ఉంది.

సిద్ధాంత గ్రంథంలో అనుకూలమైన చోట అనుకూలమైన శైలీ పత్రాన్ని ఉపయోగిస్తున్నారు.

కొన్ని సిద్ధాంతగ్రంథాలలో ఏ రకమైన శైలీ పత్రాన్ని అనుసరించ కుండా నచ్చిన పద్ధతిలో రెఫరెన్సులు ఇస్తూ వెళ్తున్నారు.

మరికొంతమంది పరిశోధనా పద్ధతిలో శైలీ పత్రం అంటే ఏమిటో కూడా తెలియడం లేదు.

**ముగింపు :** ఇటీవల కాలంలో పరిశోధనా పద్ధతి పైన సదస్సులు కానీ, కార్యశాలలుగానీ జరగడం లేదు. ఈ కారణం వలన పరిశోధన గ్రంథాన్ని రచిస్తున్నప్పుడు పలు రకాలైన సమస్యలు పరిశోధకుడికి ఎదురవుతున్నాయి. MLA Style Sheet అయిదు ఎడిషన్ ను ఇప్పటికీ ఉపయోగించడం జరుగుతూవుంది. దీని తర్వాత MLA ఎడిషన్ లో అనేక రకాలైనటువంటి మార్పులు చోటుచేసుకున్నాయి ముఖ్యంగా ఎలక్ట్రానిక్ సోర్సెస్, ఆడియో వీడియో ఫైల్స్ మొదలైన




వాటిని సిద్ధాంత గ్రంథంలో పొందుపరచడంలో అవగాహన లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నిటికీ పరిష్కారంగా ఒక ప్రామాణికమైన శైలీ పత్రాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిశోధన పద్ధతిలో వచ్చిన విషయాలు తెలుగు పరిశోధకులకు తెలియజేయవలసిన అవసరం ఉంది. MLA స్టైల్ షీట్ లో 29 రకాల ఉల్లేఖనాల పద్ధతులు ఉన్నాయి. వాటిని తెలుగు భాష, సంస్కృతులకు అనుగుణంగా మార్చుకొని ఉపయోగించుకోవలసిన ఆవశ్యకత తెలుగు పరిశోధనకు ముఖ్యం.

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

**తెలుగు :**

చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం., బ్రహ్మానంద, హెచ్ ఎస్. సాహిత్య పరిశోధన సూత్రాలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.

జయప్రకాష్, ఎస్ . పరిశోధన విధానం హైదరాబాద్ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 2003.

సుబ్బాచారి, పులికొండ. పరిశోధనా విధానం సిద్ధాంత గ్రంథ రచన. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం 2014.

**English**

MLA Handbook. New York: The Modern Language Association of America, 2021.

Hacker, Diana. A Pocket Style Manual, APA Version. Boston: Bedford/St. Martins, 2020.

Kate L. Turabian. Chicago Guides to Writing, Editing, and Publishing. Chicago: University of Chicago Press, 2022.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 14 హైదరాబాద్ మే : 2024

# సాక్ష్యాన్ని కౌగిలించుకోండి

**దొంతం చరణ్,** ఫోన్ : 90002 15466

అమ్మను పిలవడానికీ, పాలు తాగడానికీ
పెదవులు లేవు
నవ్వులనూ లాలిపాటలనూ వినడానికి
చెవులు లేవు
కాసింత ప్రేమగాలిని పీల్చడానికి
దేహంలో జీవం లేదు
బాంబు పొగలో చర్మం ఆవిరై
దేహం ఛిన్నాభిన్నమై నేను దొరికితే..
మా అమ్మ పెట్టిన ముద్దుల ఆనవాళ్లు
కనిపించడం లేదని గుర్తు చేయకండి.

అమ్మ వొడిలో తలవాల్చిన తల
ఇప్పుడు నా దేహానికి లేదని





గుర్తు చేయకండి.
మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి

చూడ్డానికి కళ్ళు లేవు
స్పర్శించడానికి చేతుల్లేవు
ఆమె పాదముద్రల్లో పాదాలేసి నడవటానికి
కాళ్ళు లేవు
మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి

నాకోసం పరిగెత్తుకుంటూ వస్తుందని నాతో చెప్పకండి
దొగ్గాడుతూ ఎదురెల్లటానికి
నేనిప్పుడు పసిపాపను కాదు
మాంసం ముద్దనూ కాదు
ఒట్టి బొక్కల చూరను.
మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి

మళ్ళీ నా పేరును నాకే గుర్తు చేయకండి
చనిపోయిన నాతోటి పసిపిల్లల పేర్లను గుర్తు చేయకండి
ఇది బాల్యానికి చోటులేని దేశమని గుర్తు చేయకండి
రొట్టె ముక్కలను బాంబులు లాక్కుంటాయని
గుర్తు చేయకండి

అస్థిపంజరం అనే పేరు గాంచిన
బొక్కలగూడు మాత్రమే నేను.
కూల్చబడ్డ ఆసుపత్రి గోడల కింద
నేను అస్థిపంజరమై దొరికితే
నన్ను కౌగిలించుకోడానికి నిరాకరించకండి

చచ్చిన మానవీయతకు
బాల్యాన్ని రుచి చూడని
ఈ అస్థిపంజరాలే సాక్ష్యం.
సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!
మనసారా సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!!

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 (15) హైదరాబాద్ మే : 2024

# భావుకత, మానవతల కళాత్మక కలయిక

**తెలకపల్లి రవి,** ప్రముఖ రచయిత, ఫోన్ : 94900 99444

శంకరాభరణం అసాధారణ విజయం తర్వాత కాశీనాథుని విశ్వనాథ్ అంటే సంగీత నృత్య భరిత చిత్రాల సృష్టికర్తగానే ముద్రపడి పోయింది. ఆయన చిత్రాల్లో సామాన్య మానవునికీ, మానవతకూ పెద్దపీట వేశారనే అంశం అవసరమైనంతగా గుర్తింపు నోచలేదు. మనుషులు మనుషుల్లా ప్రవర్తించడమే మానవత్వం. చరిత్రలో పునర్వికాస యుగం ఇందుకు ప్రేరణ. మానవ కేంద్ర సిద్ధాంతం వంటివి అలాగే వచ్చాయి. దేవుళ్లు, ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు ఏవి ఏమైనా మానవ చైతన్యం సుఖదుఃఖాలు, జయాపజయాలు, సేవ, త్యాగం ప్రతిభ వంటివి ఇందులో కీలకపాత్ర వహిస్తాయి. మనిషి అన్నప్పుడు ఏ మనిషైనా కావచ్చు. ఏ విధమైన అంతరాలు హెచ్చు తగ్గులు లేని రీతిలో ఆ మనిషి ప్రస్థానం. అచ్చమైన సంప్రదాయవాదిగా ఉన్నత శిఖరాలు అధిష్ఠించిన ఈ దర్శకుడు వాస్తవంలో అంతే ప్రయోగశీలి. ప్రతిభాశాలి. కనుకనే మనిషిని విభిన్న కోణాల్లో చూపగలిగారు. ప్రతికథలో మానవత్వాన్ని ప్రతిష్టించారు.

ఈ పరిశీలన మొదలెట్టే ముందు విశ్వనాథ్ చిత్రాలను రెండు మూడు దశలుగా విభజించుకోవలసి వుంటుంది. **తొలి దశలో కథాత్మక చిత్రాలు. మలిదశలో సామాజిక ఇతివృత్తాలు. మూడో దశలో కళాత్మక సృజనలు.**

తొలి చిత్రం **ఆత్మగౌరవం**. పేరుకు తగ్గట్టే మధ్యతరగతి మనిషి ఆత్మగౌరవ కథ. దర్శకత్వంలో అక్కినేని నాగేశ్వరరావు ఇచ్చిన తొలి అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు.

ఎన్టీఆర్‌తో **నిండు హృదయాలు** కూడా వీధిబాలలుగా మొదలైన ముగ్గురు హీరోలు పరస్పర సహకారంతో సంఘర్షణలతో పెరగడం, అదే ఎన్టీఆర్‌తో తీసిన **కలిసొచ్చిన అదృష్టం** పిల్లల భవిష్యత్తుకోసం సంపన్నుల ఇంటికి కొడుకును దత్తు ఇచ్చిన తల్లి మాతృత్వవేదన ఆ బిడ్డ సంఘర్షణ, అదృష్టం అనే నమ్మకం మిథ్య అని మనుషుల నడవడికే కీలకమని సందేశమిస్తుంది. నువ్వు నా తనయుడివి కానేకాదని చెప్పమ్మా అంటూ ఎన్టీఆర్ తన శైలిలో పాడుతుంటే తల్లిగా శాంతకుమారి పడే వేదన కదిలించేస్తుంది.

ఎన్టీఆర్, జగ్గయ్య **చిన్ననాటి స్నేహితులు**గా నటించిన అదే పేరు గల సినిమా. ఈ చిత్రంలో ఎన్టీఆర్ జగ్గయ్యల స్నేహబంధం, ఎన్టిఆర్, దేవికల దాంపత్య బంధం,స్నేహితుడి కుమార్తె వాణిశ్రీ, శోభన్‌బాబుల జీవితంలో వచ్చిన పెనుతుఫాను నుంచి బయట పడేసేందుకు ఈ దంపతులు చేసే త్యాగం ఇవన్నీ మానవీయ కోణం



లోనే వుంటాయి. ఎన్టీఆర్ వంటి మాస్ హీరో ఈ చిత్రంలో ఒక తరహా క్యారెక్టర్ పాత్ర ధరించి సంయమనంతో నటించారంటే ఆ ఘనత విశ్వనాథ్‌కే దక్కుతుంది.

**ఉండమ్మా బొట్టుపెడతా** టైటిల్ చెబుతున్నట్టే సెంటిమెంటల్ చిత్రమైనా ఓ హరిదాసు ఆయన కుమార్తె (ధూళిపాల, జమున) జీవితాన్ని ఆర్ద్రంగా చిత్రిస్తుంది. అనుకోని పరిస్థితుల్లో కలవారి కోడలుగా కృష్ణ భార్యగా వెళ్లిన ఆమె కుటుంబం కోసం ప్రాణత్యాగం చేయడం జానపదాల్లో వినే ముసలమ్మ మరణం లాటి కథ. ఈ చిత్రంలోనే **రావమ్మా మహాలక్ష్మి రావమ్మా** పాట సంక్రాంతికి తప్పనిసరి. ఈ తరహా దైవమహిమ చిత్రం విశ్వనాథ్ మళ్లీ తీయలేదు.

బాలయ్య నిర్మాతగా విశ్వనాథ్ శోభన్‌బాబుతో తీసిన **చెల్లెలికాపురం** సెంటిమెంటుతో పాటు సాహిత్య పరంగానూ మానవ సంబంధాల పరంగానూ ఉదాత్త సందేశమిస్తుంది. కేవలం తన నల్లటి ఆకారం, పల్లెటూరి నేపథ్యం కారణంగా సంకోచంతో వెనకబడి పోయిన ఒక మంచి రచయిత రచనలను మాటకారి స్నేహితుడు (నాగభూషణం) సొమ్ము చేసుకుంటూ మోసం చేస్తుంటే నాయిక బహిర్గతం చేయడం ఈ కథ. నాయిక వాణిశ్రీ ఈ నాటకం ముగింపజేయడం కోసం చివరలో చేసిన నృత్యం దానికి సినారె రాసిన **చరణ కింకిణులు ఘల్లు ఘల్లు**మన పాట ఓ పెద్ద సంచలనం. నిజానికి అదో ట్రెండ్ సెట్టర్ అయింది. బహుశా తర్వాత కాలంలో ఆయన కళాత్మక ప్రస్థానానికి బీజోపవాసన చేసిందనొచ్చు. ఈ సంస్థలోనే వచ్చిన **నేరము శిక్ష** చిత్రం కూడా విలక్షణమైంది. డబ్బుందనే అహంభావంతో బాధ్యతా రహితంగా ప్రమాదం చేసి ఒక కుటుంబంలో విషాదం నింపిన హీరో(కృష్ణ) తండ్రి మందలింపుతో కనువిప్పు కలిగి ఆ కుటుంబాన్ని ఆదుకోవడం,




శిక్ష అనుభవించడానికి సిద్ధం కావడం ఇందులో ఇతివృత్తం. కోటీశ్వరుల బిడ్డగా ఆషామాషిగా బతికే హీరో పాత్ర ఇప్పుడు మనం చెప్పుకునే ఈజీగోయింగ్ ధోరణికీ, పేదల పట్ల అలక్ష్యానికి ప్రతిబింబంగా వుంటాడు.

ప్రమాదంలోచిక్కిన తమ కుటుంబ రక్షణ కోసం పనివాడు చనిపోతే అతని కూతురైన దళిత బాలికను అనాథగా వదిలేయకుండా పెంచి పెద్ద చేసినా పెళ్లిచేయడానికి పడిన అవస్థల కథ **కాలం మారింది.** కామాంధుడొకడు తను ప్రేమించిన బావను దారుణంగా చంపేస్తే అతని తండ్రినే రెండవ పెళ్లి చేసుకుని పాఠం నేర్పిన **ఓ సీత కథ.** పెళ్లి అంటే భర్త ఆధిక్యత కాదంటూ మాంగల్యానికి మూడు ముళ్లతో పాటు నాలుగో ముడి వేయాలని చెప్పిన **మాంగల్యానికి మరోముడి.** పెళ్లయిన రోజే భర్త పడవ ప్రమాదంలో మరణిస్తే షాక్‌తో మతి తప్పిన అమ్మాయికి మరో జీవితం ఇవ్వడానికి జరిగిన ఘర్షణ **శారద.** పెంపుడు బిడ్డ దారుణ ప్రమాదంలో మరణించడాన్ని భరించలేక పిచ్చిదై పోయిన తల్లి కథ **జీవన జ్యోతి**(వాణిశ్రీ) ఇలా విశ్వనాథ్ చాలా చిత్రాల్లో మానవీయ కోణాలు మమతానురాగాలు కట్టిపడేస్తాయి.

**సిరిసిరిమువ్వ**తో విశ్వనాథ్ కళాత్మక ప్రస్థానంలోమరో మజిలీ ప్రారంభమై **శంకరాభరణం**తో తారస్థాయికి చేరింది. తెలుగుసినిమా చరిత్రలో ఒక అధ్యాయాన్ని సృష్టించింది. ఈ చిత్రాలు ఒక కోణంలో సంగీత నృత్య ప్రధానమైనవిగా కనిపించినా మరో వంక వాటిలో గొప్ప మానవతా సందేశం వుంటుంది. శ్రమ గౌరవం వుంటుంది. సంప్రదాయం పరిధిలోనే సమానత్వం గురించి చెప్పే ప్రయత్నం వుంటుంది. ఈ చిత్రాలు చాలావాటిలో ప్రధాన పాత్రధారులు, సూత్రధారులు సామాన్యులు కావడం వారిపట్ల ఆయన గౌరవాన్ని చెబుతుంది. అంతేగాక శారీరక లోపాలతో పోరాడే పాత్రలు చాలా వుంటాయి. ప్రతి చిత్రంలోనూ మహిళామూర్తులు నిండుగా శక్తివంతంగా కథను నడిపిస్తుంటారు.

సిరిసిరిమువ్వలో నాయికకు మాటలు రావు కాని నృత్యమంటే ప్రాణం. తండ్రిమరణం తర్వాత ఆమెను కాపాడే బాధ్యత తీసుకున్న వ్యక్తి ఓ పనివాడు. పరిస్థితులతో పెనుగులాడి మధ్యలో వచ్చిన అపార్థాలను అధిగమించి ఆమె మనోరథం ఈడేరుస్తాడు. దీని తర్వాత వచ్చిన **సీతామాలక్ష్మి** కూడా పల్లెటూరి పేదమ్మాయి హీరోయిన్ కావడం, తనను ప్రోత్సహించిన ప్రేమికుడు తాత్కాలికంగా దూరం కావడం. ఇదీ సామాన్యుల కథే.

చిరస్మరణీయమైన శంకరాభరణం గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. సంగీత సమ్రాట్ వంటి శంకరశాస్త్రి కాలక్రమంలో మరుగున పడిపోగా అంతకుముందు ఆయన నుంచి ప్రేరణ, రక్షణ పొంది తన గౌరవం కాపాడటం కోసం నిష్క్రమించిన వేశ్యా కుటుంబ యువతి తులసి తిరిగివచ్చి కాపాడటం స్ఫూర్తిదాయకమైన ఇతివృత్తం. సంగీత ప్రమాణాల విషయంలో రాజీలేని శంకరశాస్త్రి కూతురు పెళ్లిచూపుల్లో తప్పు పాడితే మందలించడం ఆయన వ్యక్తిత్వాన్ని చూపిస్తుంది. తన కోపానికి శిక్షగా తనే చేయి కాల్చుకుంటే ఆ కూతురు వచ్చి సరిగా పాడుతూ వెన్న రాయడం ఎవరినైనా కదిలిస్తుంది. మళ్లీ కచేరి మొదలెట్టిన శంకరశాస్త్రి పాడలేకపోతే తన దగ్గర నేర్చుకున్న ఆమె కొడుకు వచ్చి పాడటం గురు శిష్యురాళ్లు ఒకేసారి మరణించడం గొప్ప ముగింపు అవుతుంది. చివరి క్షణంలో శంకరశాస్త్రి ఈ అబ్బాయి నీ కుమారుడా అని తులసిని కళ్లతోనే ప్రశ్నించడం, ఆమె సమాధానమివ్వడం, ఆ కుర్రాడు ఆయన సైగతో పాటను కొనసాగించడం వారసత్వం నిలిచే వుంటుందని చెప్పడానికి సంకేతం. తమను సమాజం, సాటివారు బహిష్కరిస్తే శంకరశాస్త్రి నీకు వంటరాదా అంటూ తులసిని పురమాయించడం, ఆచారాలు అంతరాలు కారాదని స్పష్టం చేయడం సంస్కరణ దృష్టిని ప్రతిబింబిస్తుంది.

**సప్తపది** మరింత సంచలనాత్మకమైన సంస్కరణవాద చిత్రం. వర్ణాంతర వివాహం చేసుకున్నందుకు కూతురును దూరం చేసుకున్న పూజారి ఆమె చనిపోయాక తమ వూళ్లో నృత్య ప్రదర్శనకు వచ్చిన అల్లుడినీ, మనవరాలినీ ఆదరించడం, ఆమెకే చిన్నపూజారిగా వున్న తన మనవడితో పెళ్లి చేయాలనుకోవడం..అయితే అప్పటికే ఆమె ఒక దళిత కళాకారుడిని ప్రేమించినా కూడా అసహాయంగా తలవంచడం, అయితే పెళ్లాడిన రోజునుంచి భర్త సంసారం చేయలేక పోవడం, విషయం తెలుసుకున్న పూజారి తన ఆత్మీయుడైన ధర్మకర్త బోధనతో ప్రభావితుడై వూరినే ఎదిరించి ప్రేమించిన యువకుడితో మనవరాలికి పెళ్లి చేయడం ఇప్పటికీ గొప్ప కథాంశం. ఇందుకోసం ఆయన భిన్న పాత్రల స్వభావాన్ని చెప్పేందుకు దర్శకుడు ఎంచుకున్న సన్నివేశాలు, సంకేతాలు కూడా చాలా గొప్పగా వుంటాయి. సంప్రదాయ నేపథ్యం వున్నా మాలపిల్ల వంటివాటితో పోల్చదగిన సినిమా ఇది. విశ్వనాథ్‌ను సంప్రదాయముద్రకు పరిమితం చేసేవారికి ఘాటైన సమాధానం ఈ చిత్రం. ఇందులో ఆయన దేవత ప్రభావం సూచనగా చెప్పినా మానవతకే పట్టం కట్టడం చూస్తాం. ఈ చిత్రంలో **గోవుల్లు తెల్లన, గోపయ్య నల్లన గోధూళి ఎర్రన ఎందువలన** అనే

ప్రశ్న వాస్తవానికి మన నిచ్చెన మెట్ల సమాజానికి కుల మత అంతరాలకు సంధించిన సవాలు.

**సాగర సంగమం, శ్రుతిలయలు, స్వర్ణకమలం** కళల పట్ల ప్రేమనూ అదే సమయంలో నేర్చుకోవడంలో భిన్న కోణాలనూ చెబుతాయి. గొప్ప కళాభిలాష వున్నా పేదరికం పరిస్థితుల కారణంగా ఉన్నతశిఖరాలు చేరుకోలేక ఆదరించిన అమ్మాయినీ పొందలేక ప్రాణస్నేహితుడి ఆసరాతో భగ్నజీవిగా బ్రతుకు గడుపుతున్న వ్యక్తి కథ సాగర సంగమం. ఇది మరో శంకరాభరణం అనిపించింది. కమల్‌హాసన్ నట జీవితంలో మరో ఆణిముత్యమైంది. ఆ భగ్న కళాకారుడి ప్రతి అడుగూ ప్రతి ఘట్టం గుండెలను కరిగించేలా వుంటాయి. భర్తను పోగొట్టుకుని తిరిగి వచ్చిన నాయిక ఒక కళామూర్తిగా తనను మళ్లీ చేరదీస్తే ఆమె కూతురే అనుమానించడం, అవమానించడం చివరకు నిజం తెలుసుకుని అతను నేర్పిన విద్యను వేదికపై ప్రదర్శించి **మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవో భవ** అంటూ నమస్కరించడం అది చూసి అతను తృప్తిగా కన్నుమూస్తే తల్లి, స్నేహితుడూ తనను చక్రాల కుర్చీలో తీసుకుపోవడం ఎవరికైనా కళ్లు చెమరింపచేసే సన్నివేశం. మానవతా సందేశం కూడా. శ్రుతిలయలులో సంపన్నుడైన ఓ సంగీతాభిమాని ముగ్గురు అనాథలను పెంచి తీర్చిదిద్దితే వారు దారి తప్పిపోవడం. వీరిలో పెద్దవాడి భార్య కుమారుడి సహాయంతో వారిని దారికి తేవడం హృద్యంగా వుంటుంది. స్వర్ణకమలం ప్రతిభ వున్నా నృత్యంపట్ల ఆసక్తిలేని నాయికను నాయకుడు మళ్లీ అటు మళ్లించడం వాస్తవికంగా వుంటుంది. ఈ చిత్రాలన్నిటిలోనూ కళలతో పాటు మానవ సంబంధాలు, భావోద్వేగాలు బాధ్యతాయుత ప్రవర్తన ప్రేక్షకులపై చెరగని ముద్ర వేస్తాయి.

విశ్వనాథ్‌కు ఎంతో ఇష్టమైన **సిరివెన్నెల** ఆయన ప్రయోగ శీలతకు, సాహసికతకూ నిదర్శనం. కళ్లులేని నాయకుడు మాట రాని నాయిక, స్వేచ్ఛగా లేదా విశృంఖలంగా బతికిన మరో నాయిక తర్వాత వీరిద్దరి మధ్యకు వస్తుంది. అతని వేణునాదాన్ని, మధుర గానాన్ని ఆస్వాదిస్తూ చిత్రిస్తూ కూడా పెదవి విప్పి చెప్పలేని నాయిక రాసిన గీతం వానలో తడిసి నీరుగా మారి అతని వేణువులోకి ప్రవహిస్తే తను పాడటం...అద్భుతమైన వూహా కల్పన. ఇందులో కళాత్మకతతో పాటు వారి శారీరక లోపాలను భావనాబలం అధిగమించిందని దర్శకుడు సూచ్యంగా చెప్పడమూ వుంది. వెరసి శారీరక వైకల్యం కళాకారులకు వైఫల్యం కాజాలదని చెప్పడమూ వుంటుంది. ఇందుకోసం ఆయన ఎంత తవన పడ్డారో వూహించవలసిందే. నేను ఆయనను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ చిత్రం క్లైమాక్స్ నాటకీయంగా వుందని అంటే ఆయనకు కొంచెం కష్టం కలిగింది. పెళ్లి పందిరిలో అంతబిల్డప్ చేసి అమ్మాయి




చనిపోయిన సంగతి కప్పి వుంచినా నాయకుడికి తెలియడమే తను చెప్పదల్చుకున్న సందేశమని అన్నారు. వెన్నెల చంద్రుడిలో కలవడమనే భావాన్ని సీతారామశాస్త్రి అద్భుతంగా రాసిన తీరు ఆయనకు ఎంతో ఇష్టమైంది. **జనించు ప్రతి శిశు గళమున పలికిన జీవన నాదతరంగం..చేతన పొందిన స్పందన ధ్వనించు హృదయ మృదంగ ధ్వానం** అన్న సిరివెన్నెల పాట గొప్ప సందేశం. టూరిస్టులకు గైడ్‌గా పని చేసే చూపులేని అబ్బాయిని మహా సంగీత కోవిదుడుగా తీర్చిదిద్దే గైడ్‌గా పనిచేసిన అమ్మాయి తన జీవితంలో ఎక్కడో దారి తప్పిపోయానని బాధపడటం ఒకటైతే, హీరో తాతగారు ఆమెను మనవరాలిలా సమాదరించడం గొప్ప మానవత్వ స్పర్శ.

చిరంజీవి వంటి కమర్షియల్ హీరోతో తీసిన **శుభలేఖ, స్వయంకృషి, ఆపద్బాంధవుడు** చిత్రాలు మూడూ సందేశాత్మకాలే. శుభలేఖ వరకట్నం, నిరుద్యోగం కలిపి చూపించిన సినిమా. అయితే ఇందులో చైతన్యవంతురాలైన నాయికను హీరో ఆదుకోవడం, అతనికంటే బాగా చదువుకున్న ఆమె తన సంస్కారానికి తలవంచడం చాలా సున్నితంగా చిత్రిస్తారు. ఇక స్వయంకృషి అయితే చర్మకారుడైన హీరో కుటుంబం కోసం నిస్వార్థంగా పనిచేసినా వారు సంకుచితంగా







ప్రవర్తించడం అయినా మళ్లీ ఆదరించం, తను గొప్ప వాణిజ్యవేత్తగా ఎదిగినా మూలాలు మర్చిపోకపోవడం.... ఆపద్బాంధవుడులో అత్యాచారానికి గురైన నాయిక మతిస్థిమితం కోల్పోయి ఆస్పత్రి పాలైతే ఆమెను కాపాడేందుకు హీరో పిచ్చివాడిలా నటించి అక్కడ చేరడం విభిన్న వాతావరణాన్ని చిత్రిస్తాయి. చిరంజీవి, మీనాక్షి శేషాద్రి వంటి గ్లామర్ తారలతో ఈ పాత్రలు చేయించడం ఆయనకే చెల్లింది.

సాగరసంగమంలో అనితర సాధ్యమైన అభినయం అందించిన కమల్ హాసన్‌తోనే **స్వాతిముత్యం**లో పరిపక్వత లేని అమాయక పాత్ర చేయించిన తీరుకు ఎవరైనా ముగ్ధులవుతారు, వీపు గోక్కోవడం ఓ విధంగా వూగుతూ నటించడం అడుగడుగునా దర్శకుడు పాత్రను గాక వాస్తవమైన ఒక మనిషినే కళ్లముందుంచారు. ఇందుకోసం వారెంత పరిశీలన జరిపారో వూహించవలసిందే. అయితే ఇలాటి పాత్రను ఎన్నుకుని అంత సజీవంగా రూపొందించడం దర్శకునిలో మానవతా కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఇప్పుడు భిన్న ప్రతిభావంతులు లేదా దివ్యాంగులు అని రకరకాల పేర్లతో పిలుస్తున్న వీరిని కూడా తన అనేక సినిమాల్లో భాగం చేసి విజయాలు సాధించడం విశ్వనాథ్ ప్రత్యేకత. తను మొదటిసారి తెరపై కనిపించిన **శుభసంకల్పం** చిత్రంలోనూ చేపల పరిశ్రమ, మత్స్యకార జీవితంతో పాటు తనకోసం ప్రాణమిచ్చిన శ్రామికనాయకుడి త్యాగాన్ని మహోన్నతంగా చూపించారు. చివరిదశలో తీసిన **స్వరాభిషేకం**లోనూ దళితుడే



సంగీత విద్వాంసులను కాపాడతాడు. మధ్యలో తీసిన జననీ జన్మభూమిలో చేనేత కార్మిక జీవితం చూపిస్తారు. **సూత్రధారులు** చిత్రంలోనైతే పీడనను, దోపిడీని నిర్మూలించాలనే భావాన్ని కూడా సంప్రదాయ పద్ధతిలోనే కామ క్రోధ మద మాత్సర్యాలకు అంత్యక్రియలు చేయడంలా చెప్పించారు. బోద్దారో మత్సర గ్రస్తా అన్న భర్తృహరి సూక్తిని కథగా మలచిన చిత్రం **స్వాతి కిరణం.** ఇందులోనూ చిన్న టీ కొట్టు నడుపుకొనే సామాన్య దంపతులు గొప్ప గాన ప్రతిభ వున్న తమ చిన్నారిని తీర్చిదిద్దుతారన్న నమ్మకంతో సంగీత విద్వాంసుడికి అప్పజెబితే ఈర్ష్యాళువుగా మారి వాడు తన ప్రాణం తీసుకోవడానికి కారణమవుతాడు. మానవత్వ చిత్రణతో పాటు మనుషులలో మత్సరం కూడా చెప్పే ప్రయత్నమిది. పిల్లాడు చనిపోవడం ప్రేక్షకులకు నచ్చకపోవడం వల్లనే ఆ చిత్రం పరాజయం పాలైందని విశ్వనాథ్ అన్నారు గానీ నిర్దేశకుడి ఉద్దేశం గొప్పగానే చెప్పగలిగారు.

ఇలా చెబుతూ పోతే విశ్వనాథ్ చిత్రాల్లో అత్యధికం మానవతకు, మనిషికి పట్టం కట్టిన మనోజ్ఞ ప్రయోగాలు. వీటిలో చాలావరకూ కొత్త నటీనటులకూ ద్వితీయ శ్రేణి వారికీ కూడా అవకాశమిచ్చి వెలుగులోకి తెచ్చారు. తమ తక్కువ బడ్జెట్‌లో అంతకంటే పెద్ద తారలను తీసుకునే అవకాశం కూడా తక్కువేనని వాస్తవికంగా చెప్పిన వినయశీలి ఆయన. సంగీతం ఛాయాగ్రహణం, కళ తదితర సాంకేతికాంశాల్లోనూ విశ్వనాథ్ ముద్ర ప్రత్యేకమైంది. వేటూరి సుందరరామమూర్తి, సిరివెన్నెల సీతారామశాస్త్రి వంటి ప్రతిభావంతులను తొలిగా ప్రోత్సహించడంలోనే ఆయన ప్రజ్ఞ ప్రస్ఫుటమవుతుంది. తన మలిదశ చిత్రాలలో ఆయన సనాతన పద్ధతిని ఎన్నుకున్నారు. వాటిలో సంప్రదాయ జీవులు ప్రముఖంగా కనిపిస్తున్నా విశ్వనాథ్ చిత్రాల్లో సూత్రధారులుగా లేక ప్రోటోగనిస్టులుగా, కార్యసాధకులుగా మామూలు మనుషులను, మహిళలను, శ్రమజీవులనే ఎన్నుకున్నారు. దైవభావన చిత్రాలలో వున్నా గాని శ్రుతిమించిన మూఢాచారాలను నెత్తి కెత్తుకోలేదు. విమర్శనాత్మకంగా చూసినా ఈ వాస్తవాన్ని గుర్తించవలసి వుంటుంది. మనుషులే కీలకంగా పనిచేస్తారు. వారి మానవత్వమే గొప్పది. సహజ పరిస్థితులే తప్ప సంచలనం కోసం కృత్రిమమైన హడావుడి, కల్పిత సన్నివేశాలు అవాస్తవ, అనారోగ్యకర పోకడలు వుండవు. అందుకే ఆయన స్మరణీయ, మానవీయ, సృజనకారుడు. అందుకే ఈ దేశం దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ప్రదానంచేసి ఆయనను గౌరవించుకుంది.



ISSN 2457-0796 UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 19 హైదరాబాద్ మే : 2024

# శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిర్వహణలో ప్రముఖుల కృషి

**బి. లింగరాజు,** తెలుగు పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9640 346 316

**రావిచెట్టు రంగారావు**

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనలో ప్రథమ స్మరణీయులు రావిచెట్టు రంగారావు గారు. నల్లగొండ జిల్లా దండంపల్లి గ్రామంలోని మాతామహుల ఇంట్లో 1877 డిసెంబర్‌లో జన్మినారు. రంగారావు తల్లి దండ్రులు వెంకటమ్మ, నరసింహారావు (భూస్వామి,మున్సబ్ దార్). ఈయన చిన్నతనంలో తల్లిదండ్రులు గతించటం వల్ల స్వయంకృషితో పైకి వచ్చారు.



రావిచెట్టు రంగారావు

రంగారావు గారు దేశంలో స్వదేశీ ఉద్యమం రాకముందే స్వదేశీ వస్తువుల విక్రయశాలలు స్థాపించి, ఆ ఉద్యమానికి నాంది పలికారు. 1908 లో మూసీనది వరదల సమయంలో ధన, ప్రాణ నష్టం జరిగింది. ఆ విపత్కర సమయంలో నిరాశ్రయులైన ప్రజలకు వసతి కల్పించి ఆదుకొన్నారు. ఎందరో పేద విద్యార్థులను తన ఇంట్లో ఉంచుకొని ఉన్నత చదువులు చెప్పించిన విశాల హృదయులు. ఆదిరాజు వీరభద్రరావు రంగారావు సహాయం పొందిన వారిలో ఒకరు.

రంగారావు భాహుభాషావేత్త, సాహిత్యంపట్ల ఆసక్తితో వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు కావ్యాలు, నాటకాలు, శాస్త్రాలు మున్నగు గ్రంథాలు తెప్పించి పఠించేవారు. ఎంతో విలువైన సంస్కృతాంధ్ర గ్రంథాలతో కూడిన తన స్వంత గ్రంథాలయాన్ని భాషనిలయంలో విలీనం చేసినారు. రంగారావు గారు ఉదార హృదయులు, స్వస్థాన వేష భాషాభిమాని కావడం చేతనే మాతృభాషాభివృద్ధి కొరకు చారిత్రకమైన గొప్ప ముందడుగు వేసి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించి తన సొంత బంగ్లాలోనే నిర్వహించి భాషా నిలయం అభివృద్ధికొరకు ఎంతో సేవ చేసినాడు. ఇంతటి మహోన్నత వ్యక్తి 33 సంవత్సరముల వయసులోనే పరమపదించారు.



రాజా పార్థసారథి అప్పారావు

**రాజా పార్థసారథి అప్పారావు**

1901 లో భాషానిలయం స్థాపన గురించి ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ వ్యక్తి పాల్వంచ సంస్థానం రాజా పార్థసారథి అప్పారావు గారు. దామోదర శాయన్న, సతీమణి, రాణీ లక్ష్మీ నరసాయమ్మ గార్లు, తమ ఇద్దరి పుత్రుల మరణంవల్ల, నూజివీడు అప్పారాయ కుటుంబీకుడైన దౌహిత్రుడు పార్థసారధి అప్పారావును దత్తత చేసుకోగా అతడు పాల్వంచ సంస్థానాధిపతి అయినాడు.

సంస్కృతాంధ్ర భాషాకోవిదుడైన అప్పారావు ఫారసీ, ఉర్దూ, ఆంగ్ల భాషలు కూడా నేర్చుకొని వ్యవహారదక్షునిగా పేరు తెచ్చుకొన్నాడు. భాషా నిలయం పోషకులుగానే కాక సంస్థలకు పండితులకు ఆర్థిక సహకారం అందించిన వదాన్యులు. శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, మహాభారతానువాద ప్రచురణకు తోడ్పడి పచ్చల ఉంగరం బహూకరించారు. నాటి నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బిరుదులతో వీరిని సత్కరించారట. ఈయన ఆశ్రితుడు పాల్వంచ సంస్థాన విద్యాశాఖాధికారి, ఆంధ్రవాఙ్మయ సేవా సమితి కార్యదర్శి అయిన కొత్తపల్లి వేంకట రామ లక్ష్మీనారాయణ శర్మ రాసిన “పాల్వంచ సంస్థాన చరిత్ర” ద్వారా ఈయన జీవిత విశేషాలు తెలుస్తున్నాయి.




నాయని వెంకట రంగారావు

**నాయని వెంకట రంగారావు**

వరంగల్ జిల్లా తొర్రూరులో జన్మించిన నాయని వెంకట రంగారావు బహదూర్ మునగాల సంస్థానాధీశ్వర రాణి లచ్చమ్మరావుకు దత్తపుత్రుడై కోర్టు వ్యాజ్యములలో గెలిచి సంస్థాన పాలకుడైనాడు. సంస్థాన దివానుగా ఉండిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు సాహచర్యంతో తెలుగు సాహితీ సంస్కృతులకు ఎనలేని సేవచేశారు. రావిచెట్టు రంగారావుతో కలిసి 1901లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయాన్ని స్థాపించి, నాలుగు దశాబ్దాలు వ్యవస్థాపక అధ్యక్షులుగా, పోషకులుగా దాని

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2024



కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

పురోభివృద్ధికి పాటుపడ్డారు. మందిర నిర్మాణానికి, భవన విస్తరణకు భూరి విరాళాలు ఇచ్చినారు. భాషానిలయ రజతోత్సవాలకు ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా ఉండటమేకాక, స్వర్ణోత్సవ సదస్సులకు కూడా స్వాగతమిచ్చెడి భాగ్యం కలిగినందుకు ఎంతో ఉప్పొంగి ఆయన తన ఆనందాన్నీ ప్రకటించారు.

ఆంధ్రదేశంలోని పెక్కు సంస్థలకు పునాదులు వేసి ఆర్థిక సహకారం అందించిన గొప్ప వ్యక్తి నాయని రంగారావు. కొమర్రాజు వారి విజ్ఞాన చంద్రికాగ్రంథ మండలికి స్థాపకాధ్యక్షులుగా ఉండి, ఆయన ప్రారంభించిన విజ్ఞాన సర్వస్వాల ప్రచురణకు దోహదం చేశారు. గుంటూరులోని శారదానికేతనమునకు భూదానము, నారాయణగూడ బాలికోన్నత పాఠశాల, ఆంధ్రవిశ్వకళా పరిషత్తులకు విరాళములు ఆయన వితరణశీలానికి కొన్ని నిదర్శనాలు మాత్రమే. కట్టమంచి రామలింగారెడ్డి "నవయామిని", ఆదిపూడి సోమనాథ రావు "శ్రీకృష్ణ దేవరాయ చరిత్ర" గ్రంథాలు అంకితం పొందినాడు. రాజా నాయని రంగారావు 1958 లో దివంగతులైనారు.

**కొమర్రాజు వెంకట లక్ష్మణరావు**

కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో 1876 మే నెల 18వ తేదీన జన్మించిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు బాల్యం నల్లగొండ జిల్లా భువనగిరి, దేవరకొండలలో గడిచింది. నాగపూరులో బి.ఏ. పట్టా పొందినారు. 1900 ప్రాంతంలో హైదరాబాదుకు వచ్చి, ప్రైవేటుగా చదిని కలకత్తా విశ్వవిద్యాలయం నుండి 1902లో ఏం.ఏ. డిగ్రీని పొందారు. తెలంగాణలో సాంస్కృతిక చైతన్యానికి, ఆంధ్రోద్యమానికి దోహదం చేసిన వ్యక్తి ఆయన.



అదిరాజు వీరభద్రరావు

1901 లో హైదరాబాదులో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనను ప్రోత్సహించారు. అంతేకాకుండా భాషానిలయం కేంద్రంగా 1905 లో ఆయన నెల కొల్పిన "విజ్ఞాన చంద్రికామండలి" చరిత్ర పరిశోధనా రంగానికి సంబంధించిన అమూల్య గ్రంథాలు పెక్కింటిని ప్రచురించారు. లక్ష్మణరావు గారు స్వయంగా బహు గ్రంథకర్త, ఆయన రచించిన "హిందు మహాయుగము " తెలుగులో వెలువడి మొదటి ప్రామాణిక దేశ చరిత్రగా పేరు గడించింది. ఆ తర్వాత భాగమైన "మహ్మదీయ మహాయుగము"లో అక్కన్న, మాదన్నల చరిత్ర సవిస్తారంగా ఉంది.

తెలుగులో విజ్ఞాన సర్వస్వ ప్రచురణకు ఆయన శ్రీకారం చుట్టారు. 1915–18 మధ్య కాలంలో ఆయన సంపాదకత్వంలో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం మూడు సంపుటాలు వెలువడ్డాయి. ఈ సంపుటాలలో లక్ష్మణరావు రచించిన వ్యాసాలు, సమకాలీన పత్రికల్లో వెలువరించిన పరిశోధనాత్మక వ్యాసాలు కలిపి "లక్ష్మణరాయ వ్యాసావళి" పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి.



మాడపాటి హనుమంతరావు


**అదిరాజు వీరభద్రరావు**

తెలంగాణా ప్రాంతంలో చరిత్రగర్భంలో మరుగున పడిన ఆనేక అంశాలను వెలికితీసి తెలుగు జాతి చరిత్రకు మహోపకారం చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావు. 1890 సంవత్సరంలో ఖమ్మం జిల్లా మదిర తాలూకా దెందులూరు గ్రామంలో లింగయ్య, వెంకమాంబ, దంపతులకు జన్మించారు. హైదరాబాదులోని రావిచెట్టు రంగారావు ఇంట్లో ఉండి చాదర్‌ఘాట్ హైస్కూలులో విద్యాభ్యాసం చేసినారు. 1914 నుండి 1948 వరకు మహబూబ్‌కాలేజిలో, చాదర్ ఘాట్ ఉన్నత పాఠశాలలో ఆ తర్వాత మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాలలో తెలుగు భాషా పండితునిగా పని చేసినారు.

1901లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపన సభలో పిన్న వయస్కుడుగా అతిథులకు తాంబూలాలు పంచిపెట్టిన ఆదిరాజు వీరభద్రరావు గారు అనంతర కాలంలో భాషానిలయం కార్యవర్గ సభ్యుడుగా, కార్యదర్శిగా వ్యవహరించి ఆ సంస్థ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు.

నాడు దక్కన్ రేడియో కేంద్రం నుంచి తొలి తెలుగు ప్రసంగం చేసిన కీర్తి వీరభద్రరావు గారికే దక్కింది. ఆయనవి 150 ప్రసంగాలు ఆకాశవాణి నుంచి ప్రసారమైనాయి.

వీరభద్రరావు గారు విశిష్ట రచయిత, గొప్ప చరిత్ర పరిశోధకుడు "ప్రాచీనాంధ్ర నగరములు" "మన తెలంగాణము" "తెలంగాణ శాసనములు" "షితాబ్ ఖాన్ శాసనము" మొ॥న గ్రంథములు వారి పరిశోధన ప్రతిభకు నిదర్శనాలు. నవ్వుల పువ్వులు ఆయన హాస్య ప్రియతకు తార్కాణంగా చెప్పవచ్చు. వీరు 1973 సం.లో పరమపదించారు.



బూర్గుల రామకృష్ణా రావు

**మాడపాటి హనుమంతరావు**

నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమ నిర్మాణానికి, గ్రంథాలయోద్యమ వ్యాప్తికి, తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికీ జీవితాన్నే అంకితం చేసి 'ఆంధ్రపితామహ' బిరుదును సొంతం చేసుకొన్న మహావ్యక్తి మాడపాటి హనుమంతరావు. ఆంధ్రజన సంఘము (1921) ఆంధ్రమహాసభ (1930) మొదలైన సంస్థలను స్థాపించి వార్షిక మహాసభలు – మహిళాసభలు నిర్వహించి తెలంగాణలో జాగృతిని, రాజకీయ చైతన్యాన్ని కలిగించిన ఖ్యాతి ఆయనకు లభించింది.

కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోని కొక్కునూరులో వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు 1885 జనవరి 22వ తేదీన హనుమంతరావు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం సూర్యాపేట, హనుమకొండలలో కొనసాగింది. 1917లో లా పరీక్షలో ఉత్తీర్ణులై న్యాయవాదవృత్తిని చేబట్టి మంచిపేరుగడించి షష్టిపూర్తి వరకూ ఆ వృత్తిలో కొనసాగారు. 1904లో హనుమకొండలో రాజరాజనరేంద్ర ఆంధ్రగ్రంథాలయస్థాపనకు కారకులైన ఆయన హైదరాబాదు శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయానికి కార్యదర్శిగా (1914–15), ఉపాధ్యక్షులుగా (1957–58) కొనసాగటమేకాక ఆ సంస్థ ప్రగతిలో ముఖ్యపాత్ర వహించారు. నారాయణగూడలోని బాలికోన్నత పాఠశాల ఆయన కృషిమూలంగానే స్థాపితమై ఆయన స్మృతిచిహ్నంగా ఈనాటివరకూ స్త్రీవిద్యా ప్రోత్సాహకంగా కొనసాగుతున్నది.




కొండా వెంకటరంగారెడ్డి

మాడపాటివారు సంఘసేవా పరాయణులేకాక గొప్పరచయిత. ఉర్దూ, హిందీ, ఆంగ్లం మున్నగు భాషలలో ప్రవీణులు. గురజాడకు సమకాలికంగా కథారచనచేసి తొలితరం కథకులుగా ప్రశస్తి గడించారు. మల్లికాగుచ్ఛము ఆయన కథాసంపుటం. బంకించంద్రుని 'ఆనందమఠ్' నవలను, ప్రేంచంద్ కథలను తెలుగులోకి అనువదిం చారు. చింతామణివైద్య ఆంగ్లవ్యాసాలను కూడా (క్షాత్రకాలపు హింద్వార్యులు, మహాభారత సమీక్షణం) ఆంధ్రీకరించి అనువాద రచనలో సిద్ధహస్తులనిపించుకొన్నారు. ఇటలీదేశభక్తుడు గేరీబాల్డీ జీవితకథను, రోమన్ సామ్రాజ్య చరిత్రను వెలువరించారు. రాజకీయ, సాంఘిక చరిత్రల అవగాహనతో ఆయన రచించిన 'తెలంగాణా ఆంధ్రోద్యమం' ఆంధ్రోద్యమ నిర్మాతగానే కాక చరిత్రనిర్మాతగా కూడ ఆయనకు ప్రామాణికతను ఆర్జించింది. 'తెలంగాణ' పత్రికకు, 'ముషీరె దక్కన్' ఉర్దూపత్రికకు ఆయన సంపాదకీయాలు వ్రాసి పత్రికారచయితగా కూడ కీర్తి గడించారు.

**బూర్గుల రామకృష్ణా రావు**

బూర్గుల రామకృష్ణారావు యావదాంధ్రమునేకాక భారతావనిని సైతం తేజోవంతం చేసిన జ్యోతిర్మయుడు. ఆయన రాజనీతి ధురంధరుడు, బహుభాషాకోవిదుడు, ఉత్తమ సాహితీవేత్త, సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి. మహబూబ్ నగర్ జిల్లా బూర్గుల వాస్తవ్యులైన రామకృష్ణారావు 1899 మార్చి 13న పడకల్లు గ్రామంలోని మాతామహుల ఇంట్లో జన్మించారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుండి లా డిగ్రీపొంది సమర్థుడైన న్యాయవాదిగా పేరు గడించారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ, నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమంలోనూ, తెలంగాణా విమోచన పోరాటంలోనూ అత్యంత ప్రముఖ పాత్ర వహించిన దేశభక్తుడు ఆయన.



ఎం.ఎల్. నరసింహారావు

తెలంగాణలో రాజకీయ చైతన్యానికి, సాంస్కృతిక వికాసానికి అవిరళ కృషి సల్పిన మహనీయుడు. దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు (1931) అధ్యక్షత వహించారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి కార్యదర్శిగా, మూడు పర్యాయాలు అధ్యక్షులుగా ఉండి ఆ సంస్థ రజతోత్సవాలను, స్వర్ణోత్సవాలను వైభవంగా నిర్వహించారు. వజ్రోత్సవాలలో కూడా ముఖ్యపాత్ర వహించారు. పోలీసుచర్య తర్వాత జరిగిన శాసన సభ ఎన్నికల్లో గెలుపొంది హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రిగా కౌలుదారీ చట్టం మున్నగు సంస్కరణలు ప్రవేశపెట్టారు. విశాలాంధ్ర అవతరణకు సహాయపడిన బూర్గుల కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గవర్నరుగా, రాజ్యసభ సభ్యులుగా విశిష్టసేవలు అందించారు.

ఉర్దూ, పర్షియన్, హిందీ, ఇంగ్లీషు, సంస్కృతభాషల్లో విద్వాంసులైన బూర్గులకు కన్నడ, మరాఠీ భాషలతో కూడా పరిచయం ఉంది. ఆయన ఎంత రాజనీతికోవిదుడో అంత సాహితీవేత్త. సంస్కృతాంధ్ర ఆంగ్లభాషల్లో కావ్యాలు రచించటమేకాక వివిధ భాషాకవుల కృతులను ఆంధ్రీకరించారు. కృష్ణశతకము, తొలిచుక్క, నివేదన, కవితామంజరీ (సంస్కృతం) ఆయన ముద్రిత కృతులు. ఉమరఖయ్యాం రుబాయీలను, సూఫీకవి సర్మద్ కవితలను అనువదించారు.

విమర్శకులుగా కూడ ఆయనకు విశిష్టస్థానం ఉంది. పెక్కు అంశాలపై వెలువరించిన పరిశోధనాత్మకవ్యాసాలు 'సారస్వత వ్యాసముక్తావళి' పేరుతో ప్రసిద్ధి గడించాయి. దుందుభి, గాలిబ్‌గీతాలు మున్నగు కావ్యాలకు రచించిన పీఠికలుకూడా ప్రశస్తమైనవి. శ్రీసత్యసాయిబాబా భక్తులుగా ప్రశాంతమైన ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపిన రామకృష్ణారావు 1967 సెప్టెంబర్ 10వ తేదీన పరమపదించారు.

**వద్దకొండ నరసింహారావు**

తెలంగాణాలో ఆంధ్రోద్యమానికి మూలస్తంభాలుగా నిలచిన మహనీయుల్లో వద్దకొండ నరసింహారావుకు ప్రత్యేకపాత్ర ఉంది. 1893 జనవరి 20వ తేదీన హనుమకొండలో శివరామయ్య, రత్నమ్మ దంపతులకు జన్మించిన వద్దకొండ మెట్రిక్యులేషన్ పూర్తిచేసి ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1910లో నిజాంరాష్ట్ర వ్యవసాయశాఖలో ఉద్యోగం లభించటంతో హైదరాబాదుకు వచ్చి 30 సంవత్సరాలు పనిచేసి రిజిస్ట్రార్‌గా పదవీ విరమణచేశారు. నిజాంప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా స్వీయసంస్కృతిపట్ల అభిమానంతో మహిళాభ్యుదయానికీ, గ్రంథాలయోద్యమానికీ ఎనలేని సేవచేశారు.

1921–24 మధ్యకాలంలో ఆంధ్రజన కేంద్రసంఘం సభల నిర్వహణలో ముఖ్య బాధ్యత వహించారు. నారాయణగూడ బాలికోన్నత పాఠశాల స్థాపనకు ఎంతో కృషిచేసి కార్యవర్గ సభ్యులుగా దాని అభ్యున్నతికి పాటుపడ్డారు. త్రూప్ బజారులోని పరోపకారిణీ బాలికాపాఠశాల ఏర్పాటులోకూడా ఆయన సహకారం ఎంతోఉంది. నిజాం ఆయుర్వేద దవాఖానా, ఆయుర్వేద కళాశాలల నిర్వహణలో గణనీయమైన పాత్రవహించి "ప్రజాసేవాసక్త" బిరుదుపొందారు. నరసింహారావు భాషానిలయం కార్యవర్గసభ్యులుగా దాని అభివృద్ధి, మందిర విస్తరణ కార్యక్రమాల్లో పాలుపంచుకొన్నారు రెండు పర్యాయాలు కార్యదర్శిగా (1922–23, 1951–52), 1949–50 – ఉపాధ్యక్షులుగా, 1953–55 లో అధ్యక్షులుగా ఉండి రజతోత్సవ, స్వర్ణోత్సవాల విజయానికి బాధ్యత వహించారు.

మానవతావాదియైన వద్దకొండ అన్నివర్గాల ప్రజలకు, ముఖ్యంగా బలహీనవర్గాల అభ్యున్నతికి ఇతోధికమైన సేవచేశారు. ఆంధ్రోద్యమము – ఆయుర్వేదం, నిజాం రాష్ట్రాంధ్రుల అభివృద్ధి మార్గములు, వెట్టిచాకిరీ, ది ఆదిహిందూస్ ఇన్ హైదరాబాద్ మొదలైన గ్రంథాలు రచించి భాషావేత్తగా అనువాదకులుగా కూడా గుర్తింపు పొందారు. విశాలమైన దృక్పథం, మానవతావాదం మూర్తీభవించిన నిస్వార్థజీవి వద్దకొండ నరసింహారావు.

**కొండా వెంకటరంగారెడ్డి**

నిజాంరాష్ట్ర ఆంధ్రోద్యమంలోనూ, హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలోనూ క్రియాశీలక పాత్ర వహించిన జాతీయవాది కొండా వెంకటరంగారెడ్డి. హైదరాబాద్ సమీపంలోని మంగళారం గ్రామంలో చెన్నారెడ్డి, బుచ్చమ్మ దంపతులకు 1890 డిసెంబర్ 12న జన్మించిన రంగారెడ్డి లాపరీక్షలో ఉత్తీర్ణులై (1909) న్యాయవాద వృత్తిని చేబట్టారు. కుశాగ్రబుద్ధి అయిన ఆయన సూక్ష్మగ్రహణశక్తితోనూ, వాదనాపటిమతోనూ ఆ వృత్తిలో పేరుగడించారు. స్వయంగా 'లా ఇన్స్టిట్యూట్' నిర్వహించి (1911–23) లా విద్యార్థులకు న్యాయశాస్త్ర విషయాలు బోధించేవారు. జిల్లాకోర్టులోనూ, హైకోర్టులోనూ తన ఉర్దూ భాషా ప్రావీణ్యంచేత వకీలుగా రాణించటమేకాక చిన్నరైతులు, కౌలుదారుల పక్షాన వాదించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

మాడపాటి, బూర్గుల ప్రభృతులతో కలసి ఆంధ్రోద్యమంలోనూ, గ్రంథాలయోద్యమంలోనూ కె.వి. రంగారెడ్డి ముఖ్యపాత్ర వహించారు. ఆంధ్రజనసంఘం స్థాపనకు తోడ్పడి (1921) షాద్నగర్లో ఐదవ ఆంధ్రమహాసభకు (1936), తర్వాత హైదరాబాద్లో పదవ మహాసభకు అధ్యక్షత వహించారు. మాడపాటి నలహాతో 1918లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయంలో జీవిత సభ్యులుగా చేరి, ఉపాధ్యక్ష బాధ్యతను చేబట్టి (1922–27) అభిమానంతో ఆ సంస్థ అభ్యుదయానికి పాటుపడ్డారు. నగరంలోని బాలసరస్వతీ గ్రంథాలయానికికూడా చిరకాలం అధ్యక్షులుగా ఉండి దాని అభివృద్ధికి తోడ్పడ్డారు. రెడ్డిహాస్టలు అభివృద్ధిలో ముఖ్యపాత్ర వహించి దశాబ్దంపాటు దాని గౌరవకార్యదర్శిగా కొనసాగి దానిని పటిష్ఠం చేశారు.

రంగారెడ్డి సంస్కరణభావాలుగల విశాలహృదయులు నిజాం ప్రభుత్వం నెలకొల్పిన శాసన పరిషత్తుకు న్యాయవాదుల పక్షాన ఎన్నికై బాల్యవివాహ నిషేధం, అస్పృశ్యతానివారణ, వితంతువివాహం చట్టాలకు సంబంధించిన బిల్లులు ప్రవేశపెట్టటం మున్నగు ప్రజాహిత

కార్యక్రమాలకు చేయూత నందించారు. స్టేట్ కాంగ్రెసు నిర్మాణంలో పాత్రవహించి మూడునెలలపాటు కారాగార వాసంలో ఉన్నారు.

**ఎం.ఎల్. నరసింహారావు**

హైదరాబాదు సంస్థాన స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న దేశభక్తుడు, గాంధీయవాది, సంస్థానిర్వహణాదక్షుడు అయిన మాదిరాజు లక్ష్మీనరసింహారావు భాషానిలయం కార్యదర్శిగా దాని విస్తరణ వికాసాలకు అవిశ్రాంతంగా పాటుపడుతున్న సేవానిరతుడు. ఎ ఖమ్మంజిల్లా పండితాపురం గ్రామంలో నవంబర్ 5,1929న జన్మించిన నరసింహారావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ. పట్టభద్రులై కళాశాల అధ్యాపకులుగా, తెలుగు అకాడమీ ఉపసంచాలకులుగా పనిచేశారు.

జాతిపిత గాంధీ సిద్ధాంతాలపట్ల ఆకర్షితులైన ఆయన భారత జాతీయ కాంగ్రెసు సభ్యులుగా దశాబ్దంపాటు (1948-58) కొనసాగారు. గాంధీ శాంతిప్రతిష్ఠాన్ కార్యదర్శిగా, తత్సంబంధమైన సర్వోదయ, భూదానోద్యమ సంస్థలకు నిర్వాహకులుగా ఉన్నారు. గాంధీతత్త్వ ప్రచారం గురించిన సభలు, గోష్ఠులు నిర్వహించారు. కాకతీయ విజ్ఞానసమితిని స్థాపించారు.

ఎం.ఎల్.గారు బహుగ్రంథరచయిత. దేశ-రాష్ట్ర చరిత్రల గురించి సమ్యగవగాహనతో వందేమాతర ఉద్యమం, స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమ చరిత్రలను రచించారు. జీవిత చరిత్ర రచనా ప్రక్రియలో ఆయన సిద్ధహస్తులుగా వాసికెక్కారు. పలువురు జాతీయనాయకులు, తెలుగు ప్రముఖులు, ఆంధ్రోద్యమనేతల జీవితచరిత్రలు రచించారు. లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్, భూదానోద్యమనిర్మాత వినోబాభావే, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపకులు స్వామీ రామానందతీర్థ, భారత ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు జీవితచరిత్రలు వానిలో ఎన్నదగినవి. మాడపాటి, బూర్గుల, కె.వి. రంగారెడ్డి మున్నగు తెలంగాణా ప్రముఖుల సంక్షిప్త చరిత్రలు కూడా ఆయన కలంనుంచి వెలువడ్డాయి.

సాహిత్యరంగంలో ఆయన కృషికి గుర్తింపుగా రాష్ట్రసాహిత్య అకాడమీ బహుమతి, తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ (డి.లిట్) పొందారు. 1960 నుంచి కార్యవర్గసభ్యులుగా చేరి 1965 నుంచి భాషానిలయం కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎం.ఎల్. నరసింహారావు ఆ సంస్థ గత అర్థశతాబ్ది చరిత్రలో ముఖ్యపాత్ర వహించి దాని అభ్యుదయానికే అంకితమైన ఉదార హృదయులు.

**కె.వి. రమణాచారి**

పండితకుటుంబంలో మెదక్లో జన్మించిన (8-2-1952) కె. వెంకటరమణాచారి పూర్వుల వైదుష్యాన్ని, సంప్రదాయవైశిష్ట్యాన్ని వారసత్వంగా అందుకొని సహృదయ వతంసులుగా, సంస్కార



వంతులుగా రూపొందారు. ఉభయవేదాంత, భాషా ప్రవీణ అయిన ఆయన పితరులు కె.వి. రాఘవాచార్యులు జగమెరిగిన విద్వాంసులు. రమణగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఎస్సి., (రసాయనశాస్త్రం)లో ప్రప్రథములుగా ఉత్తీర్ణులై ఆ సంస్థలోనే అధ్యాపకులుగా పనిచేశారు. తర్వాత ఐ.ఏ.ఎస్.లో విజయం పొంది ప్రభుత్వరంగంలో ఎన్నో ఉన్నత పదవులు, బాధ్యతలు నిర్వహించారు.

1977లో మహబూబ్ నగర్ జిల్లాలో డిప్యూటీకలెక్టర్ పదవిలోచేరి అంచెలంచెలుగా ఎదిగి కలెక్టర్, కులీకుతుబ్షా నగరాభివృద్ధిసంస్థ (కుడా) ఛైర్మన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, యువజన - స్పోర్ట్స్ శాఖల కమీషనర్, ఖాదీ పరిశ్రమశాఖ అధ్యక్షులు మున్నగు పదవులు పరిపాలనా సామర్థ్యంతో నిర్వహించారు. గృహనిర్మాణ సంస్థ, సమాచారశాఖ, టి.టి.డి. మున్నగు సంస్థలకు కూడా విశిష్టసేవలు అందించినారు. ఏ సంస్థలో ఉన్నా స్వీయ ప్రతిభను ప్రదర్శిస్తూ, ప్రజాసేవకే అంకితమై ప్రజాభిమానాలను పరిపూర్ణంగా చూరగొన్న పరోపకార హృదయులు రమణాచారి.

సాంస్కృతిక - సాహిత్యరంగాలకు ఆయన చేసిన సేవలు నిరుపమానమైనవి. రసరంజని, సురభినాట్యమండలి మున్నగు నాటకసంస్థలకు ప్రోత్సాహకులుగా ఉన్నారు. కళాకారులకు పెన్షన్లు మొదలగు ఆర్థిక సహాయం ఏర్పాటుకు పరిశ్రమించారు. ఘంటశాల స్మారకోత్సవ సంగీత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు సొంతస్థలాన్ని పొందటంలో, శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం నూత్న భవన నిర్మాణంలో రమణాచారి నిర్వహించిన పాత్ర చరిత్రలో నిలచిపోతుంది. భాషానిలయం శతజయంతి సందర్భంలో ఉపాధ్యక్ష బాధ్యతను స్వీకరించి సుమారు కోటిరూపాయలనిధి సేకరణతో నాలుగంతస్థుల ఆధునిక భవన నిర్మాణానికి ఎంతోకృషి సల్పారు. ప్రస్తుతం నిలయ గౌరవాధ్యక్షులుగా, పరిషత్తు ఉపాధ్యక్షులుగా వాటి అభ్యుదయానికి పాటుపడుతున్నారు.

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్**
**జయావహం జపం నిత్యమక్షయం పరమం శివమ్"**

**సర్వ మఙ్గల మాఙ్గల్యం సర్వపాప ప్రణాశనమ్**
**చిన్తాశోక ప్రశమన మాయుర్వర్ధన ముత్తమమ్॥**


**12. ఆయుర్వర్ధనమ్ :** ఆదిత్యహృదయం ఆయువును పెంపొందిస్తుంది. ఇటువంటి మాటలు హేతువాదానికి నిలువనివి అని కొందరు అనుకుంటారు. అది అపోహ మాత్రమే. ఆదిత్య హృదయ జ్ఞానమూ, అందులో విధించిన అనుష్ఠానమూ మానవుణ్ణి యుక్తాహార విహారుణ్ణి చేస్తాయి. యోగ్యమైన ఆహారము, విహారము కలవానికి, యోగ్యమైన చేష్టలతో ప్రవర్తించేవానికీ యోగము సిద్ధిస్తుందని గీత చెప్పింది. దానిని తెలుసుకొని ఆచరించి ఫలసిద్ధి పొందినవారు అనేకులు ఉన్నారు. యోగము సిద్ధించటంలో ప్రత్యక్షంగా కనిపించే ఒకానొక ఫలం రోగాదులు లేకపోవటం. ఆయువు పెంపొందటమంటే అదే. మరొక విషయం కూడా ఇక్కడ ఆలోచించాలి. ఆయువు పెరిగితే ఒరిగేదిమి? అని కొందరికి సందేహం కలుగుతుంది. ఒరిగేది చాలా ఉన్నది. దేహ మానస జాడ్యాలు, రుగ్ణతలు లేకుండా పెద్దకాలం జీవించినవాడు పరమార్థ లాభం కోసం సుఖంగా తపస్సు చేసుకుంటాడు. తపస్సిద్ధి పొందుతాడు. అగస్త్యుల వారి అభిప్రాయంఇది.


**13. ఉత్తమమ్ :** మిక్కిలి శ్రేష్ఠమైనది. ఇంతవరకు అనుకొన్న మహా ప్రయోజనాలను కలిగించే సాధనసంపత్తి ఇంకా చాలా ఉండవచ్చు. ఆ అన్నింటిలో ఇది ఉత్తమమైనది అని భావం.

"వ్రతానా ముత్తమం వ్రతమ్" అనే మాటను కొందరు సరిగా అర్థం చేసుకొన్నట్లు కనబడదు. వ్రతాలు అన్నీ ఉత్తమములే. కానీ దేనిని మనం కోరి చేస్తున్నామో దానియందు బద్ధాదరులమై ఉండాలి. అది సమాన జాతిలో తక్కిన దానిని నిందించటానికి అనేమాట కాదు. దేనియందు మన మనస్సు ఆదరం పొందిందో దానియందు నిష్ఠ చెడగూడదు అని చెప్పటానికి అన్నమాట. ఆ దృష్టితో ఆదిత్య హృదయం ఉత్తమమైనది.

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### తపస్సు

సత్యజ్ఞాన ప్రాప్తికోసం సాధకుడు చేసే కృషి తపస్సు. సిద్ధ శక్తులను పొందడం కోసం ఒక నిర్ణీత ధ్యాన సాధనను అవలంబించే యోగి కృషి కూడా తపస్సే అని మరొక భావన.

సాంప్రదాయికులైన సాధకుల లక్ష్యం ఈశ్వర దర్శనం. ఈశ్వరుణ్ణి చూడడం. ఈ లక్ష్యంలో ఇమిడి ఉన్న విషయం భగవంతునిలో కలిసిపోవడమే. యోగ శబ్దానికి అర్థం కూడా ఇదే. వేదాలు, తర్వాత వచ్చిన శాస్త్రాలు నిర్దేశించిన రీతిలో యోగ సాధనను లేక తపస్సును చేసే సాధకులు సాధారణంగా ఒక గురువు మార్గదర్శనంలో ఉంటుంటారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి విలక్షణులు, విశిష్టులు. వారే శాస్త్రాలు చదువలేదు. వారికి మానవ గురువు యొక్క అవసరమూ రాలేదు. వారు క్షణమాత్రంలో విచారణలో నిమగ్నమయిపోయి, ఇతరులకు ఒక జీవితకాలమో, అంతకన్నా ఎక్కువ కాలమో పడ్డే తప్ప పొందలేని దాన్ని, కొన్ని క్షణాలలో సాధించ గలిగారు. సాధన, అనుభవాల పునాది ఉండడం చేత, వారి బోధనలు హేతుబద్ధంగా ఉంటాయి. సాంప్రదాయిక శాస్త్రాలు 'విచారణ'ను గురించి కొన్ని పరిమితమైన సూచనలు ఇచ్చాయి. కాని విచారము, తపస్సులపై భగవాన్ అవగాహన మౌలికంగా సాంప్రదాయిక శాస్త్రాల కన్నా భిన్నమై మనకది ఆత్మ జ్ఞానానికి రాచమార్గాన్ని చూపుతున్నది.

ఉపదేశ సారంలో తపస్సుని గురించిన భగవాన్ యొక్క భిన్నాభిప్రాయాన్ని చూడవచ్చు. సిద్ధులను సాధించుకోవడం కోసం ఋషులు దారుకావనంలో చేసిన తపస్సు లాంటిది. తమను తాము ఘనంగా భావించుకోవడానికి, తత్ఫలితంగా పతనానికి దారితీస్తుంది. కాని అదే సరయిన తపస్సు అవుతే అహంకార నాశనానికి – అది మోక్షానికి దారితీస్తుంది.

"అహంకారం లేకుండా పోయాక, మిగిలి ఉన్న దానిని తెలిసికోవడమొక్కటే ఉత్తమోత్తమమైన తపస్సు". "నేను" అన్న భావం ఎక్కడ నుండి ఉదయిస్తున్నదో గుర్తించి అందులో మనస్సును లయింప జేయడమే నిజమైన తపస్సు. మంత్రాన్ని జపిస్తున్నప్పుడు మంత్రధ్వని పుట్టుతున్న చోట మనస్సును నిమగ్నం చేయడమే తపస్సు" అని అన్నారు.

# తెలంగాణ గడీలు – శిథిలమవుతున్న చరిత్ర

**డా. తాడూరి రవీందర్,** తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 994 994 6607

**వ్యాస సంగ్రహం**

కథా రచయితగా ఎంతో ప్రసిద్ధి, ఎందరో ప్రముఖ సాహితీకారుల మన్ననలు, అశేష పాఠక లోకం అభిమానం చూరగొన్న కే.వి.నరేందర్ గారు, తన మిత్రుడైన సంగెవేని రవీంద్ర గారితో కలిసి తెలంగాణ వ్యాప్తంగా మూడు వేల కిలోమీటర్ల పైగా ప్రయాణించి తెలంగాణ గత వైభవానికి, అలాగే చీకటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా ఉన్న గడీల నిర్మాణ విశేషాలు, సామాజిక, సాంస్కృతిక విశేషాలను తెలియచేస్తూ **"తెలంగాణ గడీలు"** అనే చారిత్రక పరిశోధన గ్రంథాన్ని రాసి వెలువరించారు. ఇందులో 30కి పైగా గడీల నిర్మాణాలను, వాస్తు, శిల్ప శైలులను ఎంతో లోతుగా వివరించారు. గడీల గురించి, వాటి నిర్మాణం గురించి మనకు తెలియని అనేక విషయాలను తమ పరిశోధనలో వెలికితీశారు. గడీలలో జరిగిన అనేక చరిత్రకెక్కని సంఘటనలను పొందుపరిచారు. ఇంత గొప్ప పరిశోధనను, అందుకు వారు ఎదుర్కున్న వ్యయ ప్రయాసలను, గడీల వెనుక ఉన్న అసలు చరిత్రను నేటి, రేపటి తరాలకు తెలియచేస్తూ తమ గత చరిత్ర స్పృహను కలిగించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.


ముఖ్య పదాలు : చారిత్రక పరిశోధన, డంగు సున్నం, హుర్రాజ్, దొరలు, కమ్యూనిస్టులు, విప్లవోద్యమం, నిజాం పాలన, పి.వి నరసింహా రావు, సాహిత్యం, చిత్ర లేఖనం.

**ఉపోద్ఘాతం**

తెలుగు సాహిత్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే చారిత్రకంగా అనేక నాటకాలు, చారిత్రక నవలలు, చారిత్రక నేపథ్యంలో కథలు, కవిత్వ సృజన జరిగింది. అయితే ఇవన్నీ సాహితీ సృష్టి, వర్ణనలు, భాషా సాహిత్యాల మేళవింపు. సాహితీ ప్రక్రియలకు లోబడి రచయిత లేదా కవి ప్రతిభ, కళాత్మక దృష్టి, రచనా నైపుణ్యాన్ని బట్టి వెలువడి పాఠకుడికి రసానందాన్ని కలిగించినవే. అయితే ఒక చారిత్రక ప్రదేశాన్ని సందర్శించి, దానికి సంబంధించిన నిర్మాణ, ఆర్థిక, సామాజిక విశేషాంశాలను వెలికితీసి రాస్తే అది సాహిత్యం అనడం కన్నా చరిత్ర రచన అనడం సబబు. తెలుగులో కొమర్రాజు లక్ష్మణరావు, బి.ఎన్. శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్య, మారేమండ రామారావు ప్రభృతులు గ్రామాలు, దేవాలయాలు, శాసనాలు, నాణేలు, తాళపత్ర గ్రంథాల పైన పరిశోధనలు చేసి ఎంతో విలువైన సమాచారాన్ని మన తరానికి, భవిష్యత్ తరాలకు కానుకగా అందించారు. వారి మార్గంలోనే కె.వి. నరేందర్, సంగెవేని రవీంద్రతో కలిసి ఈ చారిత్రక పరిశోధనకు పూనుకున్నారు.



శిథిలావస్థలోని
పోచారం గడి




చారిత్రక అధ్యయనం, పరిశోధన లేకుండా ఏ సందర్భాన్ని కూడా కవితగా, కథగా, నవలగా, వ్యాసంగా మార్చడం సాధ్యపడదు. అలాగే తెలంగాణ గడీల గురించి ఇన్ని వందల సంవత్సరాలైనప్పటికీ వాటి నిర్మాణం, నేపథ్యం, ఆ కాలపు పరిస్థితులు అందరూ చూస్తున్నవే అయినప్పటికీ... వాటిని వెలికితీసి, రికార్డు చేసి భవిష్యత్తరాలకు అందించాలనీ, ఇప్పటికే సాహిత్యరంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వీరు సంకల్పించడం నిజంగా ఒక చారిత్రక ఘట్టం.

దొరల ప్రస్తావన లేకుండా తెలంగాణ చరిత్ర లేదు. ఇప్పటి వరకు దొరల పాలన, అరాచకాలు, దౌర్జన్యాలు, వారిపై తిరుగుబాట్లు, విప్లవోద్యమాలు, కమ్యూనిస్టులు, నక్సలైట్లు, తదితర అంశాలపై ఎంతో సాహిత్యం వచ్చింది. కానీ, వీటన్నింటికీ కేంద్రమైన దొరల నివాస స్థానాల చరిత్ర గురించి ఈ రచయిత పూనుకోవడం చాలా గొప్ప విషయం. తెలంగాణలో ఇలాంటి మరుగునపడిన చరిత్ర ఎంతో ఉన్నది. వాటిని ఇప్పుడు రికార్డు చేయడం తెలంగాణ అస్తిత్వానికి అనివార్యమైన అంశం. ఈ విషయంలో వీరి కృషి ప్రశంసించదగినది.

**పరిశోధన -ప్రయాసలు**

ఈ గడీల చరిత్రను వెలికితీయడానికి వీరు ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి, ఆరు నెలలు శ్రమించారు. శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడికి గురయ్యారు. వీరి స్వస్థలం జగిత్యాల నుండి బయలు నేటి దాదాపు మూడు వేల కిలోమీటర్ల పైనే తిరిగారు. ఒక గడీ దగ్గర సెల్ టవర్ ఎక్కి ఫోటోలు తీస్తుంటే వీరి బృందంలోని ఒక మిత్రుడు వేణు కిందపడితే చేయి విరిగింది. కొన్నిసార్లు కొందరు

చెప్పిన ఆచూకీ ప్రకారం వెళ్లినా కూడా అక్కడ గడీ లేని పరిస్థితులు, వృథా ప్రయాణాలు, ఖర్చులూ ఎదురయ్యాయి.

దాచారంలో చిన్నగడీ ఫోటో తీస్తూ, వెనక్కు వెళ్ళిన రవీంద్ర అక్కడ మొక్కలు, చెట్లతో పూర్తిగ కప్పబడిపోయిన పెద్దబావిని గమనించలేదు. మరో రెండు అడుగులు వెనక్కు వేస్తే పెద్ద ప్రమాదం జరిగేది. అక్కడే ఉన్న ఊరి వ్యక్తి అరిచి చెప్పడం వల్ల అది తప్పింది. పాములు, గబ్బిలాలు ఇలా ఎన్నో ప్రమాదాలను దాటుకుంటూ వీరు పరిశోధన గావించారు. ఆరు నెలల కాలం. మూడు వేల కిలోమీటర్ల ప్రయాణం, వందల గడీలు వెరసి ఈ అద్భుతమైన చారిత్రక గ్రంథం పురుడు పోసుకుంది. ఈ పుస్తకంలో 30 గడీలు, వాటి నిర్మాణం, చరిత్ర, సామాజిక నేపథ్యాన్ని **"తెలంగాణ గడీలు -1"** పేరుతో ప్రచురించడం జరిగింది. ఈ గ్రంథం ఇంగ్లీషు, మరాఠీ, హిందీ, కన్నడ భాషలలోనికి అనువదించబడింది.

### గడీల నిర్మాణం- ప్రాముఖ్యత

దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపథం, జీవన యానం', వట్టికోట ఆళ్వారు స్వామి 'గంగు', లక్ష్మీకాంత మోహన్ 'సింహగర్జన', ఇలా చాలా మంది రచయితల వివిధ సాహిత్య ప్రక్రియల్లో గడీల ప్రస్తావన ఉన్నప్పటికీ కేవలం గడీలకు సంబంధించిన సామాజిక, చారిత్రక అధ్యయనం కనిపించలేదు. అంటే గడీల నిర్మాణ పనుల గురించి, వాటి ఆర్కిటెక్ట్ గురించి, ఒక్కో గడి నిర్మించడానికి ఎన్ని సంవత్సరాలు పట్టింది, ఎక్కడి వాస్తు శిల్పులు, కూలీలు పనిచేశారు అనే విషయాలు ఇప్పటికీ తెలియకుండా పోయాయి. 1962లో జర్మనీ పరిశోధకుడు' దాగ్మర్ బెర్నెస్టాల్ఫ్' తెలంగాణపై చేసిన పరిశోధనలో కూడా దొరల పాత్ర, దొరల అధికారం, వారి జీవనశైలి గురించి రాశారు తప్పితే, వారు నివసిస్తున్న అతి పెద్ద గడీలు ఎలా నిర్మించారన్న విషయాలు ఎక్కడ రాయలేదు.

**"గతమెప్పుడూ దుఃఖభరితమే అయినప్పుడు దాన్ని తలుచుకోవడం ఆనందమేమీ కాదు. తెలంగాణ పల్లెల్ని ఆ గతం ఇంకా వెంటాడు తూనే ఉంటుంది. ఆ జ్ఞాపకాలు మనసుల్ని అతలాకుతలం చేస్తూనే ఉంటాయి. గాయం మీది మచ్చలా గడిలో ఒక భయానక విషాదానికి, కల్లోల జ్ఞాపకాలకి గుర్తుగా మిగిలిపోయాయి"** అని అంటారు నరేందర్ గారు. అలా మిగిలి పోయిన జ్ఞాపకాలను ఒకసారి స్పృశిస్తున్నాను.

**సిర్నాపల్లి గడీ :** తెలంగాణ గడీల్లో అతి పురాతన చరిత్ర గల ఈ గడీ నిజామాబాద్ జిల్లాలో ఉంది. ఇది మొదట కాకతీయులు, తరువాత కుతుబ్షాహీలు, చివరకు నిజాం పాలనలోకొచ్చింది. నిజాం రాజు దగ్గర పనిచేసే ఓ అధికారి వేటకు వచ్చి అడవిలో తప్పిపోతే, అతడిని కాపాడిన ఒక పన్నెండేళ్ళ అమ్మాయి ధైర్యానికి మెచ్చి ఈ గడీని ఆమెకు అప్పగించారు. ఆమె శీలం జానకీబాయి. తన పరిపాలన ద్వారా నిజాంతో సహా ఎందరి మెప్పునో పొందిన ఈమెను 'పగటి మషాల్ దొరసాని' గా అభివర్ణిస్తారు. ఎందుకంటే ఈమె పల్లకీలో వెళుతుంటే పగలు కూడా దివిటీలు పట్టుకొని నడిచేవారట. ఇందూరును నిజామాబాద్‌గా మార్చింది ఈమే.

**బండలింగాపూర్ గడీ :** కరీంనగర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఉంది ఈ గడీ. ఇది అతి పెద్ద విస్తీర్ణంతో 14 ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ గడీ నిర్మాణ శైలి మైసూరు ప్యాలెస్‌తో పోలికలను కలిగి ఉంటుంది. ప్రముఖ సినిమా నటుడు శివాజీ గణేశన్ తరచుగా ఇక్కడికి వచ్చేవాడు. అంతే కాకుండా ఈ గడీ పాలకుడు రాజా అనంత కిషన్ రావుతో కలిసి వేటకు వెళ్ళినాడట. ఈ గడీలో దౌర్జన్యాలు, అరాచకాలు ఏమీ జరగలేదు. కానీ దాసీ వ్యవస్థ మాత్రం ఎక్కువగా ఉండేది. ఈ దొరలు గొప్ప దాతలు, ఓ రోజు టానిక్ అనుకొని తేజాబ్ తాగడంతో రాజావారు మరణించారు.

**దోమకొండ గడీ :** నిజామాబాద్ జిల్లా కామారెడ్డి సమీపంలో ఉంది ఈ గడీ. నలభై ఎకరాల విస్తీర్ణం ఉన్న కోట చుట్టూ అతి పెద్ద నీటి కందకం ఉంది. తెలంగాణలో ఏ ఒక్క గడీకి కూడా ఇలాంటి నీటి కందకం లేదు. గంగిరెద్దు ఉమ్మి తన చేతులపై పడిందని, ఆ కోపంతో గంగిరెద్దులవాన్ని కొట్టి చంపడం వలన చివరివాడైన సోమేశ్వర్రావుకు ఆరు సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఈ గడీకి తిరుపతి వేంకట కవులు కూడా వచ్చేవారు. ఈ గడీ మనవరాలు 'ఉపాసన' ప్రముఖ చలనచిత్ర నటుడు చిరంజీవి ఇంటి కోడలయ్యింది.

**సంజీవన్ రావు పేట :** మెదక్ జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్ రావుపేట గ్రామంలో ఉంది. నిజాం ప్రధాన మంత్రి కిషన్ ప్రసాద్ తరచుగా ఈ గడీకి వచ్చేవారు. అత్యంత ఆకర్షణీయంగా గడీ గోడలు, స్వాగత తోరణాలు ఉండడంతో మోహన్ ఖోడా దర్శకత్వంలో షేక్స్పియర్ నవల ఆధారంగా ఎల్లమ్మకథ చలన చిత్రాన్ని ఇక్కడ చిత్రీకరించారు.

**తపాల్ పూర్ గడీ :** మొదటిసారిగా నక్సలైట్లు దాడి చేసిన గడీగా తెలంగాణలోనే కాదు, దేశవ్యాప్త సంచలనానికి మూల కారణమయిన గడీ ఇది. 1976 సంవత్సరం నవంబర్ 7న ఈ గడీపై నక్సలైట్లు దాడి చేశారు. ఈ సంఘటన చాలామంది దొరలకు నిద్ర లేకుండా చేసింది. దొరతనపు వ్యవస్థను అప్రమత్తం చేసి, గడీల్ని ఖాళీ చేసి, దొరల్ని వెళ్ళిపోయేలా చేసింది. రాచరిక వ్యవస్థ పునాదుల్ని కదిలించింది. ఈ దాడి గురించి బి.బి.సి రేడియోలో ప్రసారం అయింది.

**గట్ల మల్యాల గడీ :** విశ్వబ్రాహ్మణ దొరలు పరిపాలించిన ఏకైక గడీ ఇది. అధికారం, అరాచకం మచ్చుకైనా వినిపించని ఊరు ఇది. కులవృత్తిలోనే కాదు పరిపాలనా రంగంలో కూడా సాటి లేనివారు

ఈ దొరలు. మెదక్ జిల్లా సిద్ధిపేట నుండి హుస్నాబాద్ వెళ్ళే దారిలో ఈ గడీ ఉంది. ఈ గడీ దొరలు స్వర్ణకారులు. అందుకే ఈ గడీని "అవుసులోల్ల గడీ" అని కూడా పిలుస్తారు. తెలంగాణలో వృత్తిపని వారు దొరలుగా చెలామణి కావడం ఈ గడీకి మాత్రమే సొంతమయ్యింది. తెలంగాణలో బి.సి.లకు చెందిన ఏకైక గడి ఇదే.

**విసునూర్ గడీ :** ఇది తెలంగాణలో కత్తుల పునాది మీద నెత్తుటి సాక్ష్యం అంటారు రచయిత. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం విసునూర్ గ్రామంలో ఉంది ఈ గడీ. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తెర లేపినదీ గడి. ఈ గడీకి చెందిన జానకమ్మ దొరసానికి మంచి పరిపాలనాదక్షురాలిగా పేరుంది. ఈమె ఒక్కగానొక్క కొడుకు వెంకట రామచంద్రారెడ్డి. ఈయన చేసిన అరాచకాలకు లెక్క లేదు. అందుకే ఇతనికి కలియుగ రావణాసురుడని పేరు. ప్రపంచంలో వుండే ఆధునిక సౌకర్యాలు అన్ని గడీలో ఏర్పరుచుకునేవాడు. ఇతని బండి నడుస్తుంటే ఎనిమిది కిలోమీటర్ల వేగంతో చాకలి ఎడ్లబండి ముందు పరుగెత్తాలి. బండికిరువైపుల కత్తులు, తుపాకులు ధరించిన నలభై మంది పరుగెత్తాలి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మీద వచ్చిన ఏ పుస్తకం తెరచినా, ఏ సాహిత్యం చదివినా ఈ దొర అరాచకాలు ప్రముఖంగా కనిపిస్తాయి.

**సిరికొండ :** ఇది కోమటోల్ల (వైశ్యుల) గడీ, కరీంనగర్ జిల్లా కథలాపూర్ మండలం సిరికొండ గ్రామంలో ఉంది. వీరు కూడా గట్ల మల్యాల దొరల్లాగే హర్రాజాదారులు. దొర బట్టు లచ్చయ్య మీద ఒకసారి నిజామొద్దీన్ అనుచరులు కాల్పులు జరపగా తూటా దూసుకుపోయి తీవ్రంగా గాయపడినా, బతికి బయటపడ్డాడు

**ఇందారం గడి :** ఇది గృహప్రవేశానికి కూడా నోచుకోని గడి. ఆదిలాబాద్ జిల్లా, జైపూర్ మండలం ఇందారంలో ఉంది. అన్ని గడీలు ఊరు మధ్యలో ఉంటే ఈ గడీ మాత్రం ఇందారం గ్రామానికి కొంత దూరంలో, గోదావరి నదికి మూడు కిలోమీటర్ల చేరువలో ఉంటుంది. చార్మినార్‌ను పోలిన రెండు బురుజులున్నాయి దీనికి. ఈ గడీని ఎక్కి చూస్తే గోదావరి అందాలు, ఎన్టీపీసి వెలుగులు అద్భుతంగా కనిపిస్తాయి. ఈ గడీ దొర భార్య నూజివీడు సంస్థానపు ఆడపడచు ఆమె గడీని పరిశీలించి, ఈ గడీ కన్నా తమ గుర్రాల భవంతి చాలా అందంగా ఉంటుందని నిరుత్సాహంగా పెదవి విరిచిందట. ఆ రోజు నుండి దొర మళ్ళీ ఆ గడీ వైపు చూడలేదట. ఇక్కడి దొర ముత్యంరావుకి 'బారా ఖూన్ మాఫీ వతన్దార్" హక్కు నిజాం రాజు కల్పించాడని అంటారు. అంటే రోజుకు పన్నెండు మందిని చంపే అధికారం గలవాడని అర్థం.

**గద్వాల గడీ :** తెలంగాణలోని అతిపెద్ద సంస్థానాలలో ఇది ఒకటి. సోమ భూపాలుడు పదిహేడవ శతాబ్దంలో పూడూరు కోటను




మరమ్మత్తు చేసిన సమయంలో నిధి దొరుకుతుంది. ఆ నిధితో గద్వాల కోటను నిర్మించాడు. సోమభూపాలుడుగా పేరుగాంచిన రామన్న అధికార అరాచకాలను భరించలేక అతని సైనికులే నిండు దర్బారులో అతన్ని కాల్చి చంపారు.

**కల్లెడ గడీ :** గడీలు అనే పేరుకే పూర్తి విరుద్ధంగా శాంతివనంగా, విద్యాసుగంధాల క్షేత్రంగా విలసిల్లింది ఈ కల్లెడ గడి . ఇది వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలంలో ఉంది. ఈ దొరల వంశానికి ఆద్యుడు ఎర్రబెల్లి వీరరాఘవరావు. ఈ పాలకులు విద్యావ్యాప్తికి బహుముఖంగా కృషి చేశారు. 76 గదులతో విద్యార్థులకు చదువుతో పాటు భోజన వసతి కూడా కల్పించారు. అంతే కాకుండా ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనే ఆర్చరీకి చిరునామాగా కల్లెడను చెప్పుకుంటారు. ప్రముఖ ఒలింపిక్ ఆర్చరీ క్రీడాకారిణి ఈ కల్లెడ గడీ పాఠశాల విద్యార్థినే. వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన వాలంటీర్లు, ప్రొఫెసర్లు ప్రతి సంవత్సరం ఇక్కడికి వచ్చి విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ మీడియా సంస్థ బిబిసిలో రికార్డు చేసిన ఏకైక రూరల్ బడి ఇదొక్కటే కావడం విశేషం. ఈ గడీలో ఎన్నో సినిమాల షూటింగ్‌లు జరిగాయి. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ బడిలో జాతీయ పతాకావిష్కరణలో ప్రత్యేకతే కనిపిస్తుంది. 15వ ఆగష్టు నాడు ఆదర్శ రైతు చేత, 26 జనవరి నాడు ఎవరైనా చేతివృత్తుల వారి చేతుల మీదుగా పతాకావిష్కరణ జరిగుతుంది.






**బొల్లారం గడీ :** నిజామాబాద్ జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామంలో ఉంది. ఈ గడీకి చెందిన మండ రామచంద్రారెడ్డి దొర తన సాహసాలతో ఆ ప్రాంతంలో పేరు గాంచాడు. ఈయన అడవికి వేటకు వెళ్ళినపుడు తనపై దాడి చేసిన పెద్దపులితో పోరాడి, తన భుజబలంతో దాన్ని చంపాడట. గడీ లోపలికి అడుగుపెట్టలేనంత శిథిలమైపోయి ఉన్నప్పటికీ, గడీ అందాలు, అద్భుతంగా, హుందాగా ఉన్నాయి.

**చల్ గల్ గడీ :** జగిత్యాల పట్టణానికి సమీప గ్రామమైన చలగల్లో ఈ గడీ ఉంది. ఈ 'చల్ గల్' కు 'సలిగంటి' అనే పేరు కూడా ఉంది. ఈ గడీ దొర జువ్వాడి ధర్మ జలపతిరావు. బండలింగాపూర్ గడీ ఆడపడచుని వివాహం చేసుకున్నాడు. ఈ గడీ ప్రవేశద్వారాలు రాజస్థాన్ కోట ద్వారాలను పోలి ఉంటాయి. డంగు సున్నంతో అద్భుతమైన, గుండ్రని కమానులను నిర్మించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. పుట్టపర్తి సాయిబాబా ఈ గడీకి ఎక్కువసార్లు వచ్చేవాడు.

**మద్దునూరు గడీ :** కరీంనగర్ జిల్లా ధర్మపురి మండలంలో ఈ గడీ ఉంది. ఈ గడీ దొరసాని జువ్వాడి లక్ష్మీకాంతమ్మ ధర్మాత్మురాలుగా పేరు గాంచింది. ఈమె ఎవరింట్లో వివాహం జరిగినా పుస్తెలు, మట్టెలు పంపించేదట. జిల్లాలో మొదటి ట్రాక్టర్ను కొన్నది ఈ గడీకి చెందిన రాజేశ్వరరావు గారే. ఈ గడీపై నక్సలైట్ల దాడి జరిగింది. హైదరాబాదుకు వెళ్ళిన రాజేశ్వరరావుని కలువడానికి వెళ్ళిన సన్నిహితులతో "నక్సలైట్లు దేవుళ్ళురా వాళ్ళు మరో పదేండ్లు ముందు వచ్చి వుంటే నేను మరింత కోటీశ్వరున్ని అయ్యేవాన్ని, హైదరాబాద్ సిటీలోని సగం కొనేవాన్ని. అక్కడుంటే అదే గడీలో ఉండేవాన్ని కదా" అని అనేవారని జనం ఇప్పటికీ చెప్పుకుంటారు.



**నడి గూడెం గడీ :** నల్లగొండ జిల్లాలోని మండల కేంద్రం. మన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఈ సంస్థానంలోనే దివాన్ గా పనిచేసేవారు. అందుకే ఈ గడీని జాతీయ జెండాకు పురుడుపోసిన గడీ అని అంటారు. ఆంగ్లేయులు బహుమతిగా పరిటాల పరగణాను ఇవ్వమని అడిగినప్పుడు, నిజాం నవాబు అందుకు ఇష్టపడక, దానికి బదులు మునగాల పరగణాను ఇవ్వడం జరిగింది. 1900లో జమీందారు అయిన నాయిని వెంకటరంగారావు పాలనా కాలం నుండి ఈ సంస్థానం ఎక్కువగా ఖ్యాతినొందింది. జాతీయ పతాక రూపకకర్త పింగళి వెంకయ్య మాత్రమే కాదు. ప్రఖ్యాత చరిత్రకారుడు, గ్రంథాలయోద్యమ కర్త కొమర్రాజు లక్ష్మణరావు కూడా ఇదే సంస్థానంలో దివాన్గా పనిచేశాడు. ఎన్నో సంస్థలకు, గ్రంథాలయాలకు, పాఠశాలలకు నిధులు, విరాళాలు ఇచ్చారు.

**ఇటిక్యాల గడీ :** కరీంనగర్ జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఉంది. చెన్నమనేని వెంకట నర్సింహారావుకు చెందినది. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ గడీకి తరచుగా వచ్చేవారు. వెంకట నర్సింహారావు రెండవ కొడుకు కృష్ణారావు, ప్రముఖ ఏ.ఎన్.ఎల్ కొరియర్ సంస్థ అధినేత. ప్రస్తుతం ఇందులో సాయిబాబా గుడిని నిర్మించి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించారు.

**వంగర గడీ :** కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం, వంగర గ్రామంలో ఉంది. దేశ రాజకీయాల్లో అపర చాణుక్యుడిగా పేరుగాంచి, ప్రధానమంత్రి పదవి చేపట్టిన ఒకే ఒక తెలుగు వ్యక్తి పి.వి.నరసింహారావు, ఈ గడీ దొర. రెండు వేల ఎకరాలకు యజమాని అయిన కరణం దొర పి.వి. నరసింహారావు. పి.వి.కి పుట్టుకతోనే సమానత్వం పట్ల అవగాహన ఉంది. సవారి కచ్చురంలో ప్రయాణించేటప్పుడు దానికి ముందు, వెనుక చాకలివాళ్ళు పరుగెత్తడాన్ని ఆయన అమానుషమని భావించేవాడు. అలా పరిగెత్తే చాకలి వాళ్ళని తనతో పాటు బండిలోనే కూర్చోబెట్టుకొని సంచలనం సృష్టించాడు.

**వనపర్తి గడీ :** మహబూబ్ నగర్ జిల్లా వనపర్తిలో ఈ గడీ ఉంది. దీనిని "రాంసాగర్ బంగ్లా" అని కూడా పిలుస్తారు. దీని పాలన కింద నూట ఇరవై గ్రామాలుండేవి. ఈ రెడ్డి దొరల ఇంటి పేరు "జనుంపల్లి". ఈ సంస్థానాధీశులు మొదట విజయనగర సామ్రాజ్యపు సామంతులుగా పని చేశారు. ఈ వంశానికి చెందిన వెంకటరెడ్డి మహాపరాక్రమశాలిగా ప్రసిద్ధుడు. వెంకటరెడ్డి కుమారుడు గోపాల రాయలు. ఎనిమిది భాషల్లో నిష్ణాతుడైన ఇతనిని అష్టభాషా గోపాలరాయలుగా పిలిచే వారట. గోపాలరాయని దత్తపుత్రుడు

వెంకటరెడ్డి నిజాంకు కప్పం కట్టం లేక యుద్ధం చేయాల్సి వస్తుంది. ఆ యుద్ధంలో ఓడిపోయి వెంకటరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. మొదటి రామేశ్వర్రావు సంస్థానంలో మొదటిసారి శాశ్వత పన్ను విధానాన్ని ప్రవేశపెట్టాడు. వనపర్తి సంస్థానం పండితులు, సాహిత్యంతో అలరారింది. మానవల్లి రామకృష్ణ కవి, నెదులూరి వెంకటశాస్త్రి, సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి, చలమచర్ల రంగాచార్యులు ఈ సంస్థానానికి చెందిన పండితులలో ముఖ్యులు. ఈ సంస్థానానికి చెందిన రెండవ కోడలు రాణి కుముదినీ హైదరాబాద్ నగరానికి మొదటి మేయర్‌గా పనిచేశారు.



**పెద్ద శంకరం పేట గడీ :** మెదక్ జిల్లాలో ఈ గడీ ఉంది. ఈ గడీ పాపన్నపేట సంస్థానానికి కేంద్రం. 1924 నుండి 1948 వరకు ఈ సంస్థానాన్ని 9 మంది పాలించారు. రాణి శంకరమ్మ ఈ గడీని నిర్మించారు. ఈమెకే రాంబాగిన్ (ఆడ సింహం) అనే బిరుదునిచ్చి సత్కరించారు ఏడవ నిజాం. శంకరమ్మ ధైర్యసాహసాలు కలిగిన స్త్రీ. తన పేరుతో శంకరంపేట, తన తండ్రి పేర సంగారెడ్డి, తల్లి పేర రాజం పేటలను నిర్మించింది. ఈ గడీ నేటికీ చెక్కు చెదరలేదు. గడీ లోపల విశాలమైన స్థలంలో గుర్రాలు, ఒంటెలు ఉండేవి. మధ్యలో నీటి కొలను, రెండు సొరంగ మార్గాలు ఉండేవి. ఈ గడీ లోపల ఢంకాతో నగారా మోగించేవారు.



**మదన పల్లి గడీ :** వరంగల్ జిల్లా ములుగు మండలానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఈ గడీ. ఈ గడీ మిగతా గడీలన్నింటికి భిన్నంగా ఉంటుంది. గిరిజన బిడ్డలైన లంబాడా దొరలు పాలించిన గడీ ఇది. ఈ గడీలో వెట్టిచాకిరీ లేదు, దౌర్జన్యాలు లేవు, దాసీలు లేరు, తిరుగుబాట్లు లేవు, గడీ ప్రధాన ద్వారం ముందు ప్రజలు కూర్చోవడానికి రెండు అరుగులు నిర్మించారు. నిజాం ప్రభుత్వానికి కునుకు లేకుండా చేసిన బడితెగాడు అనే గజదొంగను పట్టించిన నాయక్ కుటుంబానికి కొన్ని గ్రామాల భూములను ఇనాంగా ఇచ్చి, పాలించే అధికారాన్ని ఇచ్చాడు నిజాం. అందుకే వీరిని దొంగను పట్టించి దొరలయ్యారు అని అంటారు. పోరిక నాయక్ దొర తీర్పులు చెప్పే సమయంలో వెండి నాణేల గొడుగు కింద కూర్చొని తీర్పు చెప్పే వాడట. వీరు శ్రీరాముణ్ణి ఎక్కువగా కొలిచేవారు.



**ముగింపు :** ఈ విధంగా తెలంగాణ గడీలు పుస్తకం ద్వారా గొప్ప చారిత్రక నిర్మాణాలు, వాటి నేపథ్యం, అప్పటి ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక విశేషాలను వెలికి తీసి, ఒకచోట కూర్చి మనకు అందించారు. ఇప్పటికే చాలా వరకు శిథిలావస్థకు చేరిన ఈ గడీలు, భవిష్యత్తులో కనుమరుగై పోయే ప్రమాదం ఉంది. ఈ సమయంలో వీరు చేసిన ప్రయత్నంతో భవిష్యత్ తరాలకు ఒక గొప్ప చారిత్రక నిధిని అందించినారు.



ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 (30) హైదరాబాద్ మే : 2024

# అంతరించి పోతున్న కళారూపం – చిందుబాగోతం

**బాషిపంగు వెంకన్న**, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 905 218 0854

**ఉపోద్ఘాతం**

తెలంగాణ జానపద ప్రదర్శన కళలకు పుట్టినిల్లు. ఇక్కడ ఎన్నో /జానపద ప్రదర్శన కళలు పుట్టి పేరు ప్రఖ్యాతులు పొందాయి. జానపద ప్రదర్శన కళారూపాలలో ఒకటి చిందుబాగోతం. సంగీత, నృత్య సాహిత్యలతో కూడిన నిరక్షరాస్యుని భావగీతమే జనపదగేయం ఆ కోవకు చెందినదే – చిందు బాగోతం. నేడు తెలంగాణ ప్రాంతంలో సినిమాలు, టి.వి.లు ఇంటర్నెట్, సెల్‌ఫోన్స్ వంటి ప్రసారమాధ్యమాల ప్రభావం వల్ల అంతరించి పోతుంది. కావున చిందుబాగోతం విశిష్టతను, ప్రాముఖ్యతను తెల్పడమే ఈ నా చిన్ని ప్రయత్నం.

**జానపదం**

జనపదం అనగా "పల్లెటూరు" అని అర్థం. జనపదాలలో నివసించే ప్రజలు జనపదులు. జనపదులను తెలుగులో "పల్లె", "పల్లీయలు" అంటున్నాం. జనపదులు అనగా నిరక్ష్యరాస్యులు వీరు ఆడుతూ పాడుకునే మౌఖిక సాహిత్యమే జానపద సాహిత్యం.

**జానపద సాహిత్యం – నిర్వచనాలు**

మౌఖిక విజ్ఞానమే జనపద సాహిత్యం Oral Falk Literature గా పిలుస్తున్నాం. ఈ విభాగంలో జానపద గేయాలు, కథాగేయాలు, కథలు, సామెతలు పొడుపు కథలు చేరుతాయి. హిత సహితమైనది సాహిత్యమైతే జానపదసాహిత్యం కంటే ఉత్తమ సాహిత్యం మరొకటి లేదు.

**జానపద కవిత్వం – లక్షణాలు**

1) అజ్ఞాత కర్తృత్వం
2) సామూహిక ప్రచారం
3) మౌఖిక సంప్రదాయం

**జానపద సాహిత్యం – ప్రదర్శన కళలు**

భౌగోళిక పరిస్థితులను బట్టి, ప్రజల జీవన విధానాన్ని బట్టి ఆయు ప్రాంతాలలో ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలు నెలకొని ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు అణుగుణంగా లయతో, రాగబద్ధంగా ఉండి స్థానిక భాషా మొదలైన అంశాలతో ఆ కళారూపాలు చోటు చేసుకుంటాయి. తెలంగాణ ప్రాంతంలో విశిష్టత గల కళారూపం – చిందుబాగోతం.

ప్రదర్శన కళలను బిరుదురాజు రామరాజు 3 రకాలుగా విభజించారు. అవి 1) సంగీత ప్రధానమైవి 2) నృత్య ప్రధానమైనవి 3) రూపక ప్రధానమైనవి. ఈ మూడు లక్షణాలు కలిపితే చిందుబాగోతం.

**జానపద నృత్యం – చిందు బాగోతం**

మానవుడు మొదట సృష్టించుకున్న కళాప్రక్రియ నృత్యం. ఇంకా చెప్పాలంటే నృత్యం మాట, పాట కంటే ప్రాచీనమైనది. మనిషి జీవితంలో సంతోషం, దుఃఖం, వేదన, ఆప్యాయత, పుట్టుక, చావు వంటివి లయాత్మకమైన నృత్యంగా రూపుదిద్దుకుంది. జానపద నృత్యాలలో గెంతటం, కుంటడం, చిందువేయటం, ఆడటం వంటివి ప్రధానంగా ఉంటాయి.

**చిందు భాగవతం – పుట్టుక**

కళారూపాలలో అతి ప్రాచీనమైనది చిందుబాగోతం. దీనిని చిందు యక్షగానం అని కూడా పిలుస్తారు. పూర్వం తెలుగు ప్రాంతాన్ని యక్షభూమి అని పిలిచేవారు. యక్షులు ఆడిపాడిన భూమి కాబట్టి ఈ విధంగా పిలిచారు. లయబద్ధంగా అడుగుల నృత్యకేళియే చిందు. అయితే ఇందులో సాహిత్యానికి తక్కువ ఆవకాశం ఉంటుంది. నృత్యమే ప్రధానం. చిందుబాగోతం ప్రదర్శించే వారిని చిందు భాగవతులు అంటారు. మాదిగల అశ్రిత కులాల్లో చిందు భాగవతులు ఒకరు. వీరు మాదిగలపై ఆధారపడి జీవిస్తారు. కాబట్టి వీరిని చిందు మాదిగలు అంటారు. వీరు ఎక్కువగా తెలంగాణ ప్రాంతంలో కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కలరు.

చిందు యక్షగానం మాదిగ కులంలో పుట్టింది. మాదిగలను ఆశించి పూర్వకాలం నుండి తాతల ముత్తాతల నుండి మాదిగలను ఆశించి జీవనోపాధి గడుపుతున్న వారు చిందులు. చిందు కులం మాదిగలకు ఉపకులం కనుక వీళ్ళకి అంకిత భావంతో ఉండి వారిని అనుసరించి, వారి విడిది ఇళ్ళలో ఉండి జీవనోపాధిగా హక్కు భుక్తంగా ఆయా ప్రాంతాలలోని గ్రామాలను వీరి పెద్దల ద్వారా హక్కుగా పొందుతారు. వీరు ప్రతి గ్రామంలో 3 లేదా 4 ప్రదర్శనలు వేసి చివరి రోజున జాంబవంతుని వేషం, మాదిగల ఇంటి దేవత ఎల్లమ్మ దేవి వేషం వేసి మేకలు, గొర్రెలను నరికి గ్రామంలో మాదిగ వాడ వరకే బలి చల్లటం అనేది పూర్వకాలం నుండి వస్తున్న సంప్రదాయం. ఇది తాతల నుండి వారసత్వంగా వస్తున్న కళారూపం.

**చిందు బాగోతం**

పూర్వకాలం నుండి ప్రజలను అలరించిన కళ "చిందు బాగోతం" నేడు సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్ వీడియోల దాటికి తట్టుకోలేక ఈ కళ కనుమరుగవుతున్నది. చిందు యక్షగానమే కులవృత్తిగా చేసుకొని మాదిగల చరిత్ర వైభవాన్ని కథగా చెప్పేవారు చిందు కళాకారులు. తెలంగాణ పల్లెల్లో చిందుకళకు ప్రత్యేక స్థానం ఉంది. మాదిగ కులం ఉపకులమైన చిందుమాదిగలు మాదిగలకు పెళ్లిళ్లు, పండుగలు, మాదిగ చరిత్రను చెబుతూ వీరిపై ఆధారపడి



జీవనం కొనసాగిస్తారు. గ్రామాలలో ఊరికి దూరంగా నెట్టివేయబడి కడుపేదరికంతో జీవనం సాగిస్తున్న మాదిగలపై ఆధారపడి వీరు జీవించడం విశేషం. అప్పట్లో మాదిగలే ఈ కళారూపాన్ని బ్రతికించారు అనడంలో సందేహమేమీ లేదు.

చిందు బాగోతం దేశముఖ్‌లు గడీల ముందు, బొడ్రాయిల ముందు చింతచెట్ల నీడల క్రింద, కూడలి విధుల వద్ద, రచ్చబండ వద్ద ఈ చిందుబాగోతం ప్రదర్శిస్తారు. వీరు పగలు, రాత్రి మొదలుకొని (రాత్రి అయితే 8 గంటల నుండి తెల్లవారు జామున 6 గంటల వరకు) ప్రేక్షకులను లేవకుండా ఉద్రూతలూగిస్తూ వీరి కళారూపం అయిన చిందు భాగవతాన్ని ప్రదర్శిస్తారు. వీరు సంవత్సరంలో 6 నెలలు మాత్రమే చిందు భాగవతం ప్రదర్శిస్తారు. ఎందుకంటే వర్షాకాలం భాగోతానికి సహకరించదు. ప్రజలు పనులల్లో నిమగ్నం అవుతారు. కాబట్టి వీరు ఎండాకాలంలో ఎక్కువగా ప్రదర్శనలు ఇస్తారు.

చిందు భాగవతం అంబకీర్తన పాడుతున్నారంటే భాగోతం మొదలు పెట్టినట్లు అర్థం. ఈ అంబకీర్తన చిన్న పిల్లలు ఆలపిస్తారు.

ఇంతలో పరదా వెనుకల వేషాలు తయారు అయ్యేదాక ఇదే ఉంటుంది. వేషాలు తయారు అయిన తర్వాత అసలు భాగోతం మొదలు పెట్టినప్పుడు ముందుగా గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన చేస్తారు. భాగోతం మొదలు అవుతుంది. వీరు వారి వాద్యాలు మద్దెలు, తాళాలు, గజ్జెల గమ్మెవాద్యాలు హార్మోనియం, పూంగి (సొరకాయ బుర్ర తయారు చేస్తారు) సన్నాయి వీటి అనుగుణంగా అడుగులు వేస్తూ చిందు ఆడుతారు. భాగోతంలో "బుడ్డర్ఖాన్" వేషం చూసేవారికి హాస్యంగా ఉంటుంది. ఈ వేషం లేకుండా భాగోతమే లేదు. చిందు భాగోతంలో మొత్తం 12-15 మంది కళాకారులు ఉంటారు. వీరు సారంగధర, చెంచులక్ష్మి, సతీసావిత్రి, ప్రహ్లాద, మైరావణ, రామాయణం, భారతం, బభ్రువాహన, బాల నాగమ్మ, హరిశ్చంద్ర, జాంబవంతుని కథ, ఎల్లమ్మ కథలు ప్రదర్శిస్తారు.



చిందు ఎల్లమ్మ



వీరు దీపావళి పండుగ తర్వాత ఊర్లకు బయలు దేరి సంక్రాంతి శివరాత్రి దాకా భాగోతాలు ఆడి ఊర్లల్ల వానకాలం మొదలు అయ్యే వాటికి ఇంటికి తిరిగి వచ్చి వ్యవసాయ కూలీలుగా నిమగ్నమై పనులు చేసుకుంటారు. వానకాలం వీరు తెలియని కథలు కూడా నేర్చుకుంటారు.

**వీరు ప్రదర్శించే కొన్ని భాగోతాలు**

చెంచులక్ష్మీ యక్షగానం... చెంచులక్ష్మీ - నరసింహ స్వామితో

ఎవ్వర మైతే పోరా... నాతో ఎదురించ రాకురా చోరా...

దువ్వుండి మాట్లాడు దగ్గరకు వచ్చేవు... కోపముచే బాణమున కొట్టి వేసెద చూడు....

కీచక వధలో కీచకుడు, ద్రౌపదిని చూసి...

ఏమి ఎవతి ఈ ఇంతి

ఏమి భువి నుండి దిగి వచ్చిన అప్సరసయ... మదన మనోహర సుందర నారియ ... హ... హ

ఏమి అందము... ఏమి చందము...

**చిందు ఎల్లమ్మ**

చిందు భాగవతానికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన మహిళ చిందు ఎల్లమ్మ. అసలు పేరు "సరస్వతి" ఈమె తన ఇంటి పేరునే "చిందు"గా మార్చుకుంది. ఈమె 1923లో ఆదిలాబాదు జిల్లా బాసరలో జన్మించింది. చిందు భాగవతం కోసం తన వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పింది. తన భర్తకి తన చెల్లెలిని ఇచ్చి పెండ్లి చేసి సంసార జీవితం నుండి తప్పుకుంది. తాను 11 యేట భాగవతం ప్రారంభించి 50 సం.రాల వరకు ప్రదర్శనలు ఇచ్చింది. ఈమెకు 1999లో "హంస అవార్డు" ఇచ్చి ప్రభుత్వం సత్కరించింది. 2004లో రాజీవ్ పురస్కారం లభించింది. ఈమె 2005 నవంబర్ 10న మరణించింది.

**గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు ప్రకటన**

ఇటీవల జానపద కళలు విభాగంలో చేసిన సేవలకు గాను 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7  హైదరాబాద్ మే : 2024

# అట్లనే ...

**అన్నవరం దేవేందర్,** ఫోన్ : 9440 763 479

ముక్కూ మూతి నుదురూ గదువ
పోలికలన్నీ పోత బోసినట్లే

తెలిసిన వాళ్ళే కావచ్చని
చిరునవ్వుతో దగ్గరికి పోబోతాం
క్షణంలోనే కాదని తెల్లమొహం

గుంపులు గుంపులుగా జనాలున్న చోట
ఒకే ముఖ కవళికలు, ఒకే తీరు నవ్వులు
నడకలోనూ అవే అడుగులు
అట్లనే పొడుగ్గా కొయ్య కాళ్ళు
గీతల గీతల నిండు చేతుల అంగి
తీరా దగ్గరికి పోయి చూస్తిమా
ఆవరించిన తెలవనితనం

దూరం నుంచి నడిచి వస్తుంటే
గుండ్రంగా మెరుస్తున్న బట్ట గుండు
ఎత్తూ బొత్తూ చూసి మనోడే అనుకుంటం
దగ్గరికి వస్తున్న కొద్దీ నవ్వు మొఖం మాయం

ఒకే పేగు అన్నదమ్ములు అక్కా చెల్లెలు
తండ్రీ కొడుకులు తల్లీ పిల్లలు
రూపు రేఖా విలాసాలతో పోల్చుకోవచ్చు
రూపం కలిసినా తెలవని వాళ్ళంతా
ఎక్కడో తెగిన మరో తీగల విత్తనాలు

మనిషిని పోలిన మనిషి రక్తం ఒకటే
అక్కడక్కడా అద్దంలా అగుపిస్తాడు
అంతటా పారే నరుని తీగా ఒకటే
అందుకే పూసే పూలన్నీ అచ్చం ఒకే తీరు.

❖ ❖ ❖ ❖ ❖



జిల్లా ప్రస్తుతం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్యకు కేంద్ర ప్రభుత్వం విశిష్టమైన పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. చిందు బాగోతం విభాగంలో పద్మశ్రీ అవార్డు పొందిన గడ్డం సమ్మయ్య ఆది నుండి అనేక అవమానాలను ఎక్కిరింపులను భరిస్తూ నమ్ముకున్న కులవృత్తి అయిన కళను బతికిస్తూ ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ జాతీయస్థాయిలో ఎదిగారు. చిందుకళాకారుల కుటుంబంలో పుట్టిన సమ్మయ్య వారసత్వంగా వచ్చిన చిందుకళలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. చిందు కళాకారులపై ఆయన మాటల్లో **'రంగస్థలంపై రారాజులం నిత్యజీవితంలో దుర్భరులం! రాత్రి అంతా రాజులం.. తెల్లవారితే బికారులుగా బ్రతుకుతున్నామంటారు'**. చిన్ననాటి నుంచి చిందుకళను వారసత్వంగా స్వీకరించి దశాబ్దాల కాలంగా వేల ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. భాగవతం పురాణాలతో పాటు ప్రస్తుత కాలానికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలను, పర్యావరణం గురించి యక్షగానం రూపంలో ప్రదర్శనలు ఇచ్చారు. గడ్డం సమ్మయ్య ప్రతిభకు ఎన్నో అవార్డులు మోకరిల్లాయి. 2009లో కళారత్న హంస అవార్డు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ కళాకారుడిగా అవార్డులు లభించాయి.

**ముగింపు**

చిందు అనే ఈ విశిష్ట కళారూపం ఒక్క తెలంగాణ ప్రాంతంలో తప్ప మరే ప్రాంతంలోనూ కనిపించదు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఎనలేని గుర్తింపు తెచ్చిన చిందు కళారూపం నేడు గ్రామాలలో ఆదరణ కోల్పోయింది. సినిమాలు టీవీలు, ఇంటర్నెట్‌లు, సెల్‌ఫోన్స్ ప్రసార మాధ్యమాల ప్రభావం వల్ల చిందుబాగోతానికి ఆదరణ కరువైంది. రాను రాను కళాకారుల సంఖ్య తగ్గుతుంది. భాగోతం శిక్షణ లేక నేడు తెలంగాణలో కళారూపం కనుమరుగవుతుంది. మన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలంటే ఈ కళకు తిరిగి జీవం పోయాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని చిందు బాగోతం అకాడమి నెలకొల్పి ఈ కళకు ఆదరణ కల్పించాలి. ప్రాచీన వారసత్వ సంప్రదాయాలను కాపాడుకోవాలి.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 (33) UGC CARE List Approved Journal హైదరాబాద్ మే : 2024

# తెలుగులో నవ్యకవిత్వం : ఆవిర్భావం, వికాసం

**డా. భూక్య తిరుపతి,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9010501030

నవభారత నిర్మాణానికి కృషిచేసిన మహనీయులు రాజారామమోహనరాయలు గారు. వీరు భారతదేశ పునరుద్ధరణకు కారణబద్ధులై రెండు రకాలుగా కృషిచేశారు. భారతదేశంలో ఆంగ్ల విద్యా వ్యాప్తికి, సంఘసంస్కరణోద్యమానికి కృషి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధునికంగా వస్తున్న మార్పులను భారతీయులు తెలుసుకోవడానికి అవసరమైన ఆంగ్లభాషను భారతదేశంలో ప్రవేశపెట్టడానికి మూలపురుషుడు రాజారాంమోహనరాయ్‌లు. 1823లో నాటి బ్రిటీషు ప్రభుత్వం భారతదేశంలో విద్యావ్యాప్తి గురించి కమిటిని నియమిస్తే, ఆ కమిటీ సంస్కృత కాలేజీలు ప్రారంభించ డానికి ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆ సిఫారసుని వ్యతిరేకించి సంస్కృత కాలేజీలకు బదులు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టమని ఆనాటి బ్రిటీషు గవర్నర్ జనరల్ 'Lord Amherst'గారికి ఉత్తరం రాశారు. దాని ఫలితంగా భారతదేశంలో 1835లో ఆంగ్ల విద్య వ్యాప్తి జరిగింది. ఆంగ్ల మాధ్యమాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టడం మూలంగా భారతదేశంలో అనేక రకాలైన మార్పులు చోటు చేసుకున్నాయి. భారతీయుల ఆలోచన విధానం మారిపోయింది. పాశ్చాత్య దేశాలలోని సాహిత్యాన్ని ఇతరాలైన గణితం, సైన్సు లాంటి పుస్తకాలు చదవడం వలన పరిపూర్ణమైన జ్ఞానం సంపాదించుకున్నారు.

రాజారామమోహన్‌రాయ్ సంఘ సంస్కరణ కృషి చేయడానికి, సంఘ దురాచారాలను నిర్మూలించడానికి బ్రహ్మసమాజాన్ని స్థాపిం చారు. సంఘ సంస్కరణోద్యమాలను, సమాజాన్ని పునర్నిర్మించడం కోసం 'సంవాద కౌముది' అనే పత్రికను నిర్వహించారు. బెంగాల్ ప్రాంతంలో రాజారామమోహన్‌రాయ్‌గారి బ్రహ్మ సమాజంతో పాటు దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజం కూడా సంఘ సంస్కరణోద్యమం కొరకు కృషిచేసినదే. వీరు చేస్తున్న సామాజిక కృషికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రభావితులైన వారు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. మరియు రఘుపతి వేంకటరత్నం నాయుడుగార్లు.

ఆంధ్రప్రాంతంలో సంఘసంస్కరణోద్యమానికి మూలపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. వీరు సంఘ సంస్కరణోద్యమం, స్త్రీ విద్యావ్యాప్తి, సాహిత్య ప్రక్రియలు ప్రారంభించిన నవయుగ వైతాళికుడు యుగ పురుషుడు కందుకూరి. వీరికి చైతన్యం కలిగించింది మాత్రం రాజారామమోహన్‌రాయ్. ఇదే విషయాన్ని ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు ఇలా అంటారు. **"చైతన్యానికి పరోక్షంగాను, ప్రత్యక్షంగానూ తోడ్పడే బ్రహ్మసమాజం ఆర్య సమాజం, రామకృష్ణమిషన్, దివ్యజ్ఞాన సమాజం మొదలైన సంస్థలు**




**సాగించిన ఉద్యమాలు ఇవన్నీ ఆంధ్రుల ఆలోచనలను రూపొందించిన కాలం పంతులుగారి కాలం."** (పుట–341: 2015). వీరేశలింగంపంతులుగారు మొదట సంఘసంస్కర్త తరువాత కావ్యకర్త. వితంతువులకు వివాహాలు జరిపించుటకు, స్త్రీ జనోద్ధరణ ఉద్యమానికి సాహిత్యం ఒక సాధనంగా భావించారు. పంతులుగారి సాహిత్యం ఆలోచించడానికి ఆవిర్భవించినట్లుగా ఉంటుంది. పంతులుగారు 1874లో వివేకవర్ధని అనే తెలుగు మాస పత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక ద్వారా రెండు ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పుకున్నారు. అవి భాషాభివృద్ధి మరియు దేశాభివృద్ధి. సరళమైన శైలిలో రచనలు చేయటం వలన భాషాభివృద్ధితోపాటు, దురాచారాలను నిర్మూలించి తద్వారా దేశాభివృద్ధికి పాటుపడటం కనిపిస్తుంది.

భారతదేశంలో ఆంగ్లవిద్యావ్యాప్తి ద్వారా భారతీయులలో నూతన వికాసం ప్రారంభమైంది. ఆ సమయంలోనే ఆంగ్లంతోపాటు తమ తమ మాతృభాషలలోనూ భారతీయులు రచనలు చేయడం ప్రారంభించారు. దక్షిణ భారతదేశమైన మద్రాసులో స్థాపించిన ఒక కళాశాలలో కాంబెల్, విలియంబ్రౌన్, సి.పి.బ్రౌన్ మొదలైనవారు తెలుగు నేర్చుకొని ఇంగ్లీషులో తెలుగు వ్యాకరణాన్ని రాశారు. దక్షిణ భారతదేశంలో ప్రజలకు మరింత జ్ఞానాభివృద్ధికి, వికాసానికి కృషిచేసిన ప్రముఖులు ఏనుగుల వీరాస్వామయ్య, వెంబాంకం రాఘవాచార్యులు మరియు శ్రీనివాస పిళ్ళైగార్లు కలిసి హిందూ లిటరరీ సొసైటీ అనే సంస్థను ఏర్పాటు చేసి ప్రముఖుల చేత ఉపన్యాసాలు ఇప్పించారు.

మద్రాసు ప్రాంతంలో ఒక ఆంగ్ల కళాశాల ప్రారంభించాలని అడిగితే కళాశాలకు బదులుగా 1841లో మద్రాసు విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. 1875 నాటికి భారతీయులు చాలామంది ఆంగ్లభాషను చదవడం, ఆంగ్లసాహిత్యాన్ని చదివి అర్థంచేసుకోవడం జరిగింది. అదే సమయంలో భారతదేశంలో ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించారు.





ఆంగ్ల సాహిత్యాన్ని చదివి, ఆ సాహిత్యంలో ఉన్న నవ్యతను గుర్తించి తెలుగులో కూడా అటువంటి వస్తు నవ్యతను తీసుకువచ్చారు. అదే సమయంలో భారతీయులు ముఖ్యంగా విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలు చదువుతూ వచ్చారు. మొదట్లో భారతదేశంలో క్రైస్తవ మత వ్యాప్తికొరకు కృషి అనేక విధాలుగా జరిగింది. తెలుగులో వెలువడిన మొదటి పత్రిక సత్యదూత. బళ్ళారి నుండి క్రైస్తవ మత వ్యాప్తికొరకు వ్యావహారిక భాషలో వెలువడుతుండేది. క్రైస్తవ మత ప్రచారం కొరకు బైబిల్‌ను త్వరితగతిగా ప్రజలలోకి తీసుకురావడానికి నిఘంటు నిర్మాణం కోసం కృషి చేశారు. ఆ పనిని మొదటిసారిగా కాంబెల్ గారికి బ్రిటీష్ ప్రభుత్వం అప్పచెప్పింది. 1852లో బ్రౌన్ దొర రెండు నిఘంటువులను ఆంగ్లం నుండి తెలుగు, తెలుగునుండి ఆంగ్లం ప్రచురించారు. అందుకే బ్రౌన్ దొరను ఆంధ్రభాషకు అమరసింహుని వంటివాడని శ్రీ కురుగంటి సీతారామయ్యగారి అభిప్రాయం. బ్రౌన్ దొర నిఘంటువులను అచ్చు వేయడమే కాకుండా ప్రాచీన సాహిత్య పుస్తకాలు కొన్నింటిని ముద్రించి వెలుగులోకి తెచ్చిన మహనీయుడు.

ఆంధ్ర ప్రాంతంలో సంఘ సంస్కరణోద్యమం చేస్తూనే మరోవైపు బహుముఖ సాహితీ ప్రక్రియలు సృష్టించడంలోనూ వీరేశలింగం పంతులుగారే పితామహులు. వీరు 1874లో వివేకవర్ధని అనే పత్రికలో భాషాభివృద్ధికి సంఘ సంస్కరణోద్యమానికి కృషిచేశారు. వీరు కవితారంగం తప్ప అన్నీ సాహితీ ప్రక్రియలలో కొత్త ప్రయోగాలు చేసిన వ్యక్తిగా చెప్పవచ్చు. అందుకే వారి గురించి మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు ఇలా అంటారు. **"అయిదవ వాచకం మొదలుకొని ఆంధ్రకవుల చరిత్రము వరకు రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి"** అని అంటారు. (పుట-132:1999) అలాగే కందుకూరి గారు తన గురించి తానే స్వయంగా ఇలా చెప్పుకున్నారు. **"తెలుగులో వచన ప్రబంధమును నేనే వ్రాసితిని మొదటి చరిత్రమును నేనే రచించితిని. స్త్రీలకై మొదటి వచన పుస్తకము నేనే కావించితిని"** అని అన్నారు. (పుట-132:1999) ఆంధ్ర ప్రాంతంలో ఒకవైపు ఆంగ్ల విద్యావ్యాప్తి మరోవైపు సంఘ సంస్కరణోద్యమం బలంగా సమాజంలోకి వస్తున్న కాలంలో, అదే సమయంలో ఆంగ్ల విద్యా విధానం ద్వారా నవ్యకవిత్వం తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది కట్టమంచి రామలింగారెడ్డిగారి ముసలమ్మ మరణం అనే కావ్యం ద్వారా.

కట్టమంచి రామలింగారెడ్డిగారి ముసలమ్మమరణం అనే కావ్యం నవ్యకవిత్వానికి తొలి ఉషాకిరణమని చెప్పవచ్చు. ఈ కావ్యం నవ్య కవిత్వపు నూతన ప్రయోగం. 1889లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో కావ్య రచన పోటీలలో బహుమతి పొందిన కావ్యమే **'ముసలమ్మ మరణం'**. తెలుగులో భావ కవిత్వం రాకముందే ఈ రచన వెలువడింది. ఈ కావ్యం ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో భావ కవిత్వానికి మార్గదర్శకంగా కనిపిస్తుంది. ఎందుకోగాని ఈ కావ్యం మొదట్లో ఎవర్నీ ఆకర్షించలేదు. కాని, రాయప్రోలు వారి తృణకంకణం ప్రచురణ తరువాత చాలామందిని ఆకర్షించింది. ఈ కావ్యంలోని వస్తువు, కథ మరణాంతముగా నవ్యతను సాదించింది. ఈ రచన కాలంలో మరణాంతముగా కావ్యమును పూర్తిచేయుట చక్కని నవ్యకవిత్వ ప్రయోగంగా కనిపిస్తుంది. ఇదే సమయంలో తిరుపతి వెంకటకవులు తమ కవిత్వం ద్వారా అష్టావధానం, శతావధానం, ఆశుకవిత్వం మొదలైన ప్రక్రియల ద్వారా తెలుగు సాహిత్యక్షేత్రంలో సుసంపన్నమైన స్థానం సంపాదించుకున్నారు. వీరు కూడా తమ రచనల్లో కూడా నవ్య కవిత్వోద్యమానికి సంబంధించిన కొత్తపుంతలు తొక్కిన వారుగా చెప్పవచ్చు.

నవ్య కవిత్వ మహోదయానికి మూలకారకులు గురజాడ, రాయప్రోలు గార్లు. 1909 రాయప్రోలుగారి లలిత, 1910లో గురజాడగారి ముత్యాల సరాలు వెలువడినై. వీటితోనే తెలుగులో నవ్యకవితాశకం ప్రారంభమైంది. ఆనాడు సాహిత్యాభివృద్ధికి కృషిచేసిన ఆనాటి తెలుగు పత్రికలు మంజువాణి, మనోరమ, సరస్వతి, కళావతి, కల్పలత పత్రికలు ముఖ్యమైనవి. నాటి ఆంధ్రభారతి పత్రికలో ఖండకావ్యాలు ఎక్కువగా వెలువడినయి.

నవ్య కవిత్వం సామాన్య మానవుల పలుకుబడిలాగా ఉంటుంది. కవిత్వ పదప్రయోగాలు ప్రజలకు దగ్గరలో ఉంటాయి. సమాజంలో సామాజిక మార్పు రావాలంటే దానికి శక్తివంతమైన సాహిత్యం రావాలి. ఈ మార్పు ఆధునిక కాలంలో నవ్య సాహిత్యం నుండే మొదలైంది. వాస్తవానికి ప్రాచీన సాహిత్యకోణం ఒకలా, ఆధునిక సాహిత్యకోణం మరోలా ఉంటుంది. ఇదే విషయాన్ని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఇలా అంటారు **"ప్రాచీన సాహిత్యంలో సమాజం ప్రతిఫలించింది కానీ, వీరేశలింగం పంతులుగారి కాలంనుండి సమాజానికి సాహిత్యం ప్రతిస్పందించింది. సమాజాన్ని తన భుజాల మీదకు ఎత్తుకున్నది"** (పుట-343: 2005) పంతులుగారి సాహిత్యంలో సంఘం చైతన్యంతో పాటు, సంఘం కోసం రచిస్తున్న సంస్కరణోద్యమ స్పృహకూడా కనిపిస్తుంది. సామాన్య మానవుడు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అందుకే

సామాన్యులను ఆలోచింపచేసే సాహిత్యమే పంతులుగారి చివరి లక్ష్యంగా కనిపిస్తుంది.

ఆధునికంగా నవ్యకవిత్వానికి బీజం 1909లో పడింది. నవ్య కవిత్వం ప్రధానంగా ఖండకావ్యం రూపంలో కనిపిస్తుంది. నవ్య కవిత్వానికి అనేక రకాలుగా, భిన్న కోణాలలో నిర్వచనాలు ఇచ్చారు. విశ్వనాథగారు ఇచ్చిన నిర్వచనం పరిశీలిస్తే **"సృష్టిక్రమంలో సృష్ట్యాది నుండి కాల నిర్ణయంలో భిన్న రాజచరిత్ర నిర్ణయంలో, సంఘ ధర్మ నీతులలో ఆర్థిక, రాజకీయాల్లో సారస్వత పథాలలో ఒక విశిష్టమైన సంస్కారంతో గూడిన సిద్ధాంతాల మీద మన జాతి నడిచింది. ఇవ్వాళ అంగిలేయులు మన్ని ఆక్రమించడం చేత ఆ మహా సంస్కారం మీద అభిమానం పోయింది. పాశ్చాత్య దేశీయుల సంస్కారం మీద అభిమానం ప్రబలింది. ఏ తదాభిమాన పురస్కృతములైన భాషాతత్త్వం, చరిత్ర నిర్మాణం, సృష్ట్యాది కాల నిర్ణయం, సంఘ ధర్మాలు, విశ్వాసాలు, వీటిని యేయే గ్రంథం పరామిర్శిస్తుందో అదంతా నవ్య సాహిత్యం"** (పుట-164: 1999).

పై నిర్వచనాన్ని పరిశీలిస్తే ఆధునిక తెలుగు సాహిత్యం పాశ్చాత్యుల విజ్ఞానానికి లోనైనదని, ఆ ప్రభావంతో వచ్చినదంతా నవ్య సాహిత్యమని చెప్పవచ్చు. నవ్య సాహిత్యాన్ని రాసిన ప్రముఖ కవులు రాయప్రోలు, గురజాడ, నాయని, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, జాషువా, శ్రీశ్రీ, నండూరి, దువ్వూరి, తుమ్మల, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కొమర్రాజు లక్ష్మణరావు, పింగళి, కరుణశ్రీ మొ॥నవారు. నవ్య కవులందరిలోనూ సాహిత్యంలో కొత్త ప్రయోగమే కనిపిస్తుంది. నవ్య కవిత్వంలో ఖండకావ్యమే ముఖ్యమైనది. ఇది 20వ శతాబ్దిలో ప్రారంభమైన ప్రక్రియ. పాశ్చాత్య విజ్ఞాన ఫలితంగా సమాజంలోనూ, సాహిత్యంలోనూ వచ్చిన మార్పు. ఖండకావ్యానికి ఇంగ్లీషు కవిత్వమే హేతువుగా కనిపిస్తుంది.

కట్టమంచివారి ముసలమ్మ మరణం సాంఘిక ఇతివృత్తంగల ఒక విషాద కావ్యం. దాని గురించి ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఇలా అంటారు. **"లిరిక్కుతో ప్రేరణ చెంది ముసలమ్మ మరణం అనే పాస్టోరల్ ఎలిజీని కొంత వీరగాథా స్వభావంగల పేరంటాలి చరిత్రను తెలుగులో పద్యాలలో నిర్మించారు కట్టమంచివారు 1899లోనే"** అని అన్నారు (పుట-268: 2005). నవ్య కవిత్వంలో రాయప్రోలు రచనల్లో తెలుగు జాతి సాంస్కృతిక మూల్యాంకన పునరుద్ధరణం కనిపిస్తుంది. వీరి కావ్యాలలో నాయికా ప్రాధాన్యం ప్రధాన భూమికగా ఉంటుంది.

నవ్యకవిత్వంలో వర్ణనలకు చెందిన పాత్రలను పరిశీలిస్తే నాయకీ నాయకులకు సంబంధించినవిగా కనిపిస్తాయి. యెంకి పాటలు, వనకుమారి, లవణరాజుకల లాంటి సామాన్య జనుల జీవితాలతో చిత్రించినవే. నవ్య కవిత్వంలో నాయికా నాయకుల గుణం మాత్రమే ప్రధానం. జాషువాగారి గబ్బిలం కావ్యంలో బక్కచిక్కిన అస్పృశ్యుదులో




గుణం మాత్రమే మనకు కనిపిస్తుంది. నవ్య కవుల రచనలలో కనిపించే వస్తువు గొల్లవాళ్ళు, అస్పృశ్యులు, కాపువాళ్ళు, పడవనడిపేవాళ్ళ జీవితాలు కనిపిస్తాయి. ఈ కవుల వర్ణనలు సహజ సిద్ధంగా ఉంటాయి. అంగాంగ వర్ణనలు కనిపించవు. అనుభూతితో కూడిన వర్ణనలు ఎక్కువగా ఉంటాయి. నవ్య కవిత్వంలో వస్తుపరంగా భావానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. శైలీలోనూ నవ్యత ఉంటుంది. సరళపద ప్రయోగాలు ప్రజలందరికి, అర్థమయ్యే విధంగా రచనలు చేశారు. ఈ కవులు పదప్రయోగంలోనూ, వ్యవహారంలోనూ లేని పదాలను వాడలేదు. ప్రాచీనులు వాడిన విధంగా పదాలు స్వీకరించ లేదు. సమకాలీన కాలపు సమాజంలో ఉన్న పదాలు, చలామణిలో ఉన్న పదాలు ఎక్కువగా తీసుకున్నారు. శిష్టవ్యావహారిక భాషాపదాలు మాండలిక భాషాపదాలు, వాడుక భాషలో ఉన్న యాస పదాలకు ప్రాధాన్యత ఇచ్చారు. నవ్య కవులు కవిత్వ గుణాలకే ప్రాధాన్యత ఇచ్చారు. నవ్య కవిత్వంలో ప్రక్రియాపరంగా బహుముఖీకరణ కనిపిస్తుంది. నవ్యకవులు దేశీ కవితకు ప్రాధాన్యత ఇచ్చారు.

నవ్యకవిత్వంలో గురజాడ వారు చేసిన ప్రయోగాలు ప్రాచీన సాహిత్యంలో పాల్కురికి సోమనాథుని ప్రయోగాలు ఒకేలా కనిపిస్తాయి. ఇరువురు తమ తమ కాలాలలో వ్యవహారంలో ఉన్న పదాలు, పలుకుబడులు తమ రచనలలో ప్రయోగించిన వారే. పాల్కురికి జానుతెనుగును ప్రవేశపెడితే గురజాడ తెలుగు పలుకుబడికి పట్టం కట్టాడు. ఇద్దరిలోనూ దేశి పద్ధతి కనిపిస్తుంది. గురజాడ కావ్యవస్తువు ఎంచుకునే విషయంలో గురజాడపై వర్డ్సువర్త్, రవీంద్రుని ప్రభావం కనిపిస్తుంది. వర్డ్సువర్త్ తన రచనలలో సామాన్య ప్రజల జీవితాలను కావ్యవస్తువుగా తీసుకున్నారు. గురజాడ వారు కూడా తన రచనలలో సామాన్య మానవుల జీవితాలనే కావ్యవస్తువుగా తీసుకున్నారు. వర్డ్సువర్త్ గొల్లవారి కథను తీసుకుంటే గురజాడ సెట్టికూతురును, పూజారికూతురును, లవణరాజుకలలో మాలెతను కావ్యవస్తువులుగా స్వీకరించారు. అలాగే రవీంద్రుని, గురజాడ రచనలలో విశ్వమానవప్రేమ కనిపిస్తుంది.

చిలుకూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణగార్లు రాయప్రోలు వారి ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించారు. రాయప్రోలు గారు గోల్డ్‌స్మిత్ రాసిన Hermit అనే దానిని తెలుగులో లలిత అనే పేరుతో రచించారు రాయప్రోలుగారు. ఇది ఒక వియోగిని విలాప కావ్యం. టెన్నిసన్ రచించిన డేరా అనే కావ్యంను 1910లో అనుమతి అనే పేరుతో, 1912లో తృణకంకణంను రాయప్రోలు రచించారు. రాయప్రోలు రచనలలో వస్తు పరంగానూ, భావపరంగానూ, నవ్యత రూపంలో రాయబడిన కావ్యం తృణకంకణం. తృణకంకణం కావ్యంలో అమలిన శృంగార సిద్ధాంతం కనిపిస్తుంది. రాయప్రోలుపై వర్డ్సువర్త్, కీట్సు, షెల్లీలు, రవీంద్రుడు, కొమర్రాజు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, కాళిదాసు, భవభూతిల ప్రభావం కనిపిస్తుంది. రాయప్రోలు రచనలలో మధ్యతరగతి వ్యక్తుల జీవితాలు, ప్రణయం ప్రధాన వస్తువులు. అలాగే వ్యక్తుల ప్రశంసాగీతాలకు, స్మృతిగీతాల రచనకు రాయప్రోలువారే మార్గదర్శకులు. ఇదే విషయాన్ని ఆచార్య నారాయణరెడ్డిగారు ఇలా అంటారు. **వ్యక్తుల ప్రశంసా గీతములకు, స్మృతిగీతములకు (Elegy) వీరే మార్గదర్శకులు. గోఖలే నిర్యాణం పిమ్మట వీరు వ్రాసిన పద్యము లానాటి సమాజమును కదిలించివేసినవి. అట్లే రాధాకృష్ణుడు, రవీంద్రుడు, రామలింగారెడ్డి, గిడుగు మున్నగు వారిని గూర్చి వీరు వ్రాసిన ప్రశంసాపద్యములు, స్మృతిగీతములు వీరి వస్తు నవ్యతకు తార్కాణాలు. వీరి వస్తువైవిధ్యమునకు పులియాకుపై వ్రాసిన పద్యములు మచ్చుతునకలు** (పుట-286, 1999). గురజాడ రాయప్రోలు గార్ల రచనలను పరిశీలిస్తే గురజాడ వారు, సంఘ సంస్కరణ చైతన్యానికి ప్రాధాన్యమిస్తే, రాయప్రోలు వారు సాంస్కృతిక చైతన్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

**ఆధార గ్రంథాలు**

1) డా॥ సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు, 1999.

2) ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, 2005

3) డా॥ కడియాల రామమోహనరాయ్, 20వ శతాబ్ది తెలుగు కవిత్వం, 2003.

4) డా॥ పోతిరెడ్డి చెన్నకేశవులు, స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సంఘసంస్కరణ, 2006.

❖ ❖ ❖ ❖ ❖

# శబ్దం ...




శబ్దం ఒక హృదయ విస్ఫోటనం. కొంత చెవులకే పరిమితం
కొంత ఇంద్రియాలను తాకుతుంది. కొంత మనసును కదిలిస్తుంది.

శబ్దం ఒక మౌన తపోభంగం. సంసార సాగరంలోకి ఆకర్షిస్తుంది.
అలల సవ్వడిలో కలిసిపోతుంది. నుదురు గట్టుతో కొట్టుకుంటుంది.

శబ్దం ఒక సంఘర్షణ రవం. శిఖరాలు దొర్లుకుంటూ పడిపోతాయి.
గులకరాళ్ళు ఎగసిపడతాయి. గాలి ఊపిరి బిగబట్టి నిలిచిపోతుంది.

శబ్దం ఒక ప్రకృతి సంవాదం. పచ్చనాకులు ముచ్చటాడుకుంటాయి.
పండుటాకులు తొడిమ ఊడి రాలిపడతాయి. చెట్టు మొద్దుబారి నిలబడిపోతుంది.



శబ్దం ఒక ఉదయరాగం. కోడై కూస్తుంది. పూవై పూస్తుంది.
పయనించి పయనించి తలుపులు మూస్తుంది. కాలం చీకట్లో రేపటి కల కంటుంది.

శబ్దం ఒక శిశుజననం. ఆకలితో మొదలయిన దుఃఖరాగం
అనురాగం, అందం, ఆరాటం, పోరాటం వాయిద్యాలపై వినిపిస్తూనే ఉంటుంది.
చితిమంటల్లో చితికి పోతుంది.

శబ్దం సాప్తపదీనం. స నుండి ని వరకు హెచ్చు తగ్గులతో బ్రతుకు పాట పాడుతూనే ఉంటుంది.
హార్మోనియం తిత్తిలో గాలి ఆగిపోగానే స్వరం మౌనం పాటిస్తుంది.

**(డా. గంధ్ర లక్ష్మణ రావు 'శతద్రు' (వచన పద్యాలు) నుండి)**

# కుచేలుని కథ – మానవతా విలువలు

**తోట రామకృష్ణ**, తెలుగు పరిశోధక విద్యార్థి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.
ఫోన్ : 7995504687

భగవంతుడు భక్తి బంధానికొకదానికి తప్ప దేనికీ వశపడడు. భక్తి లేకుండా కోట్లను ఖర్చుచేసి ఆరాధించినా ఆయన అందనే అందడు. ఆయనకు ఏమీ ఇవ్వలేకపోయినా భక్తితో చేతనైనదాన్ని సమర్పించినా తప్పక పరిగ్రహిస్తాడు. అనుగ్రహిస్తాడు కూడా. 'నేను నీవాడను' అనే భావాన్ని మనం ప్రకటిస్తే చాలు ఆయన మనల్ని ఏ పరిస్థితిలోను వదలడు. ఆయన భక్తుల సేవలనందుకోవటమే కాదు, భక్తులకు సకల సేవలూ చేస్తాడు. ఎవరైనా అలా భగవంతుడిచేత సేవలు చేయించుకున్న వారున్నారా? లేకేం? మన ఇతిహాసంలో ఉన్నాడలాంటి మహాభక్తుడు. ఆయనెవరో తెలుసా? కుచేలుడు. కుచేలుడు అంటే పాతవి, చినిగినవి అయిన గుడ్డలు ధరించే వాడని అర్థం అతని అసలు పేరు సుధాముడు.

**బాల్యస్నేహం :**

కుచేలుడు కృష్ణుని చిన్ననాటి స్నేహితుడు. వారిద్దరు చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. వారి గురువు గారు సాందీపని మహర్షి. అప్పటి శిష్యవర్గంలో కుచేలుడు చాలా గుణవంతుడు. కృష్ణుడు సావాస గాడుగా ఉండటానికి కావాలసిన సద్గుణాలన్నీ అతని దగ్గర ఉన్నాయి. కుచేలుని మనస్సు అద్దంలాగా నిర్మలమైనది. అతనికి దేనిమీద కోరికలుగాని, రాగద్వేషాలు గాని లేవు. బుద్ధిమంతుడై క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసేవాడు. చక్కని బ్రహ్మచర్యవ్రతంతో మనస్సును ఇంద్రియాల్ని వశం చేసుకున్నాడు. సహజంగా బ్రహ్మజ్ఞానం కలవాడు అతనిదొక ఉత్తమమైన జన్మ.

**సుధాముడు కుచేలుడయ్యాడు :**

ఇన్ని ఉండి కూడ దరిద్రబాధ తప్పలేదు. ఎంతో అభిమానం కలవాడు కనుక ఎన్ని బాధలలో ఉన్నా ఎవరిని ఏమీ అడిగేవాడు కాడు. శ్రీకృష్ణుడు అతని పరిస్థితిని గమనించికపోలేదు. కాని అతని పూర్వజన్మ కర్మ ప్రబలంగా ఉండటం చేత సమయం కోసం వేచి ఉన్నాడు. కుచేలుడు విద్య పూర్తి చేసి గురుకులాన్ని వదలి పెరిగి పెద్దవాడై పెండ్లిచేసుకున్నాడు. పిల్లలు కూడా పుట్టారు అందులో చాలమంది పిల్లలు.

'దరిద్రుడికి సంతతి ఎక్కువ' అనే సామెత ఉండనే ఉంది. ఇంట్లో తాను పోషించవలసిన వారి సంఖ్య పెరిగినకొద్దీ దరిద్రం కూడా పెరిగింది. తన దారిద్ర్యాన్ని గురించి ఎన్నడూ దుఃఖపడలేదు. తనని అందరూ కుచేలుడు అని పిలుస్తూ ఉన్నా బాధపడలేదు. కుచేలుని భార్య పేరు వామాక్షి. ఆమె మహాపతివ్రత. సద్గుణాలలో అన్ని విధాల అతనికి తగిన భార్య. కుచేలుని దరిద్రబాధని కూడా సంతోషంతోనే పంచుకునేది. ఏ బాధైనా మితిమీరితే బాధగానే ఉంటుంది. భరింపరాని దారిద్ర్యం అనుభవిస్తున్నా భర్తను బిడ్డల్ని చూచి ఆమె చాలా నొచ్చుకునేది. బిడ్డలు రోజుల తరబడి అన్నం లేక ఆకలి బాధతో మలమల మాడుతూ ఉండేవారు. కడుపులో మంట భరించలేనపుడల్లా మంచి నీళ్ళతో పెదవులు తడుపుకునేవారు. ఒక్కొక్క వేళ అగ్నిహోత్రంలాంటి ఆకలికి తాళలేక వాళ్ళకి మనస్సు సొమ్మసిల్లి పోయేది. భయంతో ఏమీతోచక తలా ఒక విస్తరాకు తెచ్చుకొని తల్లిచుట్టూ చేరేవారు. "అమ్మా మాకు పట్టెడన్నం పెట్టు చాలు" అని దీనులై వేడుకొనే వారు. ఆమెకు కడుపు తరుక్కుపోయేది. ఒకనాడు ఆమె తన భర్త వద్దకు వచ్చి "మా అందరి జీవితాలు మీ ఆధీనంలో ఉన్నాయి. నేనేమీ చెప్పనక్కరలేదు. పేదరికం చూస్తే ఇల్లు నలు మూలలా ముంచెత్తుతున్నది. దీనికేదైనా ఉపాయం ఆలోచించరైతిరి కదా?

**వామాక్షి సలహా :**

ఆ మాటలు విని కుచేలుడు ఆలోచనలో పడ్డాడు. పరిష్కారమార్గం ఏమీ మనస్సుకు తట్టలేదు. ఆమె మళ్ళా కలుగచేసుకొని యిలా అంది. "శ్రీకృష్ణుడు మీకు బాల్యసఖుడు కదా? అతడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. ఒక మాట పోయి అతని దర్శనం చేసి రారాదా. అంటూ ఈ విధంగా అంటుంది...

**బాల సఖుడైన యప్పద్మ పత్రనేత్రుఁ**
**గాన నేగి దారిద్ర్యాంధకార మగ్ను**
**లైన మమునుద్ధరింపుము హరికృపాక**
**టాక్షి రవిదీప్తి పడుసి మహాత్మ నీవు!**

శ్రీకృష్ణుడు కోరినవాళ్ళకి వరాలు ప్రసాదిస్తాడు. సాధు స్వభావం గల భక్తిజనాన్ని చూస్తే అతనికి ప్రీతిఎక్కువ. వారు దేనినీ కోరరుకదా! అని జాలిపడతాడు. ఏబాధలలో ఉన్నవాళ్ళకైనా అతడే దిక్కు. ఆమె పలికిన మాటలు వినేసరికి అతనికి సమంజసమే అనిపించింది. భార్య సద్బుద్ధికి మనస్సులో మనసులో సంతోషం కలిగింది. **"నీవు చెప్పినట్లు కృష్ణమూర్తి చరణకమలాలను ఆశ్రయించడానికి వెళ్ళడంలో చాలా శోభున్నది. దర్శనానికి వట్టి చేతులతో ఎలా వెళ్ళటం? కానుకగా కొనిపోవటానికి మనదగ్గర ఏదైనా ఉన్నదా?"** ఆమాటలు విని ఆమె ఇంట్లో ఉన్న కాసిన అటుకులు తెచ్చి తన భర్త కట్టుకున్న చినిగిన వస్త్రానికి చోటు చూసి కొగున పోసి ముడేసింది. కుచేలుడు వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

**నేనెక్కడ? కృష్ణుడెక్కడ?:**

బయలుదేరిన కుచేలుడికి దారిలో అనేక సందేహాలు. దారిద్రంతో ఉన్నవానికి ధైర్యం సడలుతుంది. సందేహాలు కలిగి తీరుతాయి. "నేను ద్వారకానగరంలో ప్రవేశించడటం ఎలా సాధ్యం. శ్రీకృష్ణుడు ఎక్కడో అంతఃపురాలలో మహాభవనాలలో నివాసం చేస్తూ ఉంటాడు.

అతడు అందరికి ఈశ్వరుడే. అబ్బో! అతని కోసం పడికాపులుండి వేచి ఉండెవాళ్ళెందరో! అలాంటి వాణ్ణి దర్శించటం మనతరమా! తీరా అతనికోసం పడికాపులుండి వేచి ఉండేవాళ్ళెందరో! అలాంటి వాణ్ణి దర్శించటం మన తరమా! ఇట్లా పరి పరి విధాల భావిస్తూనే కుచేలుడు ద్వారకానగరంలో ప్రవేశించాడు. రాచబాటల వెంట చాలా దూరం నడిచాడు. అనేక ప్రాకారాలు దాటిపోయాడు. కొంతదూరం సాగిపోయేసరికి ఎదురుగుండా ఒక సుందర మహాభవనం కనుపించింది. అది శ్రీకృష్ణుని నివాసమని గ్రహించాడు. కుచేలుడు మనస్సుకి బ్రహ్మానందమైంది. సంతోషం పట్టలేక కన్నులవెంట ఆనందభాష్పాలు ధారలు కట్టినాయి. అది శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకరియిల్లై ఉండచ్చును. కుచేలుడు సూటిగా ప్రవేశించాడు. ఎదురుగా శ్రీకృష్ణుడు సాక్షాత్కరించాడు. కుచేలుడు దర్శనానికి మైమరచి మెచ్చుకుంటూ కొంత సమీపానికి పోయాడు. దూరం నుండి కృష్ణుడు తేరిపారజూచాడు. తన బాల్యసఖుడైన కుచేలుని క్షణాలతో పోల్చుకుని గుర్తించాడు. కుచేలుడు చినగిన వస్త్రాలతో పేలికలవుతూ ఉత్తరీయంతో వేషం, రూపం హాస్యాస్పదంగా ఉన్నాగాని కుచేలుడుని చూసిన మరుక్షణమే తొట్రుపాటుతో తన తల్పందిగి ఎంతో అపేక్షతో ఎదురుగా వచ్చి గట్టిగా కౌగిలించుకున్నాడు. ఎంత బాంధవ్యం! ఎంత ప్రేమ! ఆ కుచేలుణ్ణి సూటిగా తెచ్చి తన తల్పం మీద కూర్చుండ బెట్టాడు. ఎంతో చనువుతో, ఎంతో గౌరవంతో బంగారు చెంబులో నీళ్ళు తెచ్చి బ్రాహ్మణునికి పాదప్రక్షాళనం చేశాడు. పాదతీర్థం భక్తితో నెత్తిన చల్లుకున్నాడు. కస్తూరి, పచ్చకర్పూరం కలిపిన మంచిగంధం కుచేలుని దేహానికి పూసి గౌరవించాడు. విసనకఱ్ఱ తీసుకొని విసురుతూ నిలబడ్డాడు. ఘుమఘుమలాడే సుగంధధూపం తెచ్చి ఉపచారం చేశాడు. పరిమళం వెదజల్లుతూ ఉన్న పువ్వులు అలంకరించాడు. కర్పూర తాంబూలం చేతికిచ్చి ఒక చక్కని గోవును దూడతో సహా దానం చేశాడు.

**ఆహా! ఎంత అదృష్టం!**

మిత్రమా! స్వాగతమా! అని అదరంతో ప్రశ్నించాడు. కుచేలునికి ఒళ్ళు తెలియదు. దేహం మీద పులకరింతలు అంకురించాయి. ఆనందబాష్పాలు ధారలుగా ప్రవహించాయి. శ్రీకృష్ణుని ప్రేమాదరాలు చూరగొన్న రుక్మిణీదేవి కూడా స్వయంగా చామరం వీవన సమర్పించింది. ఆమె గాజుల శబ్దాలు ఘల్లుమని మనోహరంగా విన్పించాయి. ఆమె వీచిన వీవనతో అలసిఉన్న కుచేలుని దేహం మీద చెమట బిందువులు ఆరిపోయి దేహం శాపం శమించింది. అంతఃపుర స్త్రీలందరు నిర్ఘాంతపోయారు. శ్రీకృష్ణుడు తన సఖుని చేయిపట్టుకొని ఆపేక్షితో చనువుతో ఇలా ప్రసంగించాడు **"మన చిన్నతనంలో గురువుల యింట గడిపిన రోజులు, జరిగిన సంఘటనలు నీకు జ్ఞప్తి ఉన్నాయా? అప్పటికీ ఇప్పటికీ మనం ఒకలాగే ఉండిపోయాం. ఇల్లని, పొలాలని, ధనాలనీ, భార్యా పుత్రులని తాపత్రయం నీ మనస్సుకి కొంచెం కూడా అంటినట్లు లేదు. నేను చేస్తూ ఉన్నట్లై నీవు కూడా లోక శ్రేయస్సు కోసం నీ పనులు నిర్వరిస్తూ ఉన్నట్లు కనిపిస్తుంది. ఔనులే! నీ బోటి మహానుభావులకి కోరకలు, మోహాలు అంటవు"** అంటూ శ్రీకృష్ణుడు కుచేలునితో తన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు.

ఈ విధంగా తమ బాల్య జీవితాన్ని గురించి కృష్ణుడు చేసిన మధురమైన సంభాషణలు విని సంతోషంతో తబ్బిబ్బుగా కుచేలుడు ఇలా అన్నాడు. కృష్ణా! మనం గురువుగారి ఇంట్లో నివాసం చేస్తూ ఉన్న రోజుల్లో నీవు చేయని పనులేమున్నాయ్. ఇదంతా నీకొక క్రీడ. అంటూ ఈవిధంగా అంటాడు...

**గురుమతిఁ దలఁ పగఁ ద్రిజగ**
**ద్గురుఁడవనందగిన నీకు గురుఁవనఁగా నొం**
**దొరుఁ దెవ్వఁ డింతయును నీ**
**కరయంగ విడంబనంబయగుఁగాదె హరీ!**

**భక్తితో ఏదిచ్చినా తీసుకుంటాను :**

కుచేలుని మాటలు విని చిరునవ్వుతో కృష్ణుడు ఇలా అన్నాడు. "నీకు నా మీద ఎంతో భక్తి ఉన్నది కదా మరి ఇక్కడికని బయలుదేరే టప్పుడు నాకోసం కానుకగా ఏం పట్టుకొచ్చావు? ఏమి తెచ్చినా పరవాలేదు. కొంచెం తెచ్చినా కూడా పదివేలుగా సంతోషిస్తాను. నాయందు భక్తిలేనివాడు ఎంత విలువైన వస్తువు తెచ్చినా అంగీకరించలేను. నీ బోటి నిశ్చలమైన భక్తిగలవాళ్ళు పండుతెచ్చినా పువ్వుతెచ్చినా చాలు, తులసిదళం తెచ్చినా చాలు. ఏమీ లేకపోతే వారి చేతితో మంచి నీళ్ళిచ్చినా నేను పరమాన్నంగా భావించి స్వీకరిస్తాను".

కృష్ణుడు పలికిన పలుకుతో వినయానికి, సత్యవాక్కుకి విప్రుడు చాలా సంతోషించాడు. తెచ్చిన అటుకులు సమర్పిద్దామా అనిపించింది. ఇంతలో అంత చిన్న కానుక తెచ్చానని సిగ్గు కలిగింది. తన దారిద్ర్యం జ్ఞప్తికి వచ్చి మొగం దించుకొని, తలవంచు కొని ఏమీ మాట్లాడకుండా నిలబడ్డాడు కుచేలుడు. శ్రీ కృష్ణుడు అదేమిటి? అని ప్రశ్నించి తానే మూట పుచ్చుకున్నాడు. తన చేతితో ముడివిప్పి ఒక గుప్పెడు అటుకులు తీసి ఆరగించాడు. ఆరగిస్తూ ఇట్లా సంకల్పించాడు. **"ఇవి సకల లోకాన్ని, నన్ను కూడా తృప్తి పరచటానికి చాలు"** అనుకొని కుచేలునికి సకల సంపదలు భవనాలను ప్రసాదించాడు.

శ్రీకృష్ణ కుచేలుల స్నేహబంధం అపూర్వమైనది. తన బాల్య స్నేహితుడైన కుచేలుడు తన దర్శనానికి వస్తే శ్రీకృష్ణుడు ఆదరాభిమానాలను చూపాడు. తన భక్తుడు అయిన కుచేలుడు ప్రేమతో తెచ్చిన అటుకులను స్వీకరించి తన స్నేహితుడు కష్టాలను తొలగించాడు. దయాగుణం, నిర్మలమైన మనస్సు, రాగద్వేషాలు లేకుండా వుండటం మొదలైన సత్త్వగుణాలు ఉన్నవారికి భగవంతుడు బానిస అవుతాడు అనేది కుచేలుడు పాత్ర ద్వారా మనకు తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1) కుచేలుడు – డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య
2) శ్రీమద్భాగవతం – పోతన (మూల గ్రంథము)

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 (39) హైదరాబాద్ మే : 2024

# మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు–6

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

ఒకే తల్లిగర్భంలోనుండి, ఒకే స్థలంలో, ఒకే సమయంలో పుట్టిన ఇద్దరు పిల్లలు పుట్టారు. వారు పెరగడానికి వినియోగించుకుంటున్న పాలు, నీళ్ళు, గాలి, ఆహారం మొదలైనవన్ని ఒకటే. విద్యాబుద్ధులు నేర్పించిన వారు ఒకరే. అయినప్పటికీ వారికి భవిషత్తులో కష్టసుఖాలు, లాభనష్టాలు, జ్ఞానవిజ్ఞానాలు వేరువేరు ఉంటాయి. వారు పుట్టడం, పెరగడం ఒక్కటే అయినపుడు జీవితం మాత్రం వేరుగా ఎందుకు అవుతుంది? జీవితంలో ఈ కష్టసుఖాలను, కలిమిలేములను, మరణాలను నిర్ణయించేది ఏమిటి? అని ఆలోచిస్తే అది అర్థంకాని, అంతుచిక్కని, అయోమయమైన ప్రశ్నగా మారుతుంది. కాని వీటన్నిటిని తారుమారు చేసేది వారివారి 'కర్మ' అని పెద్దలంటారు. ఈ కర్మను గురించి ధర్మరాజు భీష్ముడిని ఇలా అడిగాడు.

ప్రశ్న : **యుద్ధంలో పట్టుబట్టి అందరిని చంపుకున్నాను. కారణం నేనేనని మనసు వేధిస్తుంది. పశ్చాత్తాపాన్ని త్రోసివేసే మార్గం చెప్పరా అని అడుగుతాడు.** (అనుశాసనిక. 1.4)

దీనికి సమాధానంగా భీష్ముడు ఒక్కవాక్యంలో 'మనిషి దేనికి కర్తకాదు' అని బోధించి, ఒక కథ చెప్పాడు. ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె పేరు గౌతమి. శాంతిస్వభావురాలు. ఆమె కొడుకు పాముకరిచి చనిపోయాడు. బాధతో ఏడుస్తుంది. ఒక వేటగాడు కరిచిన పామును తాడుతో పట్టుకుని ఆమె దగ్గరకు తీసుకువచ్చాడు. అతడు ఆమెతో అమ్మా దీని తల పగలగొడుతా లేదా కత్తితో దీనిని నరికివేస్తా. ఏం చేయాలో చెప్పండి. ఇది చాలా చెడ్డపాము అన్నాడు.

ఆమె దానిని వదిలిపెట్టండని చెప్పింది.

"ఇది మీ బాబును చంపింది. నేను దీనిని చంపుతాను" అన్నాడు.

అతని వైపు జాలిగ చూసింది. "దీనిని చంపితే నా బిడ్డ బ్రతుకుతాడా? వదిలిపెట్టు. ఆపదలు విధివశాన వస్తాయి. ఇది తెలుసుకోలేక ఆధములు పాపభారం పైన వేసుకుంటారు. చివరకు దుఃఖసముద్రంలో మునిగిపోతారు. ధర్మం తెలిసిన ఉత్తములు మాత్రం ఆ భారం మీద వేసుకోరు. ప్రశాంతంగా భవసముద్రాన్ని దాటిపోతారు" అంటుంది.

"అర్థం లేకుండా మాట్లాడుతున్నావు. కోపంతో ఉన్న నాకు నీ మాటలు నచ్చడం లేదు. నేను ఈ పామును చంపకుండా వదలను" అన్నాడు అర్జునకుడు.

"హింస నాకు నచ్చదు" అన్నది గౌతమి.

"జనులకు బాధ కలిగించే జంతువులను చంపటంలో పాపంలేద"న్నాడు వేటకాడు.



"శత్రువైనాసరే మన చేత చిక్కినపుడు చంపరాదు" అన్నది.

"నేను అంగీకరించను. పూర్వం దేవేంద్రుడు వృత్రాసురుడిని చంపలేదా? శివుడు దక్షుడి యజ్ఞాన్ని నాశనం చేయలేదా? ఈ హింసలు ధర్మమే కదా!" అన్నాడు.

"ఇదంతా వింటున్న పాము, బోయవాడితో నేనేం తప్పుచేసాను? అసలు విషయం తెలుసుకోకుండా నన్ను చంపుతా అంటున్నావు? మృత్యువు ఆజ్ఞమేరకు ఈ బాలుడిని కరిచాను. నాకు ఈ బాలునిమీద కోపం గాని, కోరిక గాని ఏమిలేవు" అని పలికింది.

"మృత్యువుకి సాధనమయ్యావు కనుక నిన్ను చంపితీరుతాను" అంటాడు వేటకాడు.

"కుమ్మరివాడు కోలను ఎట్లతిప్పితే అట్ల తిరుగుతుంది సారె. తిరిగే సారెది దోషమా? కర్రతో తిప్పిన కుమ్మరిది దోషమా? అట్లాగే నేను మృత్యువు ఎట్ల చేయిస్తే అట్ల చేస్తాను. చంపే శక్తి నాకెక్కడిది?" అంది పాము.

"వేసేవాడు విలుకాడు, బాణం ఏం చేస్తుంది? అని ఊరుకుంటారా ఎవరైనా? దాన్ని ముక్కలు చెయ్యకుండా చేతులు ముడుచుకుంటారా? ఎవరు పంపితేనేం, కాటువేసిన దానివి నువ్వుకదా! క్రూరజంతువ్వి నువ్వు. నిన్ను చంపితే పాపంరాదు. అంతేకాదు, మృత్యువుకి బుద్ధికల సాధనాలు మీరు. అందుచేత మిమ్మల్ని బతకనివ్వకూడదు. చంపెయ్యాలి" అంటాడు.

"యజ్ఞంలో బుద్ధిగల సాధనాలుగా ఉండి హవిస్సు వేలుస్తారు ఋత్వికులు. అపుడు యజ్ఞఫలం యజమానిదా? రుత్వికులదా? యజమానిదే కదా? అందువల్ల తప్పేమైనావుంటే అది మృత్యువుదే. నాదేమిలేదు" అంటుంది పాము.

అప్పుడే అక్కడ మృత్యువు ప్రత్యక్షమయ్యింది. "నిన్ను నేను పంపినట్లే నన్ను యముడు పంపాడు. కాబట్టి ఈ బాలుడి చావుకి

కారణం నువ్వూ కాదు, నేను కాదు. సూర్యుడు, చంద్రుడు, అగ్ని, నేల, ఆకాశం, నీరు, గాలి మొదలైన వస్తువుల కదలికలన్నీ కాలస్వరూపుడైన యముని చేతిలోని పనులు" అంటుంది మృత్యువు.

పాము బోయవాడి మొహంచూసి, "మృత్యువు మాటలు విన్నావు కదా! నామీద తప్పు అంటగట్టడం ధర్మమా?" అంటుంది.

బోయవాడు నవ్వి, "మీరిద్దరు పాపాత్ములు. మీరీమాటలు చెపితే నేనేమి భయపడను" అంటాడు.

"అంతా యముడిదే మాదేముంది అని పాము, మృత్యువు" అంటారు.

అంతలోనే యముడు ప్రత్యక్షమయ్యాడు.

"ఈ పసివాడి చావుకు నేనూ, పాము, మృత్యువు కారణం కాము. అతడు చేసుకున్న కర్మనే అతడి చావుకు కారణమౌతుంది."

**"విను కర్మం బొనరించును**
**జననము, మరణంబు, నదియ సౌఖ్యము, దుఃఖం**
**బును గావించుం, దనచే**
**సిన దానిం బడకపోవ శివునకు వశమే?"** (అనుశాసనిక. 1. 34) (వినుము. జీవుడు తాను చేసిన కర్మవల్లనే పుట్టుక చావులూ అనుభవిస్తాడు. అదే సుఖదుఃఖాలకూ కారణమౌతుంది. తాను చేసిన కర్మను తప్పించుకోవటం శివుడికి కూడా సాధ్యం కాదు) కాబట్టి మీరంత ఈ చర్చను ఆపేయండి అంటాడు.

అదంత విన్న గౌతమి, బోయవాడితో ''పుత్రశోకం అనుభవించవలసినంతటి పాపం చేసుకున్న నాలాంటి వారికి ఇట్లాగే జరుగుతుంది. పిల్లల కర్మానుసారంగా వారికి ఇట్లాంటి చావు వస్తుంది. **"సకల జనంబులు గర్మమునకు ననుగుణమైన తెరువునంబోదురు..."** (అనుశాసనిక. 1.39) కావున ఏడ్వడం, కోపపడడం రెండూ వద్దు. శాంతి పొంది పామును వదిలిపెట్టు అంటుంది.

ఇదంతా విన్న తరువాత జ్ఞానోదయమైన కిరాతుడు పామును వదిలిపెట్టాడు. మృత్యువూ, కాలుడూ సంతోషంతో వెళ్లిపోయారు. కాబట్టి ధర్మరాజా! నీవు దుఃఖాన్ని విడిచిపెట్టు. యుద్ధంలో చుట్టాలంతా మరణించటానికి కారణం వారి కర్మలే. నీవు కానీ, ధుర్యోధనుడు కానీ కారణం కారు అంటాడు భీష్ముడు.

ఇంతటి మహత్తరమైన కర్మ అర్థాలు, రకాలు, ఆలోచనల గురించి చూసినపుడు... కర్మ అనే పదం 'కృ' అనే ధాతువునుంచి పుట్టింది. కర్మ అనే పదానికి నిఘంటు పరంగా 'చేయుట' (ఆంధ్రవాచస్పత్యము. ప్ర.సంపు.పుట.304). 'పని, కార్యము' (శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు.రెం.సంపు.పుట.134) అనే అర్థాలు తెలుస్తున్నాయి. ఈ పదం ఆధ్యాత్మికంగా పూర్వకర్మల ఫలితమని అర్థమౌతుంది. "ఏక ద్రవ్యమగుణం సంయోగవిభాగేష్వనపేక్ష కారణమ్ ఇతి కర్మ లక్షణమ్..." (సత్యార్థ ప్రకాశము.పు.52) ఒక ద్రవ్యమునాశ్రయించి యుండి, గుణములు లేనిదై సంయోగ విభాగములను కలిగించడంలో నపేక్షారహిత కారణము క్రియ 'కర్మ'మనబడుతుందని పై వాక్యార్థం.

సహజంగా కూడా సర్వ వ్యాపారాలు కర్మలే అని తెలుస్తుంది. ఈ విషయాన్ని భగవద్గీతలో –

**"న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః ॥"** (భగవద్గీత. 3..5)

ప్రకృతి గుణాలతో కూడిన ప్రతి ఒకరు కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరని పై శ్లోకం తెలుపుతుంది. బలవంతంగా కర్మలు మానినట్లయితే తన ఉనికిని ఆత్మరూపస్థితిని తెలుసుకోలేక పోతారనే విషయాన్ని **"న కర్మణా మనారమ్భాన్నైష్కర్మ్యం పురుషోశ్నుతే..."** (భగవద్గీత. 3.4) అనే ఈ శ్లోక పాదం వ్యక్తపరుస్తుంది. ఈ వాక్యాల ఆధారంగా మనుషులు ప్రకృతిలో ఉండి, ప్రకృతితో మమేకమై, ప్రకృతిని ఆస్వాదిస్తూ కర్మచేస్తూనే ఉంటారు.

కర్మచేయడానికి మార్గాలు మూడు రకాలు. అవి మనసు, వాక్కు, కాయము. కాళ్లు, చేతులు, ముక్కు, కన్ను, చెవి మొదలగు శరీరావయవాలతో చేసే పనులు కాయిక కర్మలు. వాక్ (మాటలు)తో చేసేవి వాచిక కర్మలు. మనసుతో అనుభవించు వికారాలన్నీ మానసిక కర్మలు. కాబట్టి మానవుని శరీరంలో ఏ భాగం కొంత పనిచేసిన అది కర్మగానే భావించాలి. అందువల్ల కర్మచేయని వారుండరు.

సంచిత, ఆగామి, ప్రారబ్ధం అనే మరో మూడు రకాల కర్మలుంటాయి.

ఈ కర్మలను మరో రెండు రకాలుగా చెప్తుంటారు. అవి లౌకిక కర్మలు, వైదిక కర్మలని. లౌకిక కర్మలనేవి జీవనోపాధి కోసం చేసే వ్యాపారాది పనులు. వైదిక కర్మలనేవి వారు ఏర్పాటు చేసుకున్న మతం, కులం ఆధారంగా చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాలు.

వీటితో పాటు మరో రెండు రకాల కర్మలుగా చూడవచ్చు. అవి ఫలాపేక్ష కర్మలు, నిష్కామ కర్మలు. ఫలాన్ని ఆశించి చేసేవి కొన్నైతే ఫలాన్ని ఆశించకుండా చేసేవి మరికొన్ని.

ఈ కర్మలను గురించి భారతంలో ఇంచుమించు సందర్భాను గుణంగా ఐదు అర్థాలలో వాడినట్లు కనిపిస్తుంది. 1. పని, కార్యము (విరా.4.122), 2. పుణ్య పాపకర్మము, సంచితము (భీష్మ.2.353), 3. లౌకిక వైదిక క్రియానుష్ఠానము నిత్య నైమిత్తికాది (శాంతి. 1.149), 4. విధ్యుక్త ధర్మము, కులాచారము (శాంతి. 1.279), 5. పాపము (1.304) వంటివి.

కర్మను గురించి శ్రీభాష్యం విజయసారథి **"పదార్థ గతికి కర్మయని పేరు. భిన్నము ద్రవ్యసమవేతమై సంయోగవిభాగ కారణమైనది కర్మ"** యనబడును. **'ఏకద్రవ్యమగుణం సంయోగ విభాగేష్వనపేక్షా కారణమితి కర్మ లక్షణమ్'** అని వైశేషిక దర్శనం తెలుపుచున్నది.

ఉత్క్షేపణ, అవక్షేపణ, ఆకుంచన, ప్రసారణ, గమన భేదమున కర్మ ఐదు విధముల (న్యాయ వైశేషికములు సాంఖ్యయోగములు.పు.48) ఉంటుందని నిర్ధారించారు. కర్మలో గల భేదాల జోలికి పోకుండా అన్నిటికి కర్మనే కారణమని నిశ్చయించుకోవచ్చు.

భాగవతంలో కర్మను గురించి

**"కర్మమున బుట్టు జంతువు**
**కర్మముననను వృద్ధిపొందు కర్మమున జెడున్**
**కర్మమె జనులకు దేవత**
**కర్మమె సుఖదుఃఖములకు కారణ మధిపా."**

(భాగవతం. 10.884)

పుట్టుకకు, వృద్ధిపొందుటకు, చెడుటకు సుఖదుఃఖాలకు కర్మనే కారణం అంటుంది. అంతటితో వదిలివేయకుండా జనులకు కర్మనే దేవత అని తెలుపుతుంది. భీష్ముడు సమాధానం కోసం చెప్పిన కథలో సారం కూడా ఇదే. ఈ కథ ఆపద కోణాన్నే ఆవిష్కరించింది. కాని సుఖకరమైన, సంతోషకరమైన విషయాలు కూడా కొన్ని సార్లు మన ప్రమేయం లేకుండానే మనకు అందుతాయి. వాటి వెనక కారణం కూడా తాను చేసుకున్న కర్మని భావించవచ్చు. ఈ కథలో ఇచ్చిన కుమ్మరి చేతికర్ర ఉదాహరణ చాలా గొప్పగా ఉంది. కుమ్మరివాని చేతిలో ఉన్న కట్టెను నిందిస్తూ కూర్చోకూడదు. అది ఎవరి చేతిలో ఉందో వారిని గురించి ఆలోచన చేయాలి. వారిదగ్గర మనకు సంబంధించిన ఒక లెక్క ఉంటుంది. నీవుచేసిన పనుల వల్ల లెక్కల మార్పులు జరుగుతాయి. అదే కర్మ. ఇంతటి తాత్వికమైన కర్మను సులభమైన కథరూపంలో తెలియజేసిన తీరు అభినందనీయం.

❖ ❖ ❖ ❖ ❖

ధర్మరాజు భీష్ముడిని కర్మకు సంబంధించిన మరో ప్రశ్న "సంకల్పయోగాన్ని బట్టి కర్మలు శుభాన్ని, అశుభాన్ని కలిగిస్తాయి. వాటికి కర్త పురుషుడా, కాదా" (శాంతి. 4.369) అని అడిగాడు.

ఈ ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు **'ఇంద్ర ప్రహ్లాద సంవాదం'** తెలియ జేసాడు.

ప్రహ్లాదుడు సత్వగుణసంపన్నుడు. ఇంద్రియాలు గెలిచినవాడు. అహంకారం, సంతోషం, క్రోధం లేనివాడు. అతనికి నిందా, స్తుతీ రెండూ సమానం. మన్ను, బంగారం రెండూ కూడా ఒకటే. అతని ధ్యానం విష్ణుపాదాల వ్రతం. అట్లాంటి ప్రహ్లాదుడిని పరీక్షించడం కోసం ఒకసారి దేవేంద్రుడు వెళ్ళి..

**"సంపద లేమికి మది శో**
**కింపవు; శత్రువుల చేతికిని లోనగు టూ**
**హింపవు; నీ కుమారునికి**
**పెంపని పాటించె; దిట్టి బేలవు గదవే !"** (శాంతి. 4.370)

సంపదలు లేవని దుఃఖించవు. శత్రువుల చేతిలో లొంగిపోతానని ఆలోచించవు. ఉపేక్షాభావంతో ఊరక ఉండటమే నీకు మేలని గ్రహిస్తావు. ఇంతటి బేలవా? అంటాడు. దానికి సమాధానంగా ప్రహ్లాదుడు దేనికైన తాను కర్తను అనుకోవడం అజ్ఞానం. ఏ లాభం ఆశించకుండా అన్ని పనులు చేస్తున్నదంతా విధాతే కాబట్టి అతడే కర్త. నరుడు కానేరడు అంటాడు. మన ప్రయత్నం వల్లనే కలిమిలేములు సిద్ధిస్తాయి అనుకోవడానికి వీలులేదు. అంతేకాదు **"తేరక యుండఁగఁ జేరుందేరంగాఁ బొలియు విధి యధీనంబులుగా కారయ విత్తంబులు పురుషారంభాయత్తములె?..."** (శాంతి. 4.373) మానవ ప్రయత్నం మాత్రమే సంపద సాధన ఆధారం కావు అవన్నీ విధి అధీనంలో ఉన్నాయనే విషయాలను తెలియజేస్తాడు. శత్రుమిత్రులు, కష్టసుఖాలు కూడా మనకు తెలియకుండా, కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా సంభవిస్తాయి. కాబట్టి విధి చేసే కర్మలను ఉపేక్షాభావంతో ఊరకనే చూస్తూ ఉండాలి. మానవుడు చేయవల్సిందల్లా సుఖాన్ని, దుఃఖాన్ని సమానంగా స్వీకరించగల ఉపాయం నేర్చుకోవాలి. నరుడు దాంతి, శాంతి, ప్రజ్ఞ కలిగినవాడై నపుడు అతడి చిత్తం ఏ విధంగానూ ఆయాసంతో అలసిపోదు అనే విషయాలను ప్రహ్లాదుడు ఇంద్రునికి చెప్తాడు. ప్రహ్లాదుడు కూడా అలాంటివాడనే విషయాన్ని తెలియజేస్తాడు. అప్పుడు ఇంద్రుడు **"యే యనువున నీశాంతి నీకు నగపడియె మహా జనపూజ్య! చెప్పవే?.."** అని అడుగుతాడు. ప్రహ్లాదుడు ఇంద్రుడితో...

**"ఆర్జవంబు ప్రసన్నత యాత్మవత్త్వ**
**మప్రమాదంబు వృద్ధసేవాభినిరతి**
**మేలుసేయుఁ బ్రజ్ఞాశాంతిశాలి యగుట**
**కాలపాకంబుతోఁ దాన కలుగు ననఘ!"** (శాంతి. 4.383)

నిష్కపటమైన ప్రవృత్తి దయాగుణం, తాను శరీరంగాదు – ఆత్మను అనే భావం పరాకులేకుండా జాగరూకతతో వ్యవహరించడం, పెద్దల పరిచర్యలలో నిజమైన ఆసక్తి – ఈ సద్గుణాలు నరుడికి శుభాన్ని కలిగిస్తాయి. ఇక జ్ఞాన, శాంతి అనేవి, కాలపరిపాకంతో క్రమంగా తమంత తామే నరుడిలో చోటుచేసికొంటాయి అనే విషయాలు ప్రహ్లాదుడు ఎరుక పరిచినట్లు పై పద్యభావం ఆధారంగా తెలుస్తుంది.

ఈ కర్మ విషయం 'మను బృహస్పతి సంవాదం'లో...

**"...అనిష్టంబు ద్రోవను నిష్టంబు దేరను**
**నరుఁడు కర్మాచరణం బొనర్చు**
**నెయ్యవి సుఖము లొక్కింత కాలమునకు**
**నవియు దుఃఖంబులై యావహిల్లు;**
**నింత యెఱిఁగి ఫలమునెడ నిరపేక్షుఁడౌ**
**నతడు సౌఖ్యదుఃఖ యమముఁద్రోచి**
**కామముఖ్య విపదకంపిత జ్ఞాన వి**
**శేషబుద్ధిఁ బరమసిద్ధి బొందు."** (శాంతి. 4.172)

పై పద్యంద్వారా అనిష్టాన్ని తొలగించుకోవడానికి, ఇష్టాన్ని అందుకోవడానికి మానవుడు కర్మ చేస్తాడు. ఏవి సుఖాలుగా అందుతాయో, అవే అనంతరకాలాల్లో దుఃఖాలుగా పరిణమిస్తాయి. ఈ మాత్రం తెలిసికొని ఏ నరుడు తాను చేసే కర్మను ఫలం ఆశించకుండా తన విధిగా మాత్రమే చేస్తాడో అతడు సుఖదుఃఖ ద్వంద్వాన్ని త్రోసేసి కామక్రోధాది అరిషడ్వర్గాలనుంచి వాటిల్లే విపత్తులనుంచి చెదరని గొప్ప జ్ఞానంద్వారా గొప్ప సిద్ధిని ముక్తిని పొందుతాడని తెలుపుతుంది. కర్మ విషయంలో చాలా మంది బుద్ధిమంతులు కూడా కర్మ, అకర్మల వాస్తవిక రహస్యాన్ని గుర్తించడంలో పొరపాటు పడుతారు. ఈ విషయాన్ని భగవద్గీత (4.16) కూడా తెలుపుతుంది. ఈ కారణం చేతనే కర్మ రహస్యంలో అనభిజ్ఞులైన జ్ఞానాభిమానులు బ్రహ్మజ్ఞానం ద్వారా కర్మను ప్రతిబంధకంగా తలుస్తారు. అందువల్ల వారు వారివారి వర్ణాశ్రమోచితంగా చేయాల్సిన కర్తవ్య కర్మలను త్యజిస్తారు. కాని ఈ విధమైన త్యాగం వల్ల వారికి యథార్థఫలమైన కర్మబంధన విముక్తి కలుగదు. ఈ విషయాన్ని కూడా భగవద్గీత (18.8) తెలుపుతుంది. అందుకే చాలా మంది కర్మను భారంగా భావించి ఇచ్చానుసారంగా కర్మాచరణలో ప్రవర్తిస్తున్నారు. కాబట్టి జ్ఞాన, కర్మల రహస్యాలను ఏకకాలంలో వెంట వెంట తెలుసుకొని వాటిని సరైన పద్ధతిలో ఆచరించి ఈ రెండింటి అనర్థాలనుంచి రక్షించుకోవాలి.

**ఆధార గ్రంథాలు** :

1. అప్పలస్వామి, పురిపండా. '**వ్యావహారికాంధ్ర మహాభారతం**' (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.

2. నిర్వికల్పానంద, '**శ్రీమద్భగవద్గీత**' (పదచ్ఛేద టీకాతాత్పర్య సహితం). 2010. హైదరాబాద్ : రామకృష్ణమఠం.

3. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. '**శ్రీమహాభారతము**' (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.

4. లక్ష్మీనారాయణ, గంగిసెట్టి. '**భీష్ముడు చెప్పిన రాజనీతి కథలు**' 1986. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

5. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. '**మహాభారత వైజయంతి**' (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

6. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. '**కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము**' (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.

7. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. '**మహాభారత విమర్శనము**' (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**
**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం '**కదంబం**'.
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆధునిక తెలుగు సాహిత్యం – మానవతా విలువలు

**ఎం. అనంత లక్ష్మి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, సెయింట్ జోసెఫ్ కళాశాల, హైదరాబాద్. ఫోన్ : 8978432973

“హితేన సహితం సాహిత్యం” అని అన్నారు. అంటే హితాన్ని తెలియజేసేది, మేలు చేకూర్చేది సాహిత్యంగా చెప్పబడుతుంది. ఎవరికి, దేనికి హితం అనేది మాత్రం ఆయా కాలాన్ని, సంస్కృతిని, సమాజంలో మార్పులను బట్టి ఉంటుంది. ఏదైతేనేమి సమాజానికి, మానవులకు హితాన్ని చేకూర్చేదే సాహిత్యంగా, అదే ఉత్తమ సాహిత్యంగా భావించవచ్చు. **“విశ్వ శ్రేయః కావ్యమ్”** అని ఆంధ్ర శబ్ద చింతామణిలో నన్నయ్య గారు తెలిపారు. మన తెలుగు సాహిత్య భారతానువాదంలో ఆద్యంతము మానవతా విలువలను తెలుపుతూ ముందుకు సాగిందని చెప్పవచ్చు. దీనిని బట్టి సాహిత్యం మనకు మేలును కలిగిస్తూ సామాజిక, మానవతా విలువలను తెలియజేస్తూ తద్వారా ప్రపంచ శాంతిని, శ్రేయస్సును కలిగిస్తుందని చెప్పవచ్చు. ఉత్తమ సాహిత్యం మన సంస్కృతి,నాగరికతలను తరువాత తరాల వారికి అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. “సమాజ హితస్య సాహిత్యం” అంటే సమాజం మేలుని కోరేది సాహిత్యం. సమాజానికి, సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉందని, సాహిత్యం అనేది సమాజానికి అద్దం పడుతుందని భావించ వచ్చు. పాఠకులు సాహిత్యం ద్వారా వివిధ రకాల అనుభూతులను, మానసిక ఆనందాన్ని పొందుతారు. సమాజం పట్ల సాహిత్యం వహించే పాత్ర అత్యంత ముఖ్యమైనది. అలాగే సాహిత్యం కూడా సమాజంపై ఆధారపడుతుంది. కవులు, రచయితలు సమాజంలోని వ్యక్తులే కాబట్టి ఉత్తమ రచయితలు బాధ్యతాయుతంగా సామాజిక సమస్యలపై దృష్టి సారిస్తూ రచనలు చేయడం మంచిదని భావించాలి. మానవతా విలువలు పరిరక్షణకు సరైన సాధనం సాహిత్యం మాత్రమే. నాటి నుండి నేటి వరకు కూడా అనేకమంది కవులు మానవతా విలువలు జోడించి తమ రచనలను కొనసాగిస్తున్నారు. వారు సమాజ శ్రేయస్సును కోరారు. రచయితల్లో కూడా మానవతా దృక్పథం ఉన్న వాళ్ళు, లేని వాళ్ళు ఉంటారు. ఉత్తమ సాహిత్యం ఎల్లప్పుడూ మానవులు, వాళ్ళ సమస్యలు, సంఘర్షణలను వెలికి తీసి చూపెడుతుంది. **“మానవుడు తనను తాను తెలుసుకొని, ఆత్మవిశ్వాసం పెంచుకొని, సత్యం కోసం, న్యాయం కోసం పోరాడేలా చేసి, మానవుడిలోని నైచ్యతను నిర్మూలింప చేయటానికి ఉత్తమ గుణాల్ని ఉత్తేజితం చేస్తూ అధర్మం మీద క్రోధం, దౌర్జన్యానికి సిగ్గుపడటం, న్యాయ రక్షణకు ధైర్యం, సౌందర్యం పట్ల ప్రేమ పెంచగలిగేదే ఉత్తమ సాహిత్యం”** అని మాక్సిమ్ గోర్కీ అన్నారు. సంఘర్షణాభరితమైన సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో, రచయితల, కవుల, కళాకారుల పాత్ర ఎంతైనా ఉంది. వీరు ఎల్లప్పుడూ సమాజాన్ని పరిశీలిస్తూ తమ కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటూ, విలువలను కాపాడుకుంటూ తద్వారా నవ సమాజ నిర్మాతలుగా మారతారు. తమ భావాలను వ్యక్తపరచడానికి వారు సాహిత్య రచనను ఎన్నుకుంటారు. అదే సరైనది. తగినది కూడా. ఉత్తమ సాహిత్యం ద్వారా మానవత్వకాంక్ష, సమతా భావన పెంపొందించబడుతుంది. అలాగే మానవుని ఆలోచన శక్తిని పెంచి, సంస్కారాన్ని, మానసిక పరివర్తనను కలిగిస్తుంది. మానవతా విలువల్ని గ్రహించేలా చేసి సన్మార్గంలో జీవించేలా చేస్తుంది. వేమన లాంటి శతక కవులు ఎందరో సమాజంలో ఉండే లోటుపాట్లని ఎత్తి చూపించి కనువిప్పు చేశారు.

“లోకాః సమస్తాః సుఖినోభవంతు”, ప్రపంచంలో అన్ని జీవులు సంతోషంగా ఉండాలని ఈ శాంతి మంత్రం అర్థం. నేడు మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయి. ఎవరికి వారు వారి స్వార్థం కోసం జీవిస్తూ దూరం అవుతున్న సమయంలో ఇవే సమకాలీన అంశాలుగా స్వీకరించి అందమైన కవితలలో కవులు సాహిత్య సేవను అందిస్తున్నారు. రాను రాను సాంకేతికత పెరగడం వల్ల మనుషులు కూడా యంత్రాల మాదిరిగా మారిపోతున్నారు. నైతిక విలువలకు, మానవ సంబంధాలకు దూరమవుతున్నారు. శారీరిక శ్రమ కూడా తగ్గిపోతుంది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు కొన్ని వృద్ధి చెందడం వల్ల కొన్నిటిని కోల్పోవాల్సి వస్తుంది. మనుషులలో కనీసం ఉండవలసిన మానవత్వం కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. స్వార్థం పెరిగిపోతుంది. ఇది గమనించిన మన తెలుగు కవులు నాటి నుండి నేటి వరకు ఆ అంశాలనే దృష్టిలో పెట్టుకుని తమ రచనలలో ప్రతిబింబింప చేశారు. కాకపోతే అలాంటి కవులు చాలా అరుదుగా ఉన్నారు. నేటి కాలంలో వారి సంఖ్య ఇంకా తగ్గిపోతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. సమాజానికి, సాహిత్యానికి ఏమైనా మేలు చేయాలి అని తపన పడేవారు చాలా అరుదుగా ఉన్నారు. స్వలాభం, కీర్తి ప్రతిష్టలకు ప్రాకులాడకుండా తమ రచనల ద్వారా సామాజిక అభివృద్ధికి తోడ్పడితే ఎంతో బాగుంటుంది. మన ఆధునిక తెలుగు సాహిత్యంలో కొందరు కవుల గురించి తెలుసుకుందాము.

నవయుగ వైతాళికుడు ఆధునికాంధ్ర సాహిత్య యుగకర్త అయిన గురజాడ అప్పారావుగారు తన భావుకతకు సామాజిక దృక్పథాన్ని చేర్చి జాతిని జాగృతపరిచారు.

**‘సొంత లాభం కొంత మానుకు**
**పొరుగు వారికి తోడుపడవోయ్’**

**‘దేశమంటే మట్టి కాదోయ్**
**దేశమంటే మనుషులోయ్’**

**'మతం వేరైతేను యేమోయ్?**
**మనసులోకటై మనుషులుంటే'**

అని తన 'దేశభక్తి గేయం' ద్వారా సామాజిక దృష్టిని, సమతా భావనను తెలియజేశాడు..

ఈ సృష్టిలో మానవత్వాన్ని మించిన కులం,మతం లేదంటూ ..

**'మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును'**
**'మంచి చెడ్డలు మనుజులందున**
**యెంచి చూడగా రెండె కులములు**
**మంచియన్నది మాలయైతే**
**మాలనే అగుదున్'**

అని వర్ణవ్యవస్థను నిరసించాడు.కన్యాశుల్కం నాటకంలో మధురవాణి గిరీశంతో **'సానిదానికి నీతి ఉండదా ఏమిటి?'** అని పలుకుతుంది. అంటే మానవత్వం అనేది ఏ కులానికో, మతానికో, జాతికో పరిమితం కాదు.అని గురజాడ వారు మధురవాణి ద్వారా పలికించారు.

**'మనిషి చేసిన రాయిరప్పకి**
**మహిమ కలదని సాగి మొక్కుతు**
**మనుషులంటే రాయిరప్పల కన్న కనిష్టం**
**గాను చూస్తావేల బేలా'**

గురజాడ నాస్తికుడు కాదు. గొప్ప మానవతావాది. దేవుడున్నాడు కానీ మనిషి కన్నా అతీతుడుకాడని, మనిషే దేవుడని 'మనిషి' అనే చిన్నగేయం ద్వారా ప్రబోధించాడు.మంచితనమే దైవమని,మంచిని ప్రేమించడం దైవారాధన అని భావించాడు. గురజాడ గొప్ప తత్వవేత్త, కాంత దర్శి. అందుకే శ్రీశ్రీ గారు గురజాడని గురించి ఇలా అన్నారు

**"అడుగుజాడ గురజాడ**
**అది భావికి బాట"**–శ్రీ శ్రీ( సిప్రాలి)

ఏదేమైనా మానవత్వపు పునాదులపైనే మన సమాజభవిత నిర్మించబడుతుంది.

గురజాడ రాసిన 'మనిషిగేయానికి రవీంద్రుని గీతాంజలి రచనకి దగ్గర సంబంధం ఉందని చాలామంది అభిప్రాయపడతారు. కానీ వారు ఒకరికొకరు తెలియకుండానే ఆ రచనలు రాశారని కొందరు భావిస్తారు. గురజాడ, రవీంద్రనాథ్ ఠాగూర్ ఇద్దరూ ఒకే సంవత్సరంలో జన్మించారు. ఇద్దరూ ప్రకృతి ప్రియులు, మానవతా వాదులు. ఇద్దరిని మానవతోద్యమం బాగా ఆకర్షించింది. గురజాడ అప్పుడప్పుడు రవీంద్రున్నికలుస్తూ ఉండేవారు. రవీంద్రుని 'దిక్కులేని దీనురాలు' కథ హృదయ విధారకమైన కథ. ఈ కథ చదువుతూ ఉంటే ఎంతటి కఠిన హృదయం కలిగిన వారి మనసునైనా ద్రవింప చేసి స్పందించేలా చేస్తుంది.. ఇలా వీరు ఇరువురి రచనలలో అనేకం సామాజిక మానవతా దృక్పథంతో కూడినవి ఉన్నాయి.

జాషువా గారు సమాజంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను, అవమానాలను, అంటరానితనాన్ని ప్రశ్నిస్తూ వాటిని వ్యతిరేకిస్తూ కవిత్వం రాశారు. జాషువా రాసిన 'గబ్బిలం' కావ్యం అద్భుతమైన సందేశాత్మక కావ్యంగా నేటికీ ప్రశంసించబడుతుంది. ఇది కల్పిత కావ్యమైనప్పటికీ వాస్తవానికి దగ్గరనిపిస్తుంది. సాహిత్యం అనేది ప్రజలకు ఆనందాన్ని,చైతన్యాన్ని కూడా కలిగించగలగాలి.బాల్యం నుండి అట్టడుగు వర్గాలపై చూపే నిరాధారణ, అస్పృశ్యతను జాషువా సొంతంగా అనుభవించడం వల్ల తన మనసులో చెరగని ముద్రపడింది.కాబట్టే తన రచనల్లో వాటిని దుయ్యబట్టాడు. అందరికీ తెలిసేలా చేసి, ఆలోచింపజేశాడు. జాషువా 'గబ్బిలం' కావ్యం ద్వారా సమాజంలోని అసమానతలు తెలిపి మానవతావిలువలను పెంపొందింపజేశాడు.

**'వాని రెక్కల కష్టంబు లేనినాడు**
**సస్యరమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు**
**భోజనము బెట్టు వానికి భుక్తి లేదు'**

అంటూ తన 'గబ్బిలం' కావ్యం లో కష్టపడి శ్రమించి భోజనం పెడుతున్న శ్రామికులకు మాత్రం తినడానికి తిండి లేదని వాపోయాడు.

**'నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు**
**ధర్మశీలురున్న ధరణి మీద ...'** –జాషువా( గబ్బిలం)

జాషువా 'కొత్త లోకం' కావ్యంలో జాతిని జాగ్రత్తపరిచాడు. సమాజాన్ని ఒక కొత్త లోకం వైపు నడిపించాడు. రాజుకి కవికి మధ్యగల భేదాన్ని తెలియజేశాడు. ఇందులో కవికి గల ప్రాధాన్యతను అలాగే కవి బాధ్యతలను తెలియజెప్పాడు. **"సుకవి జీవించు ప్రజల నాలుకల యందు"** అంటూ ఉత్తమ కవులను ప్రజలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారని తెలిపాడు. అందుకే సుకవి అయిన జాషువాను ఇప్పటికీ మనం తలుచుకుంటూనే ఉంటాము.

పీడిత ప్రజల పక్షాన నిలబడి శ్రామిక లోకపు సౌభాగ్యానికి, కార్మికలోకపు కల్యాణానికి మానవతా హృదయంతో తన కవిత్వాన్ని ధారబోసిన గొప్ప అభ్యుదయకవి శ్రీశ్రీ. మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి, మరో ప్రస్థానం లాంటి రచనల ద్వారా ప్రజాపోరాట కవిగా ప్రసిద్ధికెక్కారు. శ్రీశ్రీ తన రచనల ద్వారా సమాజాన్ని, యువతను అభ్యుదయం వైపు నడిపించారు. శ్రీశ్రీ తన కవిత్వం ద్వారా సమాజంలోని మలినాలను కడిగేయదలుచుకున్నాడు. శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో జయభేరి కవితలో ...

**"నేను సైతం / ప్రపంచాగ్నికి**
**సమిధనొక్కటి ఆహుతిచ్చాను"**

ఈ కవితలో 'నేను సైతం'అనే మాటలు పునరుక్తి కావడంతో పాఠకునిలో భావావేశం కలుగుతుంది. ఇందులో 'నేను' అనే పదం వైయక్తికం కాదని, సామాజికత కలిగిన పదమని తెలుస్తుంది. అందుకే శ్రీశ్రీని ఒక సామూహిక చైతన్యానికి ప్రతీకగా చెబుతూ ఉంటారు. ఇక్కడ సమిధ,ఆహుతి అనే పదాలకు అర్థం స్వార్థం లేకుండా తనను తాను సమర్పించుకోవడంగా భావించాలి. శ్రీశ్రీకి మనిషి మీద మానవత్వం మీద ఎంతో నమ్మకం అందుకే ఆయన 'ఉగాది' కవితలో ఇలా అన్నారు.

**'అణుశక్తి మీద అధికారం / మానవ శక్తిదే**
**అందుకే మానవత్వాన్ని మించిన / మతం నాకు లేదు**
**మానవ శక్తినే విశ్వసిస్తాను'.**

శ్రీశ్రీ ఆణిముత్యాలు లాంటి పాటలెన్నో రాశారు. ఆయన రాసిన **"తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా"** అనే పాటకు జాతీయ ఉత్తమ గేయ రచయితగా అవార్డును పొందాడు. శ్రీశ్రీని ఒక వ్యక్తిగా కాక ఒక శక్తిగా భావిస్తారు.

పైన తెలిపిన కవులే కాకుండా సి.నారాయణరెడ్డి గారు, కాళోజీ, కుందుర్తి మొదలైన అనేకమంది కవులు ఎన్నో గొప్ప రచనలు చేశారు. నేను మచ్చుకకు కొందరిని గురించి మాత్రమే తెలిపాను.

**ముగింపు :** బాల్య దశ నుండే చిన్నారులకు నీతి కథలు బోధించాలి మహనీయుల జీవిత చరిత్రలను చదివేలా ప్రోత్సహించాలి. భగవద్గీతను చదివింప చేయాలి. గొప్ప వీరుల త్యాగాలను, సాహసాలను వారు తెలుసుకునేలా చేయాలి. వారిలో దేశభక్తిని పెంపొందింప చేయాలి. సమాజంలో వాళ్లు ఏ విధంగా మెలగాలో తెలియజెప్పాలి. ఈ విధంగా వారిలో నైతిక, సామాజిక, మానవ విలువలు పెంపొందించబడతాయి.

**ఆధార గ్రంథాలు:**

1) కళారవీ! కవీ! –డా. వి. వీరాచారి, ప్రజాహిత ప్రచురణలు, వరంగల్. (2011)

2) మహాకవి శ్రీశ్రీ భారతీయ సాహిత్య నిర్మాతలు– బూదరాజు రాధాకృష్ణ – సాహిత్య అకాడమీ (1999)

3) సాహితీమూర్తులు–స్ఫూర్తులు– డా. దార్ల వెంకటేశ్వరరావు, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ప్రచురణ, హైదరాబాద్. (2015)

4) http://hdl.handle.net/10603/6456

5) http://hdl.handle.net/10603/377993

6) http://jwalasmusings. blogspot.com/2009/12/blog-post_8816.html

❖ ❖ ❖ ❖ ❖

# మలినం కానంత కాలం..

అడవి అమ్మలగన్న అమ్మలా ఉన్నప్పుడు
నీడలు కాపాడేవి భూమిని
ఊటలు ఉవ్విళ్లూరి వాగులయ్యేవి
పండ్లు, ఫలాలు, దుంపలు, కాయలు ఆదుకునేవి జీవులను
గాలి ప్రాణవాయువై పంచేది ఆరోగ్యాలను
గాలి వేళ్లకు మలినం ఉంగరాలు ధరించగానే
మెడలో కాలుష్య హారాలు వేసుకోగానే
మొదలయ్యాయి పిచ్చెక్కినట్లు ప్రవర్తనలు

సూర్య రశ్మి కన్నతండ్రి లాగున్నప్పుడు
పంటలు వెలుతురు వేలు పట్టుకొని నడిచేవి
మలినాల వ్యాధి తగులగానే
వెలుతురుకు అమ్మోరు సోకినట్లు బొబ్బలు
నాలుక లెండిపోయిన దాహంతో భూమి
ఉక్కపోత ఊర్లోకి వచ్చి వేసింది తిష్ట

మట్టి తల్లి ప్రేమలు పంచినంత కాలం
మట్టి నానితే ఉండేది పెరుగన్నంలా
ప్రతి విత్తును చేసేది చల్లని చెట్టులా
మట్టిలో పొర్లి వచ్చినా
ఆరోగ్యాలు అమృతం తాగినట్లుండేవి
ఒల్లంతహూనం చేసినట్లు రంధ్రాలు పొడిచి
కాలుష్య పరిశ్రమలు పంపారు భూమిలోకి
ఇప్పుడు మట్టంటితే మలినాలంటిన భయం

వేలెత్తి ఎటువైపు చూపినా
మనసులు మలినాలు కానంత కాలం
సోదరులకు సోదరి రాఖీ కట్టినట్లుండేది
మమతలు వేలువిడిచిన మేనమామలయ్యేవి
ఎవరినైనా పలకరిస్తే ఆత్మీయత ఆదుకునేది
ఆలింగనం చేసుకుంటే ఆత్మలు ఒక్కటయ్యేవి
చేతులు కలిపితే ఊబిలోంచి పైకి లాగే చేయూత

**కొమరవెల్లి అంజయ్య**
సిద్ధి పేట, ఫోన్ : 98480 05676

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 హైదరాబాద్ మే : 2024




నివాళి

# కె.కె. వెంకటశర్మకు

డా. ఒజ్జల శరత్ బాబు, ఫోన్ : 99635 33937

సున్నితమైన మనసు, అందరితో తలలో నాలుకలాగా మెలగడం, బోధనలో నూతనత్వం శోధించడం, భాషా సాహిత్య సేవలకై తపించడం, ప్రత్యేకించి ద్వితీయ భాష తెలుగు విద్యార్థులకై పరితపించుట, గణిత, భౌతిక, రసాయన, సాంకేతిక శాస్త్రాలు, తెలుగు భాషా సాహిత్యాలపై పట్టు, బాధ్యత నిర్వహణలో మేటి, మొదలైన అనేక సుగుణాల కలయికనే కోవెల్ కందాడై కళ్యాణ వెంకట శర్మ. పరోపకారి. తోటి ఉపాధ్యాయులకు శాస్త్ర సాంకేతిక విషయాలను తెలుగు బోధనకు అనుసంధానించే విధానాన్ని ప్రత్యేక సమయాన్ని కేటాయించుకుని అందించినవాడు. వివిధ పత్రికలలో భాషా వ్యాసాలను అందించినవాడు.

**'మూసీ' పత్రికా కుటుంబంలోని వాడు. ఎప్పుడూ చేదోడు వాదోడుగా నిలిచి చేపట్టిన కార్యాన్ని శ్రద్ధతో సఫలీకృతం చేసేవాడు.**

పండితకుటుంబంలో జన్మించినవాడు. మెదక్ జిల్లా గుమ్మడిదల వాస్తవ్యుడు. ప్రస్తుతం హైదరాబాద్ పాతబస్తీలో స్థిరపడినవాడు. ప్రముఖ పండితులు డా. కె.వి. సుందరాచార్యుల వారి చిన్న కుమారుడు. ఒకవైపు తెలుగు మరోవైపు గణితం వైపు బాగా కృషి చేసి విద్యార్థులకు అన్ని రకాల మెలకువలు నేర్పిన వాడు.

తెలంగాణ రాష్ట్ర పాఠశాల తెలుగు పాఠ్య పుస్తక రచయిత, తెలుగు ఉపాధ్యాయ శిక్షకుడు, తెలంగాణ ఉపాధ్యాయుల శిక్షణా కరదీపికల రచనా భాగస్వామిగా, కరోనా సమయంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ లోనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖలోనూ టీ.వీ. (సైట్)ల ద్వారా విద్యా బోధకుడిగా, రాష్ట్ర ఎస్.సి.ఇ.ఆర్.టి. ద్వారా సేవలందించారు.

అలాంటి వెంకటశర్మ చైత్ర శుద్ధ ఏకాదశి 19.4.2024 రోజున విధి వశాత్తు వ్యాధిబారిన పడి వైకుంఠ ప్రాప్తిని పొందినారు. వెంకటశర్మ లేకపోవడం అటు ఉపాధ్యాయ లోకానికి, విద్యార్థి లోకానికి, భాషా సాహిత్య ప్రేమికులకు తీరని లోటు.

**'మూసీ' కుటుంబానికి అత్యంత మిత్రులైన కె.కె.వేంకటశర్మ కుటుంబానికి శ్రద్ధాంజలులు సమర్పిస్తూ...**

**వారి కుటుంబానికి ధైర్య స్థైర్యాలను అందించాలని ప్రార్థిస్తూ...**




**సౌందర్య హృదయం**

ఏమయ్య ! నీవయ్య! యెచ్చోట కెళ్ళావు?
విద్యార్థి లోకమున్ వీడినావె!
ఎన్ని విద్యలు నేర్చి యెంత యాలోచించి
సాధన విడువక సాగినావె !
శాస్త్ర సాంకేతిక సరిగమల్ మీటుచున్
రాగముల్పలికించి యేగినావె!
ఉత్కృష్ట బోధన నోర్పుగ జేయుచున్
ఉచ్ఛ్వాస నిశ్వాస లొదిలినావె!
నీదు తపన జూసి విధాత నిన్నెఱింగి
మురిసి పోయి తానిప్పుడే ముచ్చటాడ
నిన్ను పిలిపించుకొనెనేమొ నేస్తమోలె
మరొక సేవలో పంపగన్ మదిని దలచి!


ఆత్మీయ పిలుపుతో నందరిని పిలిచి
యానంద వశుడవై యరిగి నావె!
చిరునవ్వు చెదరని చిన్మయ ముద్రతో
హృదయాల నిలుచుచు నొదిగి నావె!
సునిశిత శోధనల్ శుద్ధమౌ వ్రాతలున్
నిష్కర్ష నేర్పుతో నిల్చినావె !
పదుగురు మెచ్చిన పాటవము పరుల
కుపకారివై నిల్చు తపన నీవె !
ఎవరినీ చిన్న బుచ్చని యెడద నీది
సాధుమతివి ! నీవు గురువు ! చారు శీలు !
మార్గదర్శివి నీవు! సమాజ హితము
కై తపించు వేంకటశర్మకై నుతులివె !
కందాడై వాడివి నీ
యందమినుమడించె సుందరానందమదిన్
గంధ కుసుమాక్షతలివియె
అందుకొనుము సాంజలులిట నందించితిమో!

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 (47) హైదరాబాద్ మే : 2024

# నిత్య అధ్యయన శీలి 'నిత్యానందరావు'

**ఆచార్య వెలమల సిమ్మన్న,** విశ్రాంతాచార్యులు, విశాఖపట్నం. ఫోన్ : 9440 641617

**సమీక్షల్లో, పీఠికల్లో ఆయా రచయితల శ్రమను, వస్తు రచనలను ప్రశంసించడానికి ఎక్కడా లోభపడలేదు. దానికి సంబంధించిన మరికొన్ని విశేషాలను చెప్పడానికి ఎప్పుడూ వెనుకంజ వేయలేదు. ఏది చేసినా నిర్మలమైన మనసుతో చేశాను. ఎత్తుగడలో కాస్త కవితాత్మకత చోటు చేసుకుంటుంది. తరువాత విషయం ప్రాధాన్యం వహిస్తుంది.** – ఆచార్య వెలుదండ నిత్యానందరావు.






పరిశోధకుడిగా, పర్యవేక్షకుడిగా, విమర్శకుడిగా, వ్యాసకర్తగా రచయితగా, సంపాదకుడుగా, సమీక్షకుడుగా, పీఠికారచయితగా, సహృదయుడుగా, స్నేహశీలిగా, నిత్య అధ్యయనశీలిగా, వినయ సంపన్నుడిగా, ఆచార్యుడుగా ఎనలేని కీర్తిప్రతిష్ఠలు పొందారు ఆచార్య వెలుదండ నిత్యానందరావు. ఎన్నో అవార్డులు, పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉంటూ షష్టిపూర్తి పండుగ సందర్భంగా ఇలా సమగ్ర రచనల సంపుటాలు వెలువరించడం సంతోషకరమైన విషయం. ఇలా ముందుచూపుతో ముందుకు వెళుతున్నారు. అందుకు అభినందనలు. నిత్యానందరావు ఏ గ్రంథాన్ని సమీక్షకు స్వీకరించినా దాని పూర్వాపరాలను చక్కగా విశ్లేషిస్తారు. ఒక గ్రంథాన్ని బాగా చదివి లోతుగా అధ్యయనం చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. గ్రంథ సమీక్షల్లోనూ, పీఠికా రచనల్లోనూ ముందు వరుసలో ఉంటారు.

"ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం" మొదటి సంపుటి **"అనుభూతి – అన్వేషణ"** . ఇందులో రెండు భాగాలున్నాయి. ఒకటి సమీక్షలు. రెండు పీఠికలు. 147 సమీక్షలు, 82 పీఠికలు. మొత్తం 229. పేజీలు 547. ఈ గ్రంథాన్ని తల్లిదండ్రులకు అంకితం ఇచ్చారు. వీరు రాసిన సమీక్షలు కొన్ని విశ్లేషణాత్మకంగా ఉన్నాయి. కొన్ని విమర్శనాత్మకంగా ఉన్నాయి. కొన్ని సాదాసీదాగా ఉన్నాయి. కొన్ని సమీక్షలు, పీఠికలు ఇంకా నిశితంగా, విమర్శనాత్మకంగా ఉంటే బాగుండేదనిపిస్తాయి. సమీక్ష, పీఠిక రెండు విమర్శలో భాగమే. ఆ దృష్టితో సమీక్షలు, పీఠికలు రాశారు. అసలు విషయం ఏమంటే సమీక్ష చదివినా, పీఠిక చదివినా మూలగ్రంథాన్ని చదవాలనిపించే విధంగా ఉండాలి. అదే పని వెలుదండ వారు చేశారు. రావు గారు కొన్ని సందర్భాల్లో గ్రంథకర్తలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రెండవ ముద్రణలో సరి చేసుకుంటే బాగుంటుందని సున్నితంగా చెప్పారు. ఒక పుస్తకాన్ని సమీక్షించినప్పుడు పరిశోధకుడిగా విమర్శకుడిగా అనేక విషయాలను పరిగణనలోకి తీసుకున్నారు. గ్రంథ సమీక్షల్లో నిత్యానందరావుగారి లోని ప్రత్యేకత ఏమంటే గుణదోష విచారణ చేయడం. గ్రంథకర్త ఏమనుకుంటారో అనేది ఆయన లెక్కలోకి తీసుకోరు. తన ధోరణిలో ముందుకు సాగుతారు. అక్కడక్కడ చురకలు వగైరాలు కూడా ఉన్నాయి. కొన్ని సమీక్షల్లో భాషా తీవ్రత కనిపిస్తుంది. ఒకటి రెండు సందర్భాల్లో దూకుడు కనిపించింది. గ్రంథసమీక్షల్లోను, పీఠికల్లోను రావుగారి ప్రతిభా పాటవాలు వెల్లివిరిశాయి. దగ్గరివారైనా, దూరంవారైనా, మహా మహాపండితులైనా ఎవరైనా ఒకే విధంగా ముక్కుసూటిగా వివేచన చేయడం వెలుదండవారి ధోరణి. అదే వారి విశిష్టత, ప్రత్యేకత కూడా. వీరు రాసిన మొట్టమొదటి సమీక్ష గ్రంథం "అన్వేషణ – అనుభూతి". దీన్ని మోపిదేవి కృష్ణస్వామి రాశారు. వీరు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల శిష్యులు. గురువుగారితో శిష్యరికం చేసిన జీవిత ప్రస్థానమే ఈ గ్రంథం . ఈ గ్రంథాన్ని సమీక్షిస్తూ **"కృష్ణ స్వామి గారిని ఆత్మహత్యాప్రయత్నం నుండి మరలించిన మాస్టర్ ఎక్కిరాల వారి సందేశం నేటి యువతరానికి వెలుగుబాట లాంటిది. ఈ సందేశాన్ని అందుకొని ముందుకు వెళితే యువతరానికే కాదు, దేశానికి ప్రపంచానికి అభ్యుదయం, ఆత్మతృప్తి లభిస్తాయని"** నిత్యానందరావు తెలియజేశారు. ఈ సూచన బావుంది.

ఎన్. గోపి గారి **"వ్యాసనవమి"** వ్యాసాల్లో సున్నితత్వం, ఆవేశరాహిత్యం అడుగడుగునా ప్రదర్శితమైంది అని అన్నారు. మలయవాసిని గారు ఆంధ్ర జానపద సాహిత్యం రామాయణం రాశారు ఈ గ్రంథంలో జానపదుల హృదయావిష్కరణను చక్కగా చేశారని ప్రశంసించారు. రామాయణాన్ని విషవృక్షంగా తలపోసి కలవరపడిన వారంతా వాల్మీకి కంటే విజ్ఞానవంతులని అనిపించుకున్న వారేమో కానీ రామాయణ వైశిష్ట్యాన్ని జనుల మనసుల్లో దానికున్న స్థానాన్ని తగ్గించలేకపోయారని రావుగారు అధిక్షేపించారు.

అంధత్వం హేతువుగా తాను స్వయంగా చదువుకోలేని స్థితిలో ఉండి ఇతరుల మీద ఆధారపడి ఎన్నో కష్టనష్టాల కోర్చి మన్నవ సత్యనారాయణ గారు ఎంతో చక్కని సిద్ధాంత గ్రంథాన్ని రాశారు అని రావు గారు మనసారా అభినందించారు. ఈ సిద్ధాంత గ్రంథానికి ఎక్కువ మందితో పీఠికలు రాయించడం గ్రంథానికి భారం అయిందని కూడా సున్నితంగా విమర్శించారు. కథానిక స్వరూప స్వభావాలు గ్రంథాన్ని పోరంకి దక్షిణామూర్తి గారు రాశారు. ఇలాంటి గ్రంథం ఇంతవరకు తెలుగులో రాలేదు. ఇకముందు కథానికను గూర్చి ఈ గ్రంథాన్ని సంప్రదించకుండా మాట్లాడే వీల్లేని పరిస్థితి కల్పించారు అని మెచ్చుకున్నారు. వెలమల సిమ్మన్న దర్శిని అనే వ్యాస సంపుటిని రాశారు ఈ వ్యాసాల్లో ఆవేశం ఎక్కువగా ఉందని విమర్శించారు. సిమ్మన్న ప్రవాహంలో అందరిలాగే కొట్టుకపోతూ ఆవేశాలకులోను కాకుండా సామరస్య పూర్వకంగా నిత్య సాహిత్య అధ్యయనంతో ఆలోచనలతో ఎన్నో మంచి గ్రంథాలు రాయాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. ప్రాచీన కావ్యాలను నేటి సిద్ధాంతాలతో విమర్శించడం మంచిది కాదన్నారు. సి.నారాయణరెడ్డి గారి ఆరనివ్వాల కవితా సంకలనాన్ని సమీక్షిస్తూ ఈ కవితా సంకలనంలో కవిత్వంకన్నా వచనమే ఎక్కువయ్యాయని చెప్పడాని కేమాత్రం సంకోచింపలేదు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి అభినందన సంచిక 'ప్రతిభా వైజయంతి'కి సంపాదకులు అక్కిరాజు రామాపతిరావు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల సంస్థ వారి సారథ్యంలో ఈ సంచిక వచ్చింది. కొర్లపాటి వారు సాహిత్యరంగంలో చూపిన విశేష ప్రతిభాపాటవాలను కొనియాడుతూ రాసిన వ్యాసాలు ఇందులో చోటు చేసుకున్నాయి. రమాపతిరావు గారి పనితనం ఈ సంచికలో కొట్టొచ్చినట్లు కనిపించిందని రావుగారు ప్రశంసించారు. రెంటాల శ్రీ వేంకటేశ్వర రావు గారు అవగాహన వ్యాస సంపుటిని సమీక్షిస్తూ **"వీరి విశ్లేషణలు పరిశీలనలతో కూడి ఉండి, రచయితకు వస్తువుకు మధ్య ఉన్న సంబంధబాంధవ్యాలను ఆత్మీయంగా వ్యక్తీకరిస్తాయి"** అని అని నిత్యానందరావు గారు అన్నారు. తెలుగు సాహిత్య విమర్శ అవతరణ వికాసములు గ్రంథాన్ని సమీక్షిస్తూ వివేచనాశీలం, స్పష్టత, సంయమనంతో సమన్వయపూర్వకంగా సాగిన ఎస్.వి.రామారావు గ్రంథాన్ని ఎందరో రిఫరెన్స్ గ్రంథంగా ఉపయోగించుకోవడం, దీనిలో ప్రస్తావితమైన అంశాల మీద తర్వాత కాలంలో డాక్టరేట్లు రావడం గమనిస్తే ఈ పుస్తకం ఎంత గొప్పదో తెలుస్తుందని అన్నారు నిత్యానందరావు.

ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ అనే గ్రంథాన్ని గుమ్మన్న గారి బాల శ్రీనివాస మూర్తి రాశారు. తెలంగాణ ప్రాంత చరిత్ర సాహిత్యం సాంస్కృతిక సామాజిక అంశాలు వినూత్న ఆవిష్కరణతో ఉద్వేగాలకు ఆరోపణలకు అసత్య ప్రతిపాదనలకు తావు లేకుండా సత్యమే ప్రాణవాయువుగా ఉండాలని భావిస్తూ సంయమన శీలంతో సముచిత సమాచార సంపదతో వెలువరించిన గ్రంథం అని వెలుదండ వారు అన్నారు. కందుకూరి వీరేశలింగం అనే గ్రంథాన్ని ఆచార్య వకుళాభరణం రామకృష్ణ రాశారు. రాజకీయ సాంఘిక ఆధ్యాత్మిక లౌకిక వైజ్ఞానిక రంగాలన్నింటిలో తెలుగువారి పురోగమనానికి బాటలు వేసిన మహనీయుడు కందుకూరి. కందుకూరి మీద విలువైన విషయ నిర్భరమైన గ్రంథాన్ని వకుళాభరణం వెలువరించారని రావు గారు అన్నారు.

పద్యకవిత్వం వస్తు వైవిధ్యం గ్రంథాన్ని కెవి రమణాచారి రాశారు. వీరు ఆధ్యాత్మిక, పౌరాణిక , చారిత్రక, సామాజిక విభాగాల కింద వర్గీకరించి చక్కగా విశ్లేషించారు. **"పద్యరచనకు చాలినంత నైపుణ్యం, ఏకాగ్రచిత్తం లేని పద్యకవుల వల్లనే పద్యప్రక్రియ కొన్నిసార్లు నిందలకు గురి అవుతుందని చెప్పడానికి ఏమాత్రం రమణాచారి సంశయించలేదని"** నిత్యానందరావు తెలియజేశారు. రావి రంగారావు కుంకుమకాయ అనే కవిత సంకలనాన్ని సమీక్షిస్తూ ఆ కుంకుడుకాయ తలమీద మాలిన్యాన్ని కడిగేస్తుంది ఈ కుంకుడుకాయ తలలోని మాలిన్యాన్ని కడిగేస్తుంది అని చమత్కరించారు.

వై. కామేశ్వరి గారు ఏకవీర విశ్వనాథ కథన కౌశలం గ్రంథాన్ని రాశారు. వీరు విశ్వనాథ వారి కథన కౌశలం విధానాన్ని ప్రతిభా వంతంగా ఆలోచనాత్మకంగా విశ్లేషించారు. ఏకవీర గురించి ఎవరు మాట్లాడాలన్నా వ్రాయాలన్నా ఈ గ్రంథం చదవవలసిందే అంత బాగా రాశారు అని కామేశ్వరి గారిని ప్రశంసించారు రావు గారు.

కాలువ మల్లయ్య కథలు తెలంగాణ జన జీవితం గ్రంథాన్ని బన్న ఐలయ్య గారు రాశారు. కాలువ మల్లయ్య రాసిన కథల్లోని వస్తు విస్తృతిని అంచనా వేయడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది ఈ కథల్లోని తెలంగాణ సామాజిక చారిత్రక రాజకీయ ఆర్థిక కులపరమైన వికాస విశేషాలను ఇంకా పరిశీలించవలసిన అవసరం ఉంది అని నిత్యానందరావు గారు అభిప్రాయపడ్డారు. శ్రీశ్రీ అనంతం పేరుతో స్వీయ చరిత్ర రాశారు. శ్రీశ్రీ గారు ఈ గ్రంథం గురించి నేను ఆషామాషీగా కానీ, ఊసుపోకకు కానీ రాయలేదు. నా జీవన వాస్తవికతను సందర్శించే ఉద్దేశంతో రాశాను. నాది సత్యాన్ని పరిశీలించే ప్రయత్నం అని అన్నారు. ఈ స్వీయ చరిత్రపై ఎన్నో చర్చలు జరిగాయి. ఇందులో ఎన్నో విశేషాలు ఉన్నాయి. అయితే వీటిని ఒక క్రమపద్ధతిలో రాయకపోవడం శ్రీశ్రీ యొక్క విశేషం అని రావు గారు అన్నారు. ఔను్న తృప్తిని, టన్ను అసంతృప్తిని నిలిపినా సరే శ్రీశ్రీ అంటే అభిమానం ఆరాధన కే.వి.రమణారెడ్డి గారిలాంటి పెద్దలన్నది వాస్తవ మన్నారు. ఆచార్య వెలమలసిమ్మన్న తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథంలో ప్రాచీనానికి ఆధునికానికి సమప్రాధాన్యం లభించింది. ప్రధానంగా గురువుగారైన కొర్లపాటి శ్రీరామమూర్తి

మార్గాన్ని అనుసరించినా, నన్నెచోడుని విషయంలో విభేదించడం గమనార్హం. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ గ్రంథం ఎంతో ప్రయోజనకారి అని నిత్యానందరావు వ్యాఖ్యానించారు.

తెలంగాణ సాహిత్యరత్నాల వీణ పేరుతో ద్వానాశాస్త్రి గ్రంథం రాశారు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కత్తి పద్మారావు తెలుగు సాహిత్య చరిత్ర భాషా సామాజికత కులాధిపత్యం రాశారు ఇది గ్రంథంలా కాకుండా వ్యాస సంకలనంగా ఉందని తీవ్రంగా విమర్శించారు. ఈ గ్రంథానికి తెలుగు సాహిత్య చరిత్ర అని శీర్షిక పెట్టడం సమర్థనీయంగా లేదన్నారు.

విప్లవం నుంచి వేదం దాకా డాక్టర్ దాశరథి రంగాచార్య సాహిత్య జీవిత ప్రస్థానం అనే గ్రంథాన్ని వి.జయప్రకాష్ గారు రాశారు ఈ గ్రంథాన్ని సమీక్షిస్తూ విప్లవవాదిగా, మార్క్సిస్టుగా ఉంటూనే వేదవాదిగా సంప్రదాయకునిగా రెండు భిన్నమైన పాత్రల్లో ఏకకాలంలో దర్శనం ఇవ్వడం దాశరథి రంగాచార్యలోనే చూస్తాం. ఆయన ఇరువర్గాలకు ప్రీతిపాత్రుడు కావడం మరింత విశేషం. ఇది దాశరథి రంగాచార్యలోని లౌక్యమా? వామపక్షులలో పెరిగిన ఉదారవాదమా? అన్వయించడానికి మరొక ప్రమాణ సూత్రాన్ని ఏర్పరచుకోవలసిన ఆవశ్యకతకు సూచననా? లేక సహజ పరిణామమేనా? అని ఈ గ్రంథం చదివినప్పుడు మనకు ఈ భావాలు మెదులుతాయని నిత్యానందరావు అభిప్రాయపడ్డారు. రంగాచార్య గారు సాయుధ పోరాట కాలంలో జైలుకు వెళ్లారు. యవ్వనంలో కమ్యూనిజాన్ని ఆరాధించారు. చాటుమాటుగా పూజలూ, పునస్కారాలు చేయడం, ముహూర్తాలు చూడడం కాకుండా బాహాటంగా వాటిని విశ్వసించారని నిత్యానందరావు అన్నారు

భారతంలో బంధాలు గ్రంథాన్ని కడియాల జగన్నాథశర్మగారు రాశారు. శర్మగారు కౌరవులు అనే పాండవులు అనార్యులనీ, బహుభర్తృత్వం వారి సాధారణ ఆచారమని వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. మహాభారతాన్ని ముఖ్యంగా అందులోని వివాహ వ్యవస్థ గురించి సమాజ శాస్త్ర మానవ శాస్త్ర చారిత్రకాంశాలతో విశ్లేషించారు శర్మగారు అన్నారు. పై గ్రంథాలనే కాక ఇంకా ఎన్నో సమీక్షలు రావు గారు రాశారు

కొలకలూరి ఇనాక్, రాచపాలెం చంద్రశేఖర రెడ్డి, పి. సుమతీ నరేంద్ర, జి చెన్నకేశవరెడ్డి, పైడిపాల సత్యనారాయణ, షేక్ మస్తాన్, గరికిపాటి నరసింహారావు, అమ్మంగి వేణుగోపాల్, వై. రెడ్డిశ్యామల, సముద్రాల కృష్ణమాచార్య, అప్పం పాండయ్య, వారణాసి వెంకటేశ్వర్లు, టి.శ్రీరంగ స్వామి, ఎం.వి ఆర్ శాస్త్రి... మొదలైన లబ్ధప్రతిష్ఠుల సమీక్షలు ఎన్నో ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి.

## II

ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం గారి నవయుగ రత్నాలు వ్యాససంకలనానికి నిత్యానందరావు తొలి పీఠిక రాశారు. అసలు గురువుగారి గ్రంథానికి శిష్యుడు పీఠిక రాయడం ఎంత అదృష్టం. ఆ అరుదైన అవకాశం నిత్యానందరావుకు దక్కింది. ఎనలేని ఆనందాన్ని కలిగిస్తుంది. అంత గొప్ప విమర్శకుడు శిష్యుడితో పీఠిక రాయించడం చరిత్రలో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ విషయం. శిష్యుడు ప్రతిభావంతుడు అనే విషయం ఇక్కడ చెప్పకనే చెప్పినట్లయింది. (మానసిక అనుబంధమే తప్ప, తరగతి గదిలో కూర్చొని చదువుకొన్న శిష్యుడు కూడా కాదు). **"ప్రక్రియ స్వరూప స్వభావాలను విశ్లేషించడం, గుర్తించడం, క్లాసిజం ప్రమాణాలు అన్వేషించడం, వివేచించడం ఈ 18 వ్యాసాల్లో ఆచార్య జీవీఎస్ చేసిన పని అని నేను తలపోస్తున్నాను.... అందరూ అన్నింటితో ఏకీభవిస్తారని అనుకోలేం. ఏకీభవించాలనుకోవడం అత్యాశ. అందరినీ సంతృప్తి పరచడం సాధ్యమయ్యేది కూడా కాదు. వారు చేసే కొన్ని వ్యాఖ్యలు వ్యక్తిగత అభిరుచికి ప్రతిబింబాలుగా కనిపించవచ్చు. కొన్ని ఔత్సాహిక ప్రతిపాదనలుగా మిగిలిపోవచ్చు. విశ్వనాథ పట్ల అతిగా స్పందిస్తారని విమర్శకులోను కావచ్చు. ఇష్టానిష్టాలు అభిరుచులు ఉండడం మానవ సహజం. మనం ఏకీభవించడం ప్రమాణమూ కాదు, ఏకీభవించక పోతే న్యూనతా కాదు"** అని మొదటి ముందుమాటలోనే నిత్యానందరావు ఇంత సత్యసమ్మతంగా, స్పష్టంగా మొహమాటం లేకుండా రాయడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది.

సబ్బని లక్ష్మీనారాయణ మన ప్రస్థానం రాశారు. దాని ముందుమాటలో ఒకే అంశాన్ని పలుమార్లు చెప్పి బలమైన ముద్ర వేయవచ్చు అనుకోవడం రచయితపరంగా ఎంత సహజమో, పునరుక్తే కదా ఏదో ఒకటి చదివితే సరిపోదా అని తక్కిన వాటిని వదిలివేసే ప్రమాదం పాఠకుని పరంగా అంతే సహజం. ఈ కవితల్లోని పునరుక్తి పునరాలోచనీయమే. దీని ప్రయోజనం ప్రశ్నార్థకమే అయినా ప్రయోగం విలక్షణమైనది భావించవచ్చు. ఒక్కో కవితలో ఒక్కో వస్తువును ప్రవేశపెట్టి పేరడీలు రాసి ఉంటే వస్తు విస్తృతి పెరిగి రచయితకు కీర్తి కారకం పాఠకునికి మరింత ఆహ్లాద కార్యక్రమం అయ్యేది. ఇందులో సున్నితగా సలహా, విశ్లేషణ, చురక, ప్రశంస చోటుచేసుకోవడం గమనించవచ్చు.

నోరి నరసింహశాస్త్రి సమీక్షాసంకలనాన్ని సమీక్షిస్తూ నోరివారు ఏ గ్రంథాన్ని సమీక్షించినా లోతుగా విషయ వివేచన చేయడం, లోపాలను నిష్కర్షగా చెప్పడం, అభినందించే అంశాలను దాచుకోకుండా చెప్పి అభినందించడం, రచయితకు పాఠకుడికి మధ్య వారధిగా నిలిచి ఉండి పుస్తకాన్ని గురించి అవగాహన పాఠకుడికి రచనల్లోని మంచిచెడ్డలు అవగాహన రచయితకు కలిగేలా వ్యవహరిస్తారు. నోరి నరసింహ శాస్త్రి సమీక్షలన్నీ ఉదాత్తతకు, నిగ్రహానికి, శ్రద్ధకు, విచక్షణకు దృష్టాంతాలు. విజ్ఞాన పరిధిని పెంచుకోదలచిన పాఠకులు ఈ గ్రంథాన్ని చదవవలసిందని అని నిత్యానందరావు సూచిస్తారు.

ఆధునికాంధ్ర భావ కవిత్వం అనే గ్రంథాన్ని పాటిబండ మాధవ శర్మగారు రాశారు. ఈ పీఠిక చాలా పెద్దది. 20 పేజీలు ఉన్నాయి. ఇందులో గ్రంథానికి సంబంధించినవే కాక శర్మ గారి జీవితవివరాలు, ఇతర విషయాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఇది బిఏ (ఆనర్స్) పరిశోధన గ్రంథం. మొత్తం పాటిబండవారు భావకవిత్వ విశ్లేషణకు పరిశీలించిన భావకవులుగా ఉదాహరించిన దాదాపు 50 మంది కవులను పరిశీలిస్తే రాయలసీమ ప్రాంతీయులకు, తెలంగాణ ప్రాంతీయులకు దానితో సంబంధం ఉన్నట్లే తోచదు. ఇంకా చెప్పాలంటే మద్రాస్ విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయాల్లో బిఏ, ఎంఏలు చదివిన విద్యార్థుల కవితా కోలాహలం అని నిత్యానందరావు వ్యాఖ్యానించారు. కానీ పాటిబండవారు అప్పటికి ఒక డిగ్రీ విద్యార్థి మాత్రమే. ఆ కాలంలో రాయలసీమ తెలంగాణలోని భావకవులను తెలుసుకొని రాయడం కష్టం. తనకు అందుబాటులో ఉన్న సమాచారంతో బాగా రాశారు. దానికి మనం సంతోషించాలి. ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటి బ్యాచ్ విద్యార్థి (1933) ఆయన.

తెలంగాణ సాహిత్యం-ప్రాంతీయ అస్తిత్వం గ్రంథాన్ని వి. శ్రీదేవి గారు రాశారు. ఆమె ఒక వ్యాసంలో తెలంగాణ మండలికపదాల పట్టిక ఇచ్చారు. ఈ పట్టిక ఇలా కాకుండా భిన్న రంగాలకు చెందిన పది పదిహేను పదాలను ఎన్నుకొని వాటి రూపాలను జిల్లాలవారీగా ప్రదర్శించి ఉంటే మరింత బాగుండేదేమో అని నిత్యానందరావు సూచించారు. మాండలికాలను భద్రపరచి భావితరాలకు అందజేయాలని శ్రీదేవి గారు ఆశించడంలో తప్పేమీ లేదు కానీ తాతమ్మ వేసుకున్న నగలను అలాగే మనుమరాలు ధరించాలనడం తగదు. ఆ పసిడిని తన కాలానికి అనుగుణమైన నగలరూపంలోకి మార్చుకొని వాడుకుంటేనే అది విజ్ఞత అవుతుంది- అంటూ వెలుదండవారు కాలానుగుణంగా భాషలో వచ్చే ధ్వని, అర్థవిపరిణామాలను, ఇతరమార్పులను దృష్టిలో పెట్టుకోక తప్పదంటారు. తాను చెప్పదలుచుకున్న విషయాన్ని చాలా స్పష్టంగా, డొంక తిరుగుడు లేకుండా చెప్పడం నిత్యానందరావు పీఠికల్లో గమనించే అంశం.

ఆధునిక తెలుగు విమర్శకులు విమర్శనా పద్ధతులు అనే గ్రంథాన్ని శరత్ జ్యోత్స్నారాణి రాశారు. దాన్ని సమీక్షిస్తూ ఈ గ్రంథంలోని 18 మంది విమర్శకులు ఒక్క కుదురున ఇమిడిన వారు కారు. ఒక్కో భావ ధోరణికి అంకితమైన వారు కాదు. ఒక్క కాలానికి సంబంధించిన వారు కాదు. తెలుగు నాట ఆధునికతను గుర్తించి, దర్శించి, వ్యాఖ్యానించి తమదైన రీతిలో సామాజిక పురోగమనానికి దోహదం చేసినవారే. కొందరు ఇందులో చేరి ఉంటే బాగుండేదని మరికొందరు లేకపోయినా సరే సరిపోయేది అన్న తలంపులకు మూలం మన అభిరుచులకు తలుపులు తీయడమే. దానికి అంతు ఉండదు. ఈ 18 మంది విమర్శకశ్రేష్ఠులు వ్యక్తీకరించిన భావాలను గుర్తిస్తే ఆధునిక విమర్శకు ప్రాతిపదికలు గుర్తించినట్లే అని చాలా చక్కగా అంచనా వేశారు నిత్యానందరావు.

చెన్నకేశవరెడ్డి గారి కరోనాకాపురం కవితాసంకలనాన్ని సమీక్షిస్తూ ప్రజలకు భౌతిక దూరాలను ప్రబోధిస్తూ నైతిక భారాలకు దూరం అవుతున్న పాలక వ్యాపార వ్యవస్థలను గమనిస్తూ, ఏమీ అనలేక ఎదిరించలేక ఉడికిపోయే మరోస్థితిని దృశ్యమానం చేశారు. ఇది ఈ కావ్యకర్త అయిన చెన్నకేశవరెడ్డి ఒక్కరి అంతరంగం మాత్రమే కాదు ఏదు పదులు దాటిన ఆలోచనాపరులు అందరిదీ అని రావుగారు వ్యాఖ్యానించారు. కాసుల నాగభూషణం (నవీన సుమతీ శతకం), కె.వి.యన్.డి. వరప్రసాద్ (మునిపల్లె రాజు సాహిత్యం ) దేవారెడ్డి విజయలక్ష్మి (రాయలసీమ వాడుక మాటలు), ఎస్.యాదగిరి (ఆచార్య రవ్వా శ్రీహరి జీవితం- సాహిత్యం) జంగా హనుమయ్య చౌదరి (సత్యా వివాహం), గుమ్మన్న గారి వేణుమాధవ శర్మ (మహాభారతం) మొదలైన గ్రంథాలకు నిత్యానందరావు నిత్యానందరావు చక్కని ముందుమాటలు రాశారు.


మొత్తం మీద ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమీక్షలు, పీఠికలు వారి లోతైన అధ్యయనానికీ, పరిశోధన ప్రవృత్తికీ, మృదుమధురమైన విశ్లేషణకు వేదికగా నిలుస్తాయి. ఈ గ్రంథం పరిశోధకులకు, అధ్యాపకులకు ఆచార్యులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా పరిశోధకవిద్యార్థుల భావవిస్తృతికి, వ్యక్తీకరణ నైశిత్యానికి నిత్యానందరావు రచనలు మార్గదర్శనం చేస్తాయి. శ్రద్ధగా మంచి సాహిత్య విమర్శ వస్తున్నపుడే మంచి సాహిత్యం వస్తుంది. నిత్యానందనరావుతో ముప్పయేళ్ళ స్నేహం నాది. ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ అభినందనలు తెలుపుతున్నాను.

***(తెలుగువిశ్వవిద్యాలయం వారు సాహిత్యవిమర్శప్రక్రియలో 2022సంవత్సరానికిగాను ఉత్తమ సాహితీపురస్కారం ప్రకటించిన సందర్భంగా అభినందిస్తూ.........)***


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**
**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**
**వెల : 300/-**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 7 హైదరాబాద్ మే : 2024


# పూళ్ళ విశ్వనాథ స్వామి నవల "పేరులో పెన్నిధి" (హాస్పిటల్ ఫార్మసిస్ట్‌లపై తెలుగులో ఏకైక నవల)


డాక్టర్ రాపోలు సత్యనారాయణ, ఫోన్ : 94401 63211

**ఉపోద్ఘాతం :** ప్రతి మనిషి జీవిక కోసం ఏదో ఒక వృత్తి చేయవలసిందే! వృత్తులలో 1. ప్రాథమిక, 2. ద్వితీయ, 3. తృతీయ స్థాయిలు ఉన్నాయి. ప్రాథమిక వృత్తులు పంట సాగు, పశుపోషణ వంటి ఉత్పత్తి ప్రధానమయినవి. ద్వితీయ స్థాయి వృత్తులు ప్రాథమిక వృత్తుల మీద అధారపడి ఏర్పడిన చేతి పనులు, పరిశ్రమలు, వర్తకం తదితర వృత్తులు. తృతీయ శ్రేణి వృత్తులు పూర్తిగా మేధోపరమైనవి. అధ్యాపక, వైద్య, న్యాయవాద, రాజకీయ ఇత్యాది వృత్తులు తృతీయ శ్రేణి వృత్తులు. వృత్తిని ఇంగ్లిష్‌లో ఆక్యుపేషన్ అంటరు. అయితే తృతీయ శ్రేణి వృత్తిని ప్రత్యేకంగా ప్రొఫెషన్ అంటరు. తెలుగులో ఆక్యుపేషన్, ప్రొఫెషన్ రెండింటికి వృత్తి అనే పదాన్నే వాడుతము.

వైద్యవృత్తి పై మూడవ కోవలోనిది. సేవల విభజన వలన, ప్రత్యేక నైపుణ్యాల వలన, వినూత్న ఆవిష్కరణల వలన వైద్య వృత్తిలో కూడా పలు విభాగాలు ఏర్పడ్డయి. ఔషధ కల్పన, ఔషధ ప్రయోగంలో నిపుణులయిన వారిది భైషజిక వృత్తి. భైషజిక పదం కఠినంగా ఉందనుకొంటె సరళంగ ఔషధ ప్రయోక్త అనవచ్చు. ఔషధ ప్రయోక్తను ఇంగ్లీష్‌లో ఫార్మసిస్ట్ అంటరు. మన దేశంలో ఫార్మసిస్ట్‌ల విద్యను, వృత్తిని భారతీయ భేషజీ పరిషత్ (Pharmacy Council of India) నియంత్రణ చేస్తది.

**హాస్పిటల్ ఫార్మసిస్ట్స్ – సాహిత్యం :** వైద్య వృత్తిలోని ఫిసిషియన్, సర్జన్, నర్స్ వంటి వృత్తుల మీద సాహిత్యం విస్తారంగనే వచ్చినప్పటికి, ఫార్మసిస్ట్ జీవితంపై పూర్తి స్థాయి రచనలు లేవు. అగాథా క్రిస్టీ వంటి ఫార్మసిస్ట్‌లు సాహితీవేత్తలుగా రాణించినా, తమ వృత్తి జీవితంపై వారేమి వ్రాయలేదు. మన దేశంలో పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. ఫార్మసిస్ట్‌ల జీవితం మీద తెలుగులో, బహుశా భారతీయ భాషలలో, వచ్చిన ఒకే ఒక సాహిత్య రూపం పూళ్ల విశ్వనాథ స్వామి రచించిన "పేరులో పెన్నిధి" నవల. ఫార్మసిస్ట్‌ల వృత్తి జీవితం మీద ఇంగ్లిష్‌లో వచ్చిన మరొక రచన "స్ట్రెస్ అండ్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ అమాంగ్ హాస్పిటల్ ఫార్మసిస్ట్స్ ఇన్ ఇండియా".

ఇది రాపోలు సత్యనారాయణ పరిశోధన గ్రంథం, 2007లో అచ్చు అయింది. పేరులో పెన్నిధి – నవల వ్రాసినది 1990లో అయినప్పటికి 1998లో ముద్రణ పొందింది. మరిన్ని తాజా మార్పులతో 2008లో ద్వితీయ ముద్రణ వెలువడింది. పూళ్ల విశ్వనాథ స్వామి స్వయానా ఫార్మసిస్ట్! తన జీవిత అనుభవాలే నవలగ మార్చినందున విషయంలో వాస్తవికత, సాధికారత కనిపిస్తది. మొత్తం ఐదు నవలలు వ్రాసిన స్వామికి ఇది రచయితగ తొలి కృతి! పేరులో




**ప్రతులకు :**
దా పూళ్ల విశ్వనాథ స్వామి,
ఫ్లాట్ నం. 208, గణేశ్
సదన్ అపార్ట్మెంట్స్,
గోకుల్ థియేటర్ ఎదురుగ,
విశాఖపట్నం – 530 004,
ఫోన్: 9866189578

పెన్నిధి నవల అనుశీలన అర్థం కావాలంటె వైద్య వృత్తిలోని కొన్ని పదాలు, భావనలు అర్థం కావాలె. అందు కోసం, క్రింద ఇచ్చిన అంశాలు అవగతం చేసికొని ముందుకు పోదాం.

**ఫార్మసిస్ట్ వృత్తి – పూర్వాపరాలు :** మనిషి మనుగడ సాగించిన నాటి నుండే ఫార్మసి చరిత్ర మొదలైంది. అనారోగ్యానికి ఏ ఆకు అలమో తిని బాగుపడిన అనుభవమే ఫార్మసీకి మూలం. మన సంప్రదాయ వైద్యాలలో వ్యాధి నిదానం, ఔషధ ప్రయోగం చేసేది ఒకే వ్యక్తి. ఒక్క మాటలో ఆ వ్యక్తిని వైద్యుడు అన్నా సాంకేతికంగా భిషక్ (Physician), భైషజిక్ (Pharmacist) అనే ఇద్దరు వృత్తిదారులు కలగలసి ఉన్నట్టు అర్థం చేసికోవాలె. ఫార్మసీ 9వ శతాబ్దిలోనే బాగ్దాద్ నగరంలో ప్రత్యేక వృత్తిగ రాణించింది. కాని, ఆ పరిణామం ప్రపంచ వ్యాప్తంగా ఒకే విధంగా జరుగలేదు. మనకు ఐరోపియన్ వలసదారులతో అలోపతి వైద్యం పరిచయం జరిగింది. తొలుత సర్జన్‌లు, బార్బర్‌లు రాంగ తరువాత ఫిసిషియన్‌లు, అపోతెకరీలు వచ్చిండ్రు. అలనాటి ఔషధ ప్రయోక్త వృత్తి నామం అపోతెకరీ. అప్పటికి అక్కడ కూడా వైద్యరంగంలో రకరకాల సంస్కరణలు జరుగుతున్న తరుణం. ఔషధాలకు సంబంధించి వృత్తుల పరంగ ఏకస్వామ్యం లేదు. గ్రోసర్స్, స్పైసర్స్, అపోతెకరీస్, డిస్పెన్సర్స్, కెమిస్ట్స్, డ్రగిస్ట్స్, ఫార్మస్యూటిస్ట్స్ ఇట్లా రకరకాలు. పంతొమ్మిదవ శతాబ్ది పూర్వార్థంలో రాయల్ ఫార్మస్యూటికల్ సొసైటి ఏర్పడింది. అప్పటి నుంచి క్రమంగా ఫార్మసిస్ట్ పదం స్థిర పడింది. కాని, ఇండియా పరిస్థితి మరో రకం. వచ్చిన అపోతెకరీలు మెడికల్ ఆఫీసర్స్‌గా కొనసాగగా, ఔషధ వితరణ కోసం స్థానిక సహాయకులను

తీసికొని వారిని కంపౌండర్ అనే వారు. బ్రిటన్‌లో వచ్చిన మార్పులకు అనుగుణంగా స్వాతంత్ర్యానికి పూర్వమే అర్హులైన ఫార్మసిస్ట్‌లు సేవలు అందిస్తున్నా, స్వాతంత్ర్యానంతరం 1948లో ఫార్మసీ చట్టం వచ్చినా కంపౌండర్ పదం బహుళ ప్రచారం పొందింది. మెడికల్ ప్రాక్టీషనర్ లకు సహాయకులు అనే భావంతో ఇంకా వాడుకలో ఉంది. ఇప్పటికీ కమ్యూనిటీ ఫార్మసిస్ట్‌లను కెమిస్ట్ లని, హాస్పిటల్ ఫార్మసిస్ట్‌లను కంపౌండర్ లని సంబోధిస్తున్న తీరు ఫార్మసిస్ట్‌లను మానసికంగా ఇబ్బంది పెడుతున్నది. ఫార్మసిస్ట్‌లు డిప్లొమా, బాచెలర్, మాస్టర్, డాక్టర్ పట్టాలు పొంది కూడా సామాజిక గౌరవం దక్కక బాధ పడుతున్నరు. అదే అమెరికాలో ఫార్మసిస్ట్‌లు ఫిసిషియన్‌తో సమానంగ డాక్టర్ అని గౌరవాన్ని అందుకొంటున్నరు. ఔషధం ఉత్పత్తి మొదలుకొని వినియోగం వరకు అన్ని విషయాలలో నిష్ణాతులు ఫార్మసిస్ట్‌లు. మెడికల్ డివైసెస్, బ్లడ్ బాంక్ ప్రమాణాలు పరిరక్షించేది ఫార్మసిస్ట్‌లు.

**డాక్టర్ పదం – అర్థ వివరణ :** డాక్టర్ లాటిన్ పదం. డాక్టర్ అంటె పండితుడు, గురువు అని అర్థం. ఐరోపియన్ దేశాలలో మత ప్రబోధకులను, విశ్వవిద్యాలయ ఆచార్యులను డాక్టర్ అని సంబోధించే వారు. కాల క్రమంలో విశ్వవిద్యాలయాలు స్నాతకులకు పట్టాలు ప్రదానం చేసే సంప్రదాయం వచ్చింది. వైద్యశాస్త్రం చదివిన వారికి 'ఫిసిక్ డాక్టర్' లేదా 'మెడిసినే డాక్టర్' (ఎం.డి.) పట్టా లభించేది. క్రమంగ ఫిసిషియన్‌కు డాక్టర్ పర్యాయ పదమై స్థిరపడి పోయింది. సర్జన్‌లను మాస్టర్ అనేవారు. విద్యారంగ సంస్కరణల వలన మెడిసిన్‌లో కూడా బాచెలర్ డిగ్రీ వచ్చింది. ఎం.డి. స్నాతకోత్తర విద్య అయింది. అమెరికన్ విద్యా వ్యవస్థలో ఫిసిషియన్, ఫార్మసిస్ట్, డెంటిస్ట్, వెటరినేరియన్ లకు మౌలికంగా డాక్టర్ డిగ్రీ ప్రదానం చేస్తరు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు అధికారింగ ప్రచురించిన 'డిక్షనరీ ఆఫ్ ఆక్యుపేషనల్ టైటిల్స్' లో ఎక్కడా డాక్టర్ అనే వృత్తి లేదు. విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ పట్టా పొందిన వారిని మాత్రమే డాక్టర్ అని సంబోధించాలె. కాని, ఇప్పుడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అందరు డాక్టర్ డిగ్రీ లేకున్నా పేరు ముందు డాక్టర్ అని వ్రాసి కొంటున్నరు.

**ఆర్.ఎం.పి. నిర్వచనం :** ఆర్.ఎం.పి. కి పూర్తి రూపం రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్. ఇందులో పదాలను మార్చి వేరే చెప్పకూడదు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940 అనుబంధంగా ఉన్న డ్రగ్ రూల్స్ 1945లోని నియమం 2 ప్రకారం ఆర్.ఎం.పి. అనగా ఇండియన్ మెడికల్ డిగ్రీస్ ఆక్ట్ 1916 సెక్షన్ 3 క్రింద ప్రకటించిన, కాని ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆక్ట్ 1933లోని షెడ్యూల్‌లలో పేర్కొన్న వైద్య విద్య అర్హత లేదా రాష్ట్ర అలోపతి మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు అయిన లేదా నమోదుకు అర్హత సాధించిన లేదా అలోపతి వైద్యం చేస్తూ సబ్ క్లాజ్ లేదా సబ్ క్లాజ్ వర్తించక రాష్ట్ర ప్రభుత్వం అజ్ఞ మేరకు మెడికల్ రిజిస్టర్‌లో పేరు నమోదు పొందిన వ్యక్తి అని నిర్వచనం. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ 1956 సవరణ ప్రకారం ఆర్.ఎం.పి. గ నమోదు చేసికొనటానికి బాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బాచిలర్ ఆఫ్ సర్జరీ (ఎం.బి.బి.ఎస్.) కనీస అర్హతగ నిర్ణయమైంది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ప్రభుత్వ గుర్తింపు పొందిన, విశ్వవిద్యాలయానికి అనుబంధమైన, భారతీయ ఆయుర్విజ్ఞాన్ పరిషద్ (Medical Council of India) ఆమోదం పొందిన వైద్యకళాశాలలో ఎం.బి.బి.ఎస్. పట్టా పొంది బోధనా వైద్యశాలలో అభ్యాస శిక్షణ పూర్తి చేసికొని స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేయించు కొనిన వ్యక్తిని రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్.ఎం.పి.) అంటరు. కాని, ఆర్.ఎం.పి. కాని వారు, అర్హతలు లేని వారు ఆర్.ఎం.పి., పి.ఎం.పి. అక్షరాలను తమ పేర్ల చివర తగిలించుకొంటున్నరు.

**పేరులో పెన్నిధి నవల – అనుశీలన :** హాస్పిటల్ ఫార్మసిస్ట్‌ల మీద వచ్చిన ఒకే ఒక నవల 'పేరులో పెన్నిధి'. వూళ్ల విశ్వనాథ స్వామి కి ఇది తొలి రచన అయినప్పటికి ఎక్కడా పాఠకుడు పసి కట్టలేడు. ఫార్మసిస్ట్‌గ జీవిత అనుభవాలు, ఘటనలను పాఠకునికి ఉద్వేగాన్ని, సహానుభూతిని, అవగాహనను కలిగించే విధంగ వ్రాస్తడు. ఇందులో కథానాయకుడు విజయ్‌కుమార్ ఫార్మసీ డిప్లమా చదువుకొంటడు. విజయ్ కుమార్ పాఠశాల సహాధ్యాయి గీత. వీరిద్దరి నడుమ ప్రేమను రమ్యంగా రచించి కథను నడిపిస్తడు, పాఠకుని మురిపిస్తడు.

లాభాల బాటలో నడుస్తున్న గీతా ఫార్మస్యూటికల్ ఇండస్ట్రీస్ యజమాని 'విజయ్‌కుమార్ తన ఆఫీస్ గదిలో కూర్చొని అకౌంట్స్ చూసుకొంటున్నాడు' వాక్యంతో నవల మొదలు పెట్టి మొదటి అంకాన్ని ఒక్క పుటలో క్లుప్తంగా ఆపేస్తడు. రెండవ అంకంలో విజయ కుమార్ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్న నాటి నుంచి ఒక్కొక్కసారి బాల్యంలోనికి తొంగి చూస్తూ కథ అంకాల వారిగ ఒక వరుసలో సాగుతది.

కథా నాయకునికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ ఉ ద్యోగం వస్తది. దూర రాష్ట్రంలో ఉండే తండ్రికి ఉత్తరం వ్రాసి పోస్ట్ చేసి తిరిగి వస్తున్నడు. అప్పుడు ఊరి సర్పంచ్ ఎదురై "ఏం ఓయ్! కంపౌండర్ ఉద్యోగం వచ్చిందట" అని పలుకరిస్తడు. తనకు తల దించినట్లు అయితది. అప్పుడు అక్కడ మొదలైన సంఘర్షణ చివరి దాక అడుగడుగున కొనసాగుతనే ఉంటది. తనను ఇలాగున పిలుస్తరని తెలిసి ఉంటే తను ఈ డిప్లొమా చదివి ఉండేవాడు కాదు. ఫార్మసీ చదువుకొన్నప్పుడు గొప్ప అభిప్రాయంతోనే ఉన్నడు. దేశంలో విద్యావంతుల శాతం పెరుగుతున్నదే కాని, ఆ విద్యావంతులు ఎలా పిలువాలో తెలిసి కూడా తెలియనట్లు పిలుస్తున్నరు. కొందరికి తెలియక, మరికొందరికి తెలిసి అలా పిలుస్తున్నరు. తను పాసైన సర్టిఫికెట్‌లో కంపౌండర్ అని లేదు. తనకిచ్చిన పోస్టింగ్ ఆర్డర్‌లో

కంపౌండర్ అని లేదు. ఐనా వీల్లంతా ఎందుకలా పిలుస్తున్నరు? అని మథన పడుతడు.

ఉద్యోగంలో చేరటానికి పోతే అక్కడ ప్యూన్‌తో "నాకిక్కడ ఫార్మసిస్ట్‌గా వేశారు" అని చెప్పినప్పుడు "ఫార్మసిస్ట్ అంటె కంపౌండర్ అన్న మాట! కంపౌండర్ లేక మేం ఇక్కడ చస్తున్నం అనుకోండి" అంటడు. మెడికల్ ఆఫీసర్ కూడా తోటి మెడికల్ ఆఫీసర్‌కు తనను పరిచయం చేస్తూ 'ఈయన మన కొత్త కంపౌండరు' అని చెప్పుతడు. నమస్తే అని రెండు చేతులు జోడించిన కథా నాయకుడు 'సార్ మీరేమీ అనుకోకపోతె ఒక విషయం చెప్పాలనుకొంటున్నాను. 'నన్ను కంపౌండర్ అని పిలువవద్దు. నా పోస్టింగ్ ఆర్డర్‌లో ఫార్మసిస్ట్ అని ఇచ్చారు. నేను చదువుకొన్నది ఫార్మసీ డిప్లొమా' అని మెల్లగా అంటిస్తడు. అట్లా మొదలైంది అతని పోరాటం. అక్కడ పని పరిస్థితులు చూసి శిక్షణ కాలంలో 'ఎందుకు వచ్చావయ్యా ఈ ప్రొఫెషన్‌కి' అన్న హెడ్ ఫార్మసిస్ట్ మాటలు పదే పదే గుర్తుకు వస్తుంటయి. రాజకీయ పదవిలో ఉన్న ఒక వ్యక్తి దురుసుతనం నచ్చక, అధికారుల నైతిక మద్దతు లేక ఉద్యోగానికి రాజీనామా చేస్తడు.

రెండు నెలలలో రైల్వే ఫార్మసిస్ట్ ఉద్యోగం వస్తది. చేరుతడు. అక్కడ కూడా కంపౌండర్ అని పిలుస్తున్నరు. వార్డ్‌బాయ్‌లను కూడా కంపౌండర్ అని పేషంట్‌లు పిలుస్తున్నరు. హాస్పిటల్‌లో పనిచేసే మగ వాల్లందరిని కంపౌండర్, తెల్ల చీర కట్టుకొన్న ఆడ వాల్లందరిని సిస్టర్, స్టెతస్కోప్ పట్టుకొని తిరిగే వాల్లను డాక్టర్ అంటున్నట్టు అర్థం అయింది. పని భారం ఎక్కువగా ఉంటున్నది. రోజు రెండు మూడు వందల మందికి మందులు ఈయవలసి వస్తున్నది. కొందరు మెడికల్ ఆఫీసర్‌ల వ్రాత అర్థం కాదు. ఒక మందుకు మరొక మందుకు పొసగని ప్రిస్క్రిప్షన్ వస్తది. మందులు వాడే విధానం చెప్పినప్పుడు మనసు పెట్టక తరువాత కొత్తగ మల్ల అడుగుతరు. మూత్రం గోలి రాత్రి వేసికొన్నా, నిద్ర మాత్ర పగలు వేసికొన్నా సమస్య. ఈ మందులు ఎందుకు పని చేస్తయి అని అడుగుతరు, వీల్లకు ఏ పాటి తెలుసో పరీక్ష చేద్దామని. పాత ప్రిస్క్రిప్షన్ తెచ్చి మందు ఈయమంటరు. ప్రిస్క్రిప్షన్ లేకుండ మందులు అడుగుతరు. మెడికల్ ఆఫీసర్‌లు స్టోర్స్ ఇన్‌చార్జ్‌గ ఉంటరు. అధికారం వాల్లది. ఫార్మసిస్ట్ జవాబుదారు. బి.ఫార్మ్., ఎం.ఫార్మ్. చదివినా కంపౌండర్ అనే అంటున్నరు. బయట ఆర్.ఎం.పి.లు నయం. అందరు డాక్టర్ అని పిలుస్తరు. ఎదుగుదల లేని ఉద్యోగం. రైల్వేలో ఇంజనీరింగ్ డిప్లొమా వాల్లకు ఉన్నట్టు ఫార్మసీ డిప్లొమా వాల్లకు పదోన్నతులు లేవు. ప్యూన్‌గ జాయిన్ అయి ఉన్నతాధికారులుగ ప్రమోషన్ పొందినవాళ్ళు ఉన్నరు. మనశ్శాంతి లేదు. ఒకరోజు పని ఉండి మెడికల్ ఆఫీసర్ గదికి పోతడు. అక్కడ ఆయన ఒక వ్యక్తికి మందులు వ్రాసి 'కంపౌండర్ దగ్గరికెల్లి మందులు తీసికొని నన్ను కలువు' అని చెప్తడు. కోపం వచ్చిన విజయ కుమార్ 'ఫార్మసిస్ట్ అనలేరా సార్' అంటె చిన్న నవ్వు సమాధానంగ వచ్చింది. 'మరెప్పుడు మమ్మల్ని అట్లా పిలువకండి', అని బయటికి వస్తడు.

బి.కాం. చదివిన తమ్మునికి బాంక్ ఉద్యోగం వచ్చింది. చెల్లె పెండ్లి కుదిరింది. చెల్లె పెండ్లికి పోతె, బాంక్ ఉద్యోగం అని తమ్మునికి పెండ్లి సంబంధాలు వస్తున్నయి. నీకు కూడ సంబంధం చూసి పెండ్లి చేద్దాం అని బలవంత పెట్టుతరు తల్లి తండ్రులు. మధ్యవర్తి ద్వార ఒక సంబంధం చూడటానికి పోతరు. ఆ ఇంటి ముందు డాక్టర్ లక్ష్మీరావు ఆర్.ఎం.పి. అని పెద్ద బోర్డ్ ఉంటది. ఏ నర్సింగ్ హోం లోనో చేరి కొంత పని నేర్చుకొని సొంత ప్రాక్టీస్ పెట్టుకొని డాక్టర్ అని బోర్డ్ పెట్టుకొంటున్నరు. పిల్ల అన్న విజయ్‌ను ఏం చేస్తావని అడుగుతడు. ఫార్మసిస్ట్ అని చెప్పుతడు. అర్థం కాక పోతె వివరిస్తడు. కాని ఆయన 'ఒహో కంపౌండర్ అన్న మాట' అంటడు. 'కాదు, ఫార్మసిస్ట్', అని ఎంత చెప్పినా తన తండ్రి దగ్గర పని చేసే సహాయకునితో పోల్చుతడు. అవమానంతో లేచి రావలసి వస్తుంది. తన ఫార్మసీ క్లాస్ మేట్స్ కొందరు ఇతర కోర్స్‌లు చదివి గౌరవం లభించే వేరే వృత్తి లోనికి మారే ప్రయత్నం చేస్తున్నరు.

చిన్ననాటి స్నేహితురాలు గీత వాల్ల నాన్న ఉపాధ్యాయుడు. బదిలీపై వేరే దూర ప్రాంతం పోయినందున వాల్ల ఆనుపానులు తెలువ లేదు. ఒక మిత్రుని ద్వార తెలిసికొని కలుసుకొంటడు. గీత తండ్రి గుండెపోటుతో మరణించినట్టు తెలిసి బాధ పడుతడు. గీత నర్సింగ్ కోర్స్ పూర్తి చేసింది. రెండు మూడేండ్లు విదేశాలకు పోయి డబ్బు సంపాదించుకొని రావాలని ఆమె ఆలోచన. అవకాశం కలిసి వచ్చి దుబాయి పోతది.

విజయ్ కుమార్ ఫార్మసిస్ట్ సంఘాలలో చురుకుగ పాల్గొంటడు. దిల్లీ పోతడు. ప్రయాణంలో రకరకాల వ్యక్తుల పరిచయాలు. వాల్లు ఫార్మసిస్ట్ అంటె కంపౌండర్ అంటరు. దేశం పలు ప్రాంతాలు, పలు సంస్థలలో చేస్తున్న ఫార్మసిస్ట్‌ల పరిచయాలు కలుగుతయి. దిల్లీలో ఉద్యమం చేస్తరు. చూసే ప్రజలు వీల్లకు కూడ కోర్కెలు ఉంటయా అనుకొంటరు. సినిమాలు, టీవిలలో కంపౌండర్ పాత్రలు పెట్టి హేళనగ చూపెడుతున్న దర్శకులకు, నిర్మాతలకు ఉత్తరాలు వ్రాస్తడు. ఒక తెల్లవారి గట్ల విజయ్‌కు కల పడుతది. ఆ కలలో ఫార్మసిస్ట్ లందరు వరుసగ నిలబడి మేము కంపౌండర్‌లము కాదు ఫార్మసిస్ట్‌లం! అనే బోర్డ్‌లు మెడలో వేలాడుతుంటయి.

ఊరిలో ఇంజెక్షన్ వికటించి తల్లి మరణం. ఆ మెడికల్ ప్రాక్టీషనర్‌కు ప్రత్యామ్నాయ వైద్యంలో ఏదో సర్టిఫికెట్ ఉన్నదట. చేసేది అలోపతి వైద్యమే! తమ్ముడు పోలీస్ కేస్ పెట్టుదామంటె వద్దంటడు. అర్హులైన వారు అందుబాటులో లేనప్పుడు ఉన్నవారిని బెదరగొట్టి గ్రామస్తులకు ఆ మాత్రం సేవలను దూరం చేయొద్దు అంటడు.

డిపార్ట్మెంటల్ టెస్ట్ లు ఉత్తీర్ణుడైనందుకు తమ్మునికి పదోన్నతి లభిస్తది. ముందుగ ఉద్యోగంలో చేరినా తనకు అటువంటి అవకాశం లేనందుకు బాధ కలుగుతది.

గీత విదేశం నుంచి వచ్చి వాళ్ల పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఉద్యోగం చూసుకొంటది. విజయ్ కూడా ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చి ఇక్కడి హాస్పిటల్‌లో ఉద్యోగం పొందుతడు. ఆడంబరాలు లేకుండా పెండ్లి చేసికొంటరు. కాని, ఇక్కడా ఉద్యోగంలో ఇదే అవమాన పరంపర. గీత తెచ్చిన డబ్బులు ఇచ్చి ఫార్మసీ పరిశ్రమ పెట్టుమని ప్రోత్సహిస్తది. పరిశ్రమ మంచిగ నడుస్తున్నది. కొందరికి ఉపాధి కల్పించగలుగుతున్నడు. అయినా, విజయ్ కుమార్ హాస్పిటల్ ఫార్మసిస్ట్‌ల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నడు. ఇట్లా నవలకు శుభం పలుకుతడు రచయిత.

ఫార్మసిస్ట్ ఒక ప్రొఫెషనల్. కాని, బయట సమాజం మరియు వైద్య వ్యవస్థలోనూ ఫార్మసిస్ట్‌ను ఒక సహాయకుడుగ చూస్తున్నరు. ఒక వృత్తి పట్ల సమాజ దృష్టి కోణం (Social Perspective), వృత్తిదారులు భావించే సమాజ ప్రతిరూపం (Social Image) పొసగక పోవచ్చు. అప్పుడు వృత్తిదారులలోని స్వీయబింబం (Self Image) నకు సమాజ ప్రతిరూపం తో ఘర్షణ జరుగుతది. సమాజ ప్రతిరూపంను స్వీయ బింబంనకు దగ్గరగా మార్చాలనే తపనయే ఆ ఘర్షణ. ఈ నవలలో అంతటా ఆ ఘర్షణ కనిపిస్తది. ఈ నవల పాఠకులకు ఫార్మసిస్ట్‌లు అంటె ఏమిటో తెలిపి ఫార్మసిస్ట్‌ల గౌరవాన్ని పెంపొందించటానికి తప్పకుండా తోడ్పడగలదు.

❖ ❖ ❖ ❖ ❖

# గీతా శతకము

దేనిని తెలియగా భువి తెలియదగిన
మరొక టేదియు నుండదో సరిగ నదియె
జ్ఞాన మనుభవ పూర్వకమైన దాని
వినుము పార్థ! గీతాబోధ విమల మతిని!

మేటి ముక్తికై యత్నించు కోటికొకడు
అట్లు యత్నించు వారల యందు నాదు
తత్త్వ మెరుగుదు రొకరె యథార్థముగను
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

భూమి జలమగ్ని వాయువు వ్యోమములును
మనసు, బుద్ధ్యహంకారము లెనిమిదియును
నాదు అపరా ప్రకృతియంచు నయము నమ్మి
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

ఇల పరాప్రకృతి ధరించు నీ జగమ్ము
జీవరూపమై, దైవ స్వభావ మగుచు
దేహమును చేతనము గలదిగను జేయు
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

ఈ పరాపర ప్రకృతులే ఎల్ల భూత
ములకు జనన విషయమగు మూలమయ్యె;
నావలననె జగతి పుట్టి నాశమొందు;
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

నాదు మహిమమ్మునకు సరి లేదు జగతి
గొప్పకా దేది నాకన్న కువలయాన;
దారమున మణులవలె నాధారపడుచు
కూడి జీవులు నాయందు గ్రుచ్చబడెను;
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

జలమునందు రుచిని, రవి శశుల, కాంతి;
నన్ని శ్రుతులను నోంకార మగుచు నుంటి;
మిన్ను సద్దును, గంధము మన్ను నందు
పురుషులను పౌరుషము, తేజముగను నగ్ని
ప్రాణులన్నింట నే నుందు ప్రాణముగను;
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

అన్ని ప్రాణుల శాశ్వతమైన మూల
బీజమును నేను, ధీరుల తేజ మేను,
బుద్ధిమంతుల యందుండు బుద్ధి నేను,
బలముగలవారి ధార్మిక బలము నేను,
మహిని జీవుల ధర్మకామంబు నేను,
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

సాత్త్వికము, రాజసము, తామసము గుణముల
కలుగు నావల్ల నని నీవు తెలిసికొనుము;
ఆ గుణమ్ములు నా వశమందు నుండు;
నేను త్రిగుణమ్ముల కతీతు డైన వాడ;
వినుము పార్థ! గీతాబోధ విమలమతిని!

**(ప్రయాగ వేంకట గోపాలకృష్ణ సత్యనారాయణ శాస్త్రి గారి గీతా శతకము, ద్వితీయ షట్కము నుండి)**

# పాల్కురికి సోమనాథుని కృతులు – పరిశీలన


**ఘట్టమరాజు**, ఫోన్ : 99640 82076

ఆదికవి నన్నయభట్టు శ్రీకారం చుట్టిన మార్గకవితా సంప్రదాయానికి భావము, వస్తువు, రచనారీతుల్లో భిన్నమైన, విలక్షణమైన, వైవిధ్యభరితమైన దేశికవితా సంప్రదాయానికి పునాది వేసిన పుణ్యశ్లోకులు శివకవులు. నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, యథావాక్కుల అన్నమయ్య, పాలకురికి సోమనాథుడు ఈ కొత్త బాట వేసి తలెత్తి నడిచిన సాహితీ తపోధనులే. వీళ్లందరి పైకి పాలకురికి సోమనాథుడు తలమానికం లాంటివాడు. దేశికవితకు రూపురేఖలు దిద్ది, ఇంపు సొంపులు సంతరించి పెట్టినది ఈ మహాభాగుడే. ఈ మహనీయుని ప్రతిభాసంపత్తిని వేనోళ్ల చాటిన పండితాగ్రణులు వేటూరి ప్రభాకరశాస్త్రి, డా. చిలుకూరి నారాయణ రావు, శివశ్రీ బండారు తమ్మయ్య, నిడుదవోలు వెంకటరావు మొదలైనవాళ్లు.

ప్రాచీన తెలుగు కావ్యనిధిని శ్రీమంతం చేసిన శివకవుల గూర్చి మన విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసిన విద్వాంసుల్లో పేర్కొనదగిన వారు డా. జీరెడ్డి చెన్నారెడ్డి, డా. తిమ్మావజ్జల కోదండరామయ్య ప్రభృతులు. వీళ్ళ ప్రబుద్ధ పరిశోధనా గ్రంథాల్ని చదివి, అవగతం చేసుకొని ముందడుగు వేసిన పరిశోధకులు ఏ కొందరో. శివకవుల గురించి జరిగిన పరిశోధనలు ఎన్నో యం.లిట్, యం.ఫిల్, పిహెచ్.డి., డి.లిట్ పట్టాలు పొందాయే కాని, వెలుగు చూసినవి కొన్ని మాత్రమే. దీని వల్ల తెలుగు పరిశోధనకు జరిగిన నష్టాలు రెండు. పసగలిగిన పరిశోధన గ్రంథాలు అముద్రితంగానే వుండిపోయినందువల్ల, వాటి సుప్రయోజనాలకు భావి పరిశోధకులు దూరమవడం మొదటిది. ఆ ముద్రిత గ్రంథాలే కొంతవరకు ఇతర ఉపపరిశోధకుల వల్ల పునరావృతం కావటం రెండోది. ముద్రిత సిద్ధాంత గ్రంథాల్ని కూడా మక్కీకి మక్కీగా రాసి పిహెచ్.డి., డిగ్రీలు పొందిన ప్రబుద్ధులు కూడా లేకపోలేదు.

ఈ సందర్భంగా 'పాలకురికి సోమనాథుని కృతులు– పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథం రాసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1973లో మరణోత్తర పిహెచ్.డి., పట్టా పొందిన డా. వేణుముద్దల నరసింహారెడ్డి గారిని స్మరించడం అవసరం. డా. రెడ్డిగారి ఈ పరిశోధనా గ్రంథంలోని తొలిభాగం 1993 లో హైదరాబాద్ లోని జాతీయ సాహిత్య పరిషత్తు ప్రచురించింది. కాగా వరంగల్లు లోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ 2021లో ప్రకటించి తెలుగు విద్వాంసుల, పరిశోధకుల మన్ననకు పాత్రమయింది. ఈ పుస్తకం ఇప్పుడిప్పుడే సాహితీ ప్రియుల చేతుల్లోకి వస్తూండటం విశేషం.






డా. వేణుముద్దల నరసింహారెడ్డి గారి పరిశోధనా గ్రంథం – 'పాలకురికి సోమనాథుని కృతులు– పరిశీలన' లో 43 అంశాల గురించి వివరణ, చర్చలు పాఠకులకు అందుతాయి 'అనుబంధములు' శీర్షిక కింద శాసనాలు, బాణగద్యాదులు, చతుర్వేదసారము – అధిక పద్యములు, సామెతలు– జాతీయములు వగైరా విషయాలు చూడగలం.

డా. వే. నరసింహారెడ్డి గారి గ్రంథ ప్రారంభమే 'యుగకర్త పాల్కురికి సోమనాథుడు' అనే అంశం. కొందరు విద్వాంసులు తెలుగు సాహిత్య చరిత్రలో 'శివకవి యుగము' ను ప్రత్యేకంగా పేర్కొన్నటాన్ని గ్రంథకర్త ఆక్షేపించారు. 'వీరశైవ కవి యుగ' మంటే నన్నెచోడుడు, యథావాక్కుల అన్నమయ్యలు ఆ పరిధిలోకి రారని భావించారు. 'తాత్త్విక సిద్ధాంతము ననుసరించి విభజించిన వారిని శివాద్వైత కవులనవలెను. (పేజి: 4) అన్నమాట కూడా చర్చనీయాంశమే. 'అనువాద యుగమున నవతరించి తెనుగు సాహిత్యమున స్వతంత్ర కావ్య నిర్మాణ యుగమునకు శ్రీకారము చుట్టినవాడు యుగకర్త పాల్కురికి సోమనాథుడు. (పై పేజీనే) రెడ్డిగారి ఈ అభిప్రాయం అందరూ అంగీకరించినదే.

నరసింహారెడ్డి పాలకురికి సోమన కాలం గురించి రెండు వాదాలున్నాయన్నారు. సోమనాథుడు 1160–70 ప్రాంతంలో పుట్టి 1230–40 అవధిలో శివైక్యం చెందాడన్నది మొదటి వాదం. ఇక రెండవ వాదం ఏమిటంటే ఆయన 1260–70 మధ్యలో జన్మించి 1330–40 దాకా జీవించి వున్నాడన్నది (పేజి: 6) రెడ్డిగారు సోమన్న కావ్యంలోని దేశీపదాల్ని పరిశీలించి ఆ మహనీయుడు 1160–1240 నాటి వాడిగా భావించారు. (పేజి : 61) సోమన జన్మస్థానం గురించి విద్వాంసుల మధ్య జరిగిన వాదవివాదాల్ని ఆవేశరహితంగా, నిష్పక్షపాతంగా అతను వరంగల్లు జిల్లా లోని జనగామ తాలూకాకు

చెందిన పాలకుర్తి వాడేయని నిర్ధారించారు. సోమనాథుడు శివైక్యం పొందిన స్థలం కర్నాటకలోని తుమకూరు జిల్లా లోని కల్య అనే పల్లె. దీన్ని డా. నరసింహారెడ్డి బెంగళూరు జిల్లాలోని గ్రామంగా పేర్కొనడం పొరపాటు (పేజి: 90)

డా. వేణుముద్దల నరసింహారెడ్డి పాలకురికి వారి జీవితము – సాహిత్యము కృతులకు సంబంధించిన సామగ్రిని విపులంగా సేకరించి, పరిశీలించారనటంలో అనుమానం లేదు. కాని సోమన కావ్య సౌందర్యాన్ని విశ్లేషించడం పట్ల చాలినంత శ్రద్ధ కనపరచక పోవడం విచారకరం వి. నరసింహారెడ్డి 'వృషాధిపశతకము' గురించి 16 పేజీల (పేజి :129–143) రాసినారే కాని పాల్కురికి భక్తి తీవ్రతను, సంబోధనా వైవిధ్య వైశిష్ట్యాన్ని, దేశిపద సౌందర్యాన్ని వివరించే ప్రయత్నం చేయకపోవడం ఆశ్చర్యకరం. అయితే 'పదకవిత' (పేజి: 150–170) లో పర్వత పదములు, వెన్నెల పదములు, సంజవర్ణన పదములు ఇత్యాదిని ఉటంకించి, వివరించిన డా. వేణుముద్దల వారిని ప్రశంసించాల్సింది. వీరి 'ద్విపద' అంశం (పేజి:171–191) ఛందస్సంబంధమైన విషయాన్ని అందించి నంతగా ద్విపద రామణీయకాన్ని, ఇంపు సొంపుల్ని ప్రకటించక పోవడం చూస్తే పరిశోధకులకు కావ్య సౌందర్యంపట్ల అంత ఆసక్తి వున్నట్లు కనబడదు.

డా. నరసింహారెడ్డి 'బసవపురాణము' గూర్చి చేసిన 23 పేజీల (పే.192–214) వివేచన లో బసవన జీవితం, ఉద్యోగం, సమకాలికుల వృత్తాంతాలు తెలియజేయబడ్డాయే కాని 'బసవపురాణము' లోని రసచర్చకాని, వస్తు వైశిష్ట్యం కాని, దేశిపదాల సొబగు కాని గ్రంథకర్త దృష్టికి ఆనలేదనే చెప్పాల్సి వుంటుంది. సోమన 'పండితారాధ్య చరిత్ర' పరిశీలన 'బసవపురాణము' పరామర్శ కంటే కొంత లోతైనదిగా కనబడుతుంది. 'సోమనకు గల లాక్షణిక దృష్టి' అనే వివేచనలో గ్రంథకర్త సోమనను 'రసప్రాధాన్యవాది' గానూ, కొంతవరకు ధ్వనివాది గాను పేర్కొన్నా, ఆ కవీశ్వరుని రస, ధ్వని దృక్పథాల్ని సోదాహరణ పూర్వకంగా చర్చించక పోవడం గమనించాల్సిందే.

పాలకురికి సోమన జూదము, వేటల్ని వర్ణించిన మొదటి తెలుగు కవి అన్న డా. రెడ్డిగారి మాట మెచ్చదగిందే. కవి మురుఘ నయనారు – అర్వై ముగ్గురు శివభక్తుల్లో ఒకరు – జూదమాడి, ప్రతిపక్షిని ఓడించి, అతను ద్రవ్య మివ్వక పోతే తీవ్రంగా బాధించి, అతనూ శివభక్తుడని తెలిసి కొని పశ్చాత్తాప పడతాడు. జూదంలో గెల్చిన ధనాన్ని శివభక్తులైన జంగమదేవర్లకే అతను అర్పించి వుండవచ్చు గాక

"జూదంబు నింద్యమే సూచింప శివ వి
నోదంబు గాగ నివేదింప గనిన" (పేజి: 381) అన్న సోమనాథుని తీరు సమర్థింపతగిందా?

"ఆర్మిలి వ్యసనార్థమై జూదమాడి
ధర్మజు ముఖ్యులు నిర్మూలమైరి
ఆదట భక్తి హితార్థంబు గాగ
జూదమాడిన మూరు శూలి గూడదండె" (పం. పురాతన 413–414 పేజీలు)

కాని డా. వే. నరసింహారెడ్డి "వ్యసన మయిన జూదము నిట్టి మహోన్నత భక్తి తత్వముతో సమన్వయించి వర్ణించుట నా భక్తు లాదృష్టితో చేసిరో లేదో తెలియదు కాని సోమన సమన్వయించిన తీరు మాత్ర మద్భుతముగా నున్నది. కావ్యగతమైన వర్ణనలకు కావ్యము నందలి కథకు పొత్తుండ వలయునను నౌచిత్యమును సోమన బాగుగా పాటించినాడు. (పేజి: 381) గ్రంథకర్త పైవిధంగా కవికి నివాళులర్పిస్తూ, అంతటితో "ఔచితీ పరిపోషణ చేసినవాడు" (పేజి: 382) అని కీర్తించడం ఔచితీశోభితం కాదు డా. నరసింహారెడ్డి శిశు. మాతృ మనస్తత్వ వర్ణనల్లో అందెవేసిన చెయ్యి అని పాలకురికి కవీశ్వరుని సోదాహరణంగా ప్రస్తావించడం (పే. 383–386) శ్లాఘనీయం.

పరసతితో రతిక్రీడ చేస్తూ పరమానందాన్ని పొందిన ఒడయనంబి కథను శాంత రసాభి ముఖంగా మలిచిన సోమనాథుని ప్రతిభ అనితర సాధ్యమని భావించడం (పే: 428–429) విచిత్రంగా వుంది.

బసవపురాణము, పండితారాధ్య చరిత్ర కావ్యాల్లో పరిశోధకులు నిరూపించిన శాంతరస ప్రాధాన్యం మరికొంత విపులంగా, లోతుగా విశ్లేషింపబడాల్సి వుండింది.

గ్రంథకర్త సోమన నిరూపించిన వీరశైవమత స్వరూపాన్ని విశదంగా వివరించడం మెచ్చదగింది. సోమనాథుని కాలంనాటి సాంఘిక పరిస్థితుల్ని, ప్రజా జీవితంలోని నానా విధానాల్ని డా. నరసింహారెడ్డి కవి రచనల నుంచి చక్కగా పోగుచేశారు.

కొలతలు– మానములు, నాణ్యాలు, వాటి విలువలు పండుగలు– పబ్బాలు, జాతర్లు, బలులు, ఆత్మబలులు యాత్రికుల వేషభూషణాలు, మూఢవిశ్వాసాలు వగైరా విషయాల్ని, వివిధ జాతుల వారిని, సాధుసంతుల వివరాల్ని క్రోడీకరించిన వైనం ప్రశంసనీయం ఇంకా ఆనాటి ప్రజల వినోదాలు– వ్యసనాలు, దొంగతనము, ఆట పాటలు ఇత్యాదిని డా. వేణుముద్దల నరసింహారెడ్డి సోమన రచనల నుంచి చక్కగా గుదిగుచ్చటం మెచ్చదగింది. ఆకాలంనాటి సంగీత సంప్రదాయం, వాద్య విశేషాలు, గాయకుల గురించి సాధ్యమైనంత విషయ సామగ్రిని వివరించిన కృషి ఆధారంగా ఈ పరిశోధనా గ్రంథాన్ని పాలకురికి సోమనాథుని విజ్ఞాన సర్వస్వంగా భావిస్తే తప్పు కాదనుకొంటాను. పరిశోధకులు పాలకురికి కావ్య గుణాలతో పాటు దోషాల్ని కూడా చర్చిచడం ఆయన సమతౌల్యాన్ని ప్రదర్శిస్తుంది.

పాలకురికి సోమన్న కవితా ప్రభావం తర్వాతి కవులపై ప్రసరించిన వైనాన్ని గ్రంథకర్త స్థూలంగా చెప్పి, తర్వాతి పరిశోధకులకు ప్రేరణ కల్పించడం ముదావహం. 'అనుబంధము' లో గ్రంథకర్త క్రోడీకరించిన శాసనాలు, బాణగద్యాదులు, సామెతలు

–జాతీయాలు నరసింహారెడ్డి పరిశోధనా ప్రీతిని, చిత్తశుద్ధిని ప్రకటిస్తాయి.

వేణుముద్దల నరసింహారెడ్డి గారి సిద్ధాంత గ్రంథం విపులమైనదీ, విషయ సంపన్నమైనదీనూ, కాని ఆయన రూపొందించిన 'విషయ సూచిక' అస్తవ్యస్తంగా వుండటం మాత్రం చింతాజనకం. పాల్కురికి సోమనకు ముందున్నట్టి తెలుగు కవితా సంప్రదాయం, సోమన జీవితం, రచనలు, వాటి వర్గీకరణ, విశ్లేషణను వివిధ శీర్షికల కింద పరిశీలించి వుంటే సిద్ధాంత గ్రంథానికొక సౌష్ఠవం రూపొంది వుండేది. పర్యవేక్షులు, సలహాదారులైన విద్వాంసులు పరిశోధకునికి సముచితమైన మార్గదర్శనం కలిగించి వుంటే ఈ థీసిస్సుకు మరింత సొబగు, పటిష్ఠతలు లభించివుండేవి.

(పాలకురికి సోమనాథుని కృతులు – పరిశీలన. గ్రంథకర్త : డా. వేణుముద్దల నరసింహారెడ్డి, పేజీలు : 789. వెల : 1000/– ప్రతులకు: సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ 1–7–1047. హంటర్ రోడ్ హనుమకొండ వరంగల్లు – 506001.

# 'ముఖీలు'తో ముఖాముఖి

**డా. పి. విజయ కుమార్,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ఫోన్ : 990 805 9234

**ముఖీలు – నామౌచిత్యం**

కవిత్వం సామాజిక చైతన్య స్వరూపం. కవితా స్వరూపం బహుముఖీనం. ఆధునిక కవితా స్వరూపంలో ఎన్నో వినూత్న ప్రక్రియలు విరాజిల్లాయి. ముఖపుస్తకం ద్వారా పంచబద్ధ మినీ కవితలను 'ముఖీలు' గా నామకరణం చేసి తెలుగు సాహిత్యానికి మరో ప్రక్రియను పరిచయం చేశారు ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి. సాహిత్యం రచయితను రసవంతం చేసే కవిత్వం కవిని ప్రగతిబాటలోకి తెచ్చిన వైనం 'నాలోనువ్వు'లోని మినీ కవితలో సాక్షాత్కరించింది.


ఏ తరంలోని సాహిత్యమైనా తన కాలపు ఆలోచనా స్వభావాలను ప్రతిబింబిస్తుంది. ఒక యుగం వెనకటి యుగపు సాహిత్య ప్రమాణాలను గుడ్డిగా అనుసరించదు. అది వర్తమాన కాలం నుండి ఆవేశాన్ని పొందుతుంది. అలానే నవీన సమాజంలో నిరంతరం జరుగుతున్న అనేక పరిణామాలు, పరిస్థితులు, సంఘటనలకు ప్రతిస్పందిస్తూ సమాజానికి ఎక్కుపెట్టిన అక్షరాస్త్రాలే 'ముఖీలు'!. 'నాలో నువ్వు' అంటే ఇదేదో ప్రణయ కావ్యం అనుకోవచ్చు. కాని ప్రపంచాన్ని తనతో సమన్వయించుకొని స్పందించిన అక్షరాస్త్రాలే ఈ 'ముఖీలు'.

**సామాజిక స్పృహ – మనోధర్మ ప్రేరణ**

సమాజం పట్ల అభిమానం, మానవీయతా విలువలు కల్గిన కవి మనోధర్మప్రేరణగా బాధ్యత వహించి తనంతట తానుగా సామాజిక పరివర్తినకు దోహదం కల్గిస్తాడు. సమాజ పరిణామక్రమంలో మార్పును ఆకాంక్షిస్తాడు. సమాజ స్థితిగతులను పూర్తిగా అవగాహన కల్గిన కవి కాబట్టి రాజకీయాలు, విద్య, ప్రాంతీయ అస్తిత్వం, వ్యక్తిత్వ నిర్మాణం, మతం, చైతన్య ప్రబోధం మొదలగు అంశాలపై వాస్తవిక కోణంలో ఆవిష్కరించిన సత్యాలు 'ముఖీలు'లో ప్రతిధ్వనిస్తున్నాయి.

మనిషిలోనే రెండు పరస్పర విరుద్ధ కోణాలుంటాయంటారు. ఆ రెండు కోణాల మధ్య సమన్వయం సాధిస్తుంది ఆలోచన. ఆ రెండు ప్రపంచాల మధ్య వారధి కడుతుంది కవిత్వం. అది ఏ ప్రయోజనాలను కాపాడుతుందనేది పాఠకుడు నిర్ణయించుకుంటాడు. సమాజపరిణామ క్రమమే పర్యవసానంగా, సామాజిక శ్రేయస్సు పరమావధిగా కవి కలం కదిలించాడు.

సమాజం, సమాజానికో చరిత్ర, ఆ చరిత్రకో పరిణామక్రమం, ఆ పరిణామక్రమాన్ని వేగవంతంగా నడిపించేవాడే కవి. సమకాలీన సమస్యలకు స్పందించి రాయాల్సిందే కవిత్వం. సమకాలీన సమాజంలో జరుగుతున్న పరిణామాలను వాస్తవిక కోణంలో ఆవిష్కరించిన తీరు ఈశ్వరరెడ్డి కవిత్వంలో కనిపిస్తుంది.




**దారిచూపే నయనం – మేలుకొరే గమనం**

ప్రశ్నించే తత్త్వం, నిజాన్ని నిర్భయంగా చెప్పడం, ముక్కుసూటి తనంగా వ్యవహరించడం కవి వ్యక్తిత్వానికి సంబంధించిన అంశమైతే; ఆ వ్యక్తిత్వమే ముఖీలలో ముఖ్యంగా సామాజిక బాధ్యతగా ప్రతిస్పందించిన తీరు కనిపిస్తుంది.

ప్రశ్న / ప్రగతికి
పునాది! / అవసరం
సృజనకు మాతృక'!

తప్పును ప్రశ్నించినపుడే సమాజానికి ప్రగతి సాధ్యమవుతుంది.

మేధావి మౌనం ప్రగతికి అవరోధం అనే భావన ద్యోతకమవుతుంది. ఎవరో ఏదో చేస్తారని ప్రశ్నించడం మానేస్తే సమాజ అభ్యుదయానికి అవరోధం ఏర్పడుతుంది అనే కోణంలో కవి కలం కదిలింది. నిత్యం చెమటపూలతో అవనిని ఆరాధిస్తున్న కర్షక, కార్మికులను నాగరికతా నిర్మాతలని వారే పుడమి రథచక్రాలని అభివర్ణిస్తాడు. ప్రపంచంలో గొప్పగా చదవాల్సిందేదైనా ఉంది అంటే ముందు నిన్ను నువ్వు చదువుకొని, తరువాత సమాజాన్ని అధ్యయనం చేయాలి అనే భావన కవి తలంపుగా కనిపిస్తుంది.

తనకు తెలిసిందే / సర్వం అనుకునే వాడు అజ్ఞాని
ప్రపంచాన్ని / తెలుసుకున్నవాడు విజ్ఞాని !
ప్రపంచమే తెలుసుకోగల, / స్థితికి చేరుకోగలిగిన వాడు
నిజమైన జ్ఞాని!

సమాజంలో మూడురకాల మనుషులు అజ్ఞాని, విజ్ఞాని, జ్ఞానులుగా దర్శనమిస్తారు. ఈ తరహా స్వభావం, వ్యక్తిత్వం సహజంగా తారస పడుతూనే ఉంటాయి. తనను తాను తెలుసుకొని ప్రపంచమే తెలుసుకో గలిగిన స్థాయికి చేరుకోవడమే నిజమైన జ్ఞాని లక్షణం అంటాడు.

**'గతం భవిష్యత్తుకు పునాది'** అంటారు. గత అనుభవాన్ని వర్తమానానికి అన్వయిస్తే భవిష్యత్తు పటిష్ఠంగా ఉంటుంది. **"గతాన్ని విస్మరిస్తే వర్తమానం కుంటుతుంది! వర్తమానాన్ని తేలికగా చూస్తే భవిష్యత్తు మందగిస్తుంది!"** అంటాడు. త్రికాలాలను, పునాది, గోడ, పై కప్పులనే పదాలతో ప్రతీకాత్మకంగా ప్రయోగించాడు. ఏ కాలానికే అదే ధర్మంగా ప్రవర్తిల్లుతుంది అనే సత్యాన్ని ఆవిష్కరించాడు. దారి చూపే నయనం, మేలుకోరే గమనం, రచయిత వ్యక్తిత్వం వర్తమానంలో జీవిస్తూ భవిష్యత్తుకు పటిష్ఠ పునాది ఎలా వేయాలో తెలిసిన వ్యక్తిగా సమాజప్రగతి నిరంతర కాంక్షగా కవిత్వసృజన చేశారు. సహకారమే మన వైఖరైతే; ఉపకారమే మన ఊపిరైతే పేద గొప్ప భేదం పోయి, నీది నాదనే వాదం వెళ్ళిపోయి ఉన్నత సమాజం ఆవిర్భవిస్తుందనే భావన గమ్యమానమవుతుంది.

మెరుగు పెట్టకుండా వజ్రానికి, కష్టాలు ఎదుర్కోకుండా మనిషికి గుర్తింపురాదు. ఏ జీవితం ఒక గెలుపుతో మొదలు కాదు. ఏ జీవితం ఒక ఓటమితో ఆగిపోదు. జీవితంలో కష్టసుఖాలు, గెలుపు ఓటములు సహజమైనవే.

**చీకటి తెరలను / చీల్చుకొస్తేనే**
**సూర్యోదయం / సమస్యల సుడిగుండాన్ని**
**ఛేదిస్తేనే / జీవిత విజయం**
**కష్టసుఖాలు / జీవిత నాణానికి**
**బొమ్మ – బొరుసులు**

ప్రపంచంలో చీకటి అంతా ఏకమైనా ఒక్క దీపం వెలుగును దాచలేదు కదా. చీకటిని ఛేదిస్తేనే ప్రతి జీవితంలో ఉషోదయపు కాంతులు వెల్లివిరుస్తాయి. సమస్యల సవాళ్ళు విసిరినా, సమస్యల సుడిగుండాన్ని అధిగమిస్తేనే విజయం వరిస్తుంది. కష్టసుఖాలు అన్నవి జీవితమనే నాణానికి బొమ్మబొరుసులు అంటాడు. గెలుపు అందరికీ దొరకదు కాని గెలిచే శక్తి అందరిలో ఉంటుంది. ప్రయత్నమే మొదటి విజయంగా భావించాలి.

నిజాన్ని మార్చే శక్తి ఈ ప్రపంచంలో ఎవ్వరికీ లేదు. కానీ ప్రపంచాన్ని మార్చే శక్తి నిజానికి ఉంది. **"మాటల్లో నిజాయితీ, చేతల్లో నీతి, ఆర్తుల పట్ల జాలి ఉంటే నువ్వు భగవంతునితో సమానం"** అంటాడు. **"భయం, భయం బ్రతుకు భయం, అన్నా మనకీ లోకం పన్నిన పద్మవ్యూహం"** అంటాడొక కవి. పద్మవ్యూహంలో వ్యూహంతో జీవించడమే జీవితం. సమకాలీన సమాజంలో **"వెక్కిరింపులు, ఛీత్కారాలు, అవమానాలు, అణచివేతలు వెంటాడుతున్నాయా? భయపడకు, ఎదురించి చూడు సింహాసనం ఇచ్చి కూర్చోబెడతా యంటాడు."**

కొత్తభావాలు, కొంగొత్త ఆలోచనలు, సరికొత్త అభివ్యక్తీకరణ ఉంటేనే ఆ కవిత్వం చిరంజీవిగా నిలుస్తుంది. పాజిటివ్ థింకింగ్‌తో ఎంతో మంది యువతకు తన కవితలతో ప్రేరణ నివ్వడం కూడా ఈ ముఖీలలో గమనించ వచ్చు. ప్రతీకల నిజమవుతుంది ప్రయత్నమే ఉంటే. ఎదగాలనే ఆరాటం ముందు ఆటంకాలు నిలవవు. **"అడుగు అడుగు వెయ్యనిదే అంతరిక్షం అందేనా / పడుతూ పడుతూ లేవనిదే పసిపాదం పరుగులు తీసేనా / ప్రయత్నమే మొదటి విజయం ప్రయత్నమే మన ఆయుధం"** అంటాడొక సినీకవి. **"ఎంత దూరపు ప్రయాణం అయినా ఒక్క అడుగుతోనే ప్రారంభం. ఎంత పెద్ద లక్ష్యం అయినా చిన్న ప్రయత్నంతోనే ఆరంభం"** అంటాడు.

జీవనవికాసం "మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది" అన్నది ప్రసిద్ధమైన పలుకు. మౌనంగానే ఎదిగినా చెట్టు ఎప్పుడూ ఒదిగి కూర్చోదు. విస్తరించడం దాని సహజగుణం అంటాడు. దీనిని అనేక కోణాల్లో అన్వయించుకోవచ్చు. జ్ఞానపరిధి, ఆలోచనా పరిధి, చైతన్యపరిధి, సేవాపరిధి దేనినైనా విస్తరించుకోవచ్చని చెట్టుని ఆదర్శంగా తీసుకోవాలని ప్రతీకాత్మకతతో సంభాషించాడు. **"సంతోషాలు వస్తువుల్లో, దుఃఖాలు లేముల్లో ఉండవని మానసిక స్థితే సుఖదుఃఖాలకు పరమ ప్రమాణం"** అంటాడు. ఏదైనా మన ఆలోచనా స్థితిని బట్టి జీవన విధానం కొనసాగుతుంది. **"ఏమి తెలియని వాడు అంతా తెలుసంటాడు! కొంత తెలుసుకున్నవాడు నాక్కూడా తెలుసు అంటాడు. జ్ఞానం స్వభావం అంతే కదా!"** అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తాడు. ఏ పనినైనా నిన్నటి కంటే నేడు నాణ్యతా ప్రమాణాలతో బాధ్యతాయుతంగా విధిని క్రమశిక్షణతో నిర్వర్తించడమే దేశభక్తి అని స్పష్టం చేశాడు. **"ఏ చదువైనా జీవితాన్ని నిలబెట్టేదై ఉండాలి. ఎంత గొప్ప శాస్త్రమైనా సమాజానికి ఉపయోగపడేదై ఉంటేనే ప్రయోజనం కాని లేకపోతే వృథా"** అంటాడు.

సమాజంలో అందరూ కృషి ఫలితాన్ని శ్రమ, అదృష్టాలతో బేరీజు వేస్తాం. శ్రమ నిచ్చెన లాంటిది; అదృష్టం జారుడుబల్ల లాంటిది. **"శ్రమను నమ్ముకుంటే పైకి, అదృష్టాన్ని నమ్ముకుంటే కిందికి"** అంటాడు. "కృషితో నాస్తి దుర్భిక్షం" నువ్వు ఎదిగేటందుకు సరిమార్గం అన్న భావన ప్రస్ఫుటమవుతుంది. మనిషి కాలంతో పాటు మారాలి. కాలాన్ని మించిన గురువు గైడ్ ఇంకెవరుంటారు. కాలం అన్నీ నేర్పుతుంది. నేర్పిస్తుంది. **"మనిషి కాలంతో పాటు మారకపోతే కాలం చెల్లిన పురావస్తువులా మిగిలిపోతాడు"** అంటాడు. అయితే కాలెండర్ మారినంత వేగంగా కాలం (విలువలు) మారదు. పేజీలు మారినంత సులభంగా బతుకులు మారవంటాడు. బతుకులు మారాలంటే కాలంతో పాటు మనమూ మారాలి. అప్పుడే బతుకులు మారతాయి అన్నది గ్రహించాలి.

**విలువల నెలవు – విజ్ఞానకొలువు**

**"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకాని కొనుక్కో అన్నాడు"** కందుకూరి. పుస్తకాలే జీవనరేఖలను మార్చే భాగ్యప్రదాతలు.

**పుస్తకాన్ని పట్టుకుంటే / ప్రపంచాన్ని**
**దాటవచ్చు / పుస్తకం వదిలేస్తే**
**చీకటి సంద్రంలో / మునిగిపోవచ్చు**

పుస్తకాలే విజ్ఞాన వారధులు. గ్రంథ విజ్ఞానం అలవరచుకున్న వారి జీవితాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. అక్షరం ఒక అసమాన ఆయుధం. వినయంతో స్వీకరిస్తే నీ పాదాక్రాంతం అంటాడు. అక్షరంతో ప్రయాణిస్తేనే జీవితం చరిత్ర అవుతుందంటాడు. **"బాల్యం భవిష్యత్తుకు సింహద్వారం. పిల్లలు భవిష్యత్తుకు భరోసాలు, భావి సమాజ సారథులు"** అంటాడు.

నిత్యం జరిగే రోడ్ల ప్రమాదాల గూర్చి రోడ్ల నాలుకలు రక్తదాహంతో ఎదురు చూస్తున్నాయంటాడు. మైకం వేగం రెండూ ప్రమాదమే నంటాడు. సమస్యను చెప్పడం, పరిష్కార మార్గాన్ని చెప్పడం రచయిత బాధ్యతగా స్వీకరించి 'ముఖీలు' రచించాడు. అతివృష్టి, అనావృష్టి సీమరైతును నలిపేస్తున్న రెండు ఇనుపచక్రాలుగా భావిస్తాడు. మార్కెట్లు, దళారీలను రైతును దగాచేసే రెండు రాక్షస వ్యవస్థలుగా భావిస్తాడు.


**"పల్లెతల్లి వంటిది పట్టణం ప్రియురాలు వంటిది"** అన్నాడొక కవి. పల్లె కరిగి పట్నం వైపు ప్రవహిస్తుందంటాడు. డబ్బు కాళ్ళ కింద మనుషులు బలైపోతూ పంటలో ఇంకించి ప్లాట్లు మొలుస్తున్న వైనాన్ని ఆక్షేపించాడు. కరోనా నేపథ్యంలో **"ప్రజాస్వామ్య పద్మవ్యూహం లో చిక్కుబడ్డ వలసాభిమన్యుణ్ణి నేను"** అంటాడు. బతకడానికి వలస వెళ్ళిన వాళ్లు కరోనా పద్మవ్యూహంలో చిక్కుకున్న వైనాన్ని ఏకరువు పెట్టాడు.

ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్నప్పుడే సమాజాన్ని వాస్తవిక కోణంలో చూసి ఆవేదనలను, ఆక్రందనలను వ్యక్తం చేసి వ్యవస్థ తీరు మారాలి అనే కోణంలో భావనలను అక్షరబద్ధం చేసి కవిత్వ సృజన చేస్తాం. ఈ కోవకు చెందినవాడు ఈశ్వరరెడ్డి.

కవి ప్రపంచాన్ని, సమాజాన్ని తనలో ఆవహించుకొని ఎన్నో కోణాల్లో సమస్యల సునామీలను ఆవిష్కరించి మరో ప్రపంచం కోసం ఎదురు చూస్తున్న, కవితా స్వరూపమే 'నాలోనువ్వు'. ప్రతి కవితలో ప్రగతి పరిమళాలు వెదజల్లించి నవసమాజాన్ని ఆకాంక్షించిన అభ్యుదయ కవి ఈశ్వరరెడ్డి.

## తెలంగాణ జాగ మీద పానం

**డా. వెల్దండి శ్రీధర్,** సహాయాచార్యులు, ఎన్.జి. కళాశాల, నల్గొండ. ఫోన్ : 98669 77741




ప్రజాకవి కాళోజీ నారాయణరావు, మహాకవి దాశరథి కృష్ణమాచార్యలాగా తనువంతా నోరుజేసుకొని తెలంగాణ కోసం మాట్లాడిన, కొట్లాడిన అచ్చమైన తెలంగాణ గొంతుక డా. నందిని సిధారెడ్డి. కలం పట్టిన తొలినాళ్ల నుంచి ఇవాళటిదాకా ఆయన ప్రతి అక్షరం తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబించేదే. పాట, కవిత్వం, కథ, వ్యాసం.. ప్రక్రియ ఏదైనా అందులో తెలంగాణతనం తొంగి చూస్తుంది. తెలంగాణ మట్టిపరిమళం, తెలంగాణ పల్లె జీవితం, తెలంగాణ దుఃఖపు తీగ ఆయన ప్రతి రచనలో నేపథ్యంగా అల్లుకుంటుంది.

**"జాగ మీద పానం / పానమిడిసినా జాగిడువం**
**ఈ జాగ తీరే అట్ల / ఈడ పుట్టి పెరిగిన మనిషి తీరే గట్ల**
**ఈ జాగల బర్వుబర్వుగ తిరిగే**
**పూర్వీకుల ఆత్మలుంటయి"** అంటాడు. తెలంగాణ ప్రజలకు సహజంగా ఉండే రేషం, జిద్దు, కుటిలత్వంలేనితనం, కుండబద్దలు కొట్టినట్టు కడిగేసే మనస్తత్వం, ఇరాం లేకుంట తిరిగేతనం, ఎదుటి

మనిషి ఎతలకైనా కరిగిపోయే మనిషితనం, పానాపానంగా తెలంగాణ కోసం తన్లాడేతనం మొదలైన జీవధాతువులెన్నో సిధారెడ్డి కవిత్వం నిండా పరుచుకుని ఉంటాయి. తెలంగాణ అసలైన ప్రాంతీయకవి డా. నందిని సిధారెడ్డి.

నిరంతరం ప్రజా జీవితంతో మమేకమయ్యే వాళ్ళు, ప్రతి ఆలోచన కష్టజీవుల కోసం ధారపోసే వాళ్లు మాత్రమే ఇలా రాయగలరేమో. ఇలాంటి స్పష్టమైన దృక్పథం లేకపోతే యాభై ఏళ్లుగా సాహిత్య రంగంలో కొనసాగలేరు. రచయితగా మనలేరు. 'భూమి స్వప్నం' నుంచి 'అనిమేష' దాకా ప్రతి రచన నందిని సిధారెడ్డి రచనా దృక్పథాన్ని పట్టి చూపేదే. ఈ ప్రయాణంలో 2007లో వెలువడిన 'నదిపుట్టువడి' కవితా సంపుటి కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలపు వేడిని, తెలంగాణ మట్టిమనుషుల తడిని ఎంతో గాఢంగా వ్యక్తీకరించింది.

అనుభవించిన జీవితాన్నంతా అక్షరాల్లోకి అనువాదం చేయలేనట్లే గడించిన పాండిత్యాన్నంతా రచనల్లోకి ఒంపలేము. 'నీరు కొలది తామర సుమ్మీ' అన్నట్లు వస్తువునుబట్టి, ప్రక్రియను బట్టి ఎంత అవసరమో అంత వాడాలి. ఇది కూడా ఒక కవిత్వ ఔచిత్యమే. ఈ విషయం బాగా తెలిసిన కవి డా. నందిని సిధారెడ్డి. ఈయన కవిత్వమంతా వెదికినా ఒక్కటంటే ఒక్కటి కూడా పాండిత్య ప్రకర్ష కోసం వాడిన పదం కనిపించదు. గాఢమైన జీవితాన్ని చాలా సరళమైన భాషలో కవిత్వీకరించడం ఆయన కలానికి మాత్రమే తెలిసిన రసవిద్య. కవితా శిల్పంలో ఇది అదృశ్యంగా కలిసి ఉంటుంది. దీనికి నిదర్శనంగా ఎన్నో కవితల్ని ఎత్తి చూపవచ్చు.

'నదిపుట్టువడి' కవితా సంపుటిలోని చాలా కవితలు 2001 నుండి 2007 మధ్య రాయబడిన కవితలు. అంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఒక ఉధృత దశకు చేరుకున్న సందర్భం. తెల్లవారి లేచింది మొదలు రాత్రిదాకా రోడ్డెక్కితే చాలు ఎన్నో ఉద్యమ స్వరూపాలు కళ్లకు కనబడుతున్న కాలం అది. అందుకే అప్పుడు కలం పట్టిన ప్రతి కవి ఉద్యమ జీవితాన్ని కవిత్వం చేయకుండా ఉండలేకపోయాడు.

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**


ఇలాంటి సన్నివేశంలో సిధారెడ్డిలాంటి కవి గుండెల్లో ఉద్యమ మంటలు వేసుకొని మరీ కవిత్వం రాస్తాడు. అలాంటి కాగడాల్లాంటి కవితలే ఈ కవితా సంపుటిలోని సగం పేజీల్లో ఉద్యమసెగను పంచుతాయి.

**"తెలంగాణ అంటేనే**
**తెలుగుతల్లి ముక్కలయ్యేదుంటే**
**ఆ బంధమే వద్దు**
**సేపయి తల్లి మాకొద్దు**
**తెలంగాణే మా రక్తం పంచిన తల్లి"**


ఉద్యమ కాలంలో తెలంగాణకు, సీమాంధ్రకు మధ్య ఎన్నో వాదోపవాదాలు జరిగాయి. తెలుగుతల్లిని ముక్కలు చేయవద్దని, ఆంధ్రప్రదేశ్ అనే మధుకలశాన్ని పగలకొట్టొద్దని రకరకాల వాదాలు ముందుకు వచ్చాయి. ప్రతి వాదనను తెలంగాణ కవులు, రచయితలు ఎంతో హేతుబద్ధంగా తిప్పికొట్టారు. తెలంగాణ సమాజానికి స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని అందించని ఉమ్మడి రాష్ట్రం మనకు వద్దేవద్దని తెగేసి చెప్పిన కాలం అది.

తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకాల చుట్టూ జరిగింది. అందుకే ఈ కవితా సంపుటిలో నీళ్ల మీద చాలా కవితలున్నాయి. 'మనది మనకు', 'కార్తె', 'బోరుదుఃఖం' 'నీళ్ల కోసం' కవితలు తెలంగాణ ప్రజల నీటి అవసరాలను, నీటిని ముట్టడించిన రాజకీయాన్ని మన గుండెల్లోకి పారిస్తాయి. 'మనది మనకు' కవిత పటేలు దగ్గర జీతమున్న జీతగాళ్ల కోణంలో నడుస్తూనే తెలంగాణ డెబ్భై ఏళ్ల చరిత్రను మన ముందుంచుతుంది. తెలంగాణలో మొదటి నుంచి నీళ్ల కోసం కొట్లాటనే. **'నీళ్లకాడ నిత్తె పంచాయతే. నీళ్లకాడ నీళ్లకంటె అన్యాలంగా నెత్తురు పారిచ్చిరి'.** కరువు రాజ్యమేలినపుడు నీటి చుక్క కోసం కోసులు నడిచిపోయిన రోజులున్నాయి. నీళ్లు లేక బతుకు ఎండిన చెట్టులాగా మారుతుంటే మన నీళ్లను ఆంధ్రోళ్లు మలుపుక పోవుటానికి కుట్రలు చేసిన రోజుల్ని గురించి రాస్తూ 'నీళ్ల చాలాకి ఏరే ఉంటది. నీళ్ల తెలివి ఏరే ఉంటది. మనండ్ల మనం కొట్టుకునుడు గాదు. మనుసుల అర్తం జేసుకోవాలె. దునియ అర్తం జేసుకోవాలె. మనండ్ల మనం కొట్లాడుకునుడుగాదు. మనది మనకయేతందుకు కొట్లాడాలె' అని తెలంగాణ ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తాడు ఈ కవితలో. నీటి కరువు దృశ్యాలనే కొనసాగిస్తూ 'వెదుక్కుంటూ వాన వొచ్చేసరికి చెరువు మిగల్లేదు' అంటాడు 'కార్తె' కవితలో. సమైక్య పాలనలో కావాలని తెలంగాణ ప్రాంతంలోని చెరువులను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రజలు జీర్ణం చేసుకోలేకపోయారు. కరువు వెంటాడినంత కాలం వెంటాడింది. చివరాఖరికి ప్రకృతి కరుణించి వాన కొడితే నీటిని నిల్వ చేసుకోవడానికి ఇక్కడ చెరువులే లేవు. అయితే అన్యాక్రాంతం అయ్యాయి. లేదంటే చెరువులో పూటిక తీయకుండా నీటి నిల్వకు అక్కరకు రాకుండా పోయాయి.


# స్వ'కృతి'





**మిగిలేవి... గురుతులే! (కథలు)**
ధూళిపాళ అరుణ
వెల : 150/-
**ప్రతులకు :** ధూళిపాళ దత్తాత్రేయ శర్మ
హరిహర త్రిశక్తి క్షేత్రం, వలిగొండ,
యాదాద్రి జిల్లా.
ఫోన్: 90009 98850




**శివ గామిని**
కవి - వ్యాఖ్యాత : మెట్టు రామచంద్ర ప్రసాద్
వెల : 150/-
**ప్రతులకు :** పద్యకళాపరిషత్,
మెట్టు రామచంద్ర ప్రసాద్, 4వ అడ్డవీధజ,
నేతాజీ నగర్, నెల్లూరు - 524 004.
ఫోన్ : 9346323609




**మూడు వేగు చుక్కలు - ఒక వేకువ**
'ప్రసన్న కవి' ఉన్నం జ్యోతివాసు
వెల : 90/-
**ప్రతులకు :** రచయిత, శ్రీప్రియ అపార్ట్‌మెంట్, 2వ అంతస్తు - 206, కర్నూలు రోడ్, శ్రీనగర్ కాలనీ, మసీదు ఎదురు, ఒంగోలు-523 002. ఫోన్ : 954245 9957





**శతద్రు (వచన పద్యాలు)**
డా. గండ్ర లక్ష్మణ రావు
వెల : 120/-
**ప్రతులకు :** శ్రీమతి గండ్ర విజయ,
10-3-537, వివేకానందపురి,
కరీంనగర్ - 505 001.
ఫోన్ : 98493 28036

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**




**యాభై ఏళ్ళ వాన (కవిత్వం)**
కొప్పర్తి
వెల : 60/-
కొప్పర్తి వెంకట రమణ మూర్తి
35-56-5, నియర్ మాంటిస్సోరి స్కూల్,
తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా - 534 211
ఫోన్ : 98495 25765




**వెలుగు రవ్వలు (కవితా సంపుటి)**
మల్యాల మనోహర రావు
వెల : 200/-
**ప్రతులకు :** మల్యాల మాధవి,
ఇం.నెం. 2-9-512, శ్రీనగర్ కాలనీ,
హనుమకొండ, వరంగల్.
ఫోన్ : 81065 42095






**రాఘవేంద్ర శతకము, శ్రీ రుక్మిణీ పాండురంగ శతకము, శ్రీరంగ శతకము, భక్తామృత శతకము (నాలుగు శతకాలు)**
**కృతి కర్త :**
**అ॥పు॥ శ్రీ భృంగాచల వంగరి నారాయణార్యులు**
**సంపాదకులు : డా. వి. త్రివేణి**
వెల : 99/- ఒక్కొక్కటి.
**ప్రతులకు :**
ఇం.నెం. 5-66, ప్రభుత్వ బిసి బాలుర హాస్టల్ ఎదురుగా, మల్లికార్జున నగర్, గ్రా. అలియాబాదు, మం. శామీర్‌పేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా - 500 078,
ఫోన్ : 991288 2342

# అంబులెన్స్

డా. ఎన్. గోపి, ఫోన్ : 939 102 8496



అతడు వీరుడు
అతణ్ని బతికించండి
చీకటిని చీలుస్తూ
వెలుగును వెదజల్లినవాడు
ఇప్పుడు కాలాన్ని చీల్చుకుంటూ
త్వరగా వెళ్ళండి

ఎవరిదైనా ప్రాణమే
కానీ అతడు మరీ అపురూపం
పలు ప్రజా ఉద్యమాలకు
ప్రాణం పోసినవాడు
గుండె దిటవు గలవాడు
ఇప్పుడతని గుండె
బలహీనంగా కొట్టుకుంటుంది
చేతులడ్డం పెట్టి
దీపాన్ని కాపాడండి

ఎందరికో దారి చూపినవాడు
ఇప్పుడతని కనులు
మూతపడనీయకండి
ఎందరో నమ్ముకున్నారతణ్ని
ఆ నమ్మకాన్ని వమ్ము కానీయకండి

చూశారా!
అతని పెదవుల పైన చిరునవ్వు
మెల్లమెల్లగా తొణికిపోతున్నది
ఓ నా ట్రాఫిక్ దేవతా!
ఈ మహానుభావునికి కాస్త దారినివ్వు

పడుతున్నది వర్షం కాదు
బంధుమిత్రుల కన్నీళ్లు
హాస్పిటల్ సంజీవనీ వృక్షంలా కనిపిస్తున్నది.

ఏం కాదు సార్!
మేమున్నాం కద
ఆకాంక్షల కవచం అల్లిపెట్టాం
వీరుడా! వెళ్లేటప్పుడు పడుకున్నావు
వచ్చేట్పుడు నడిచొస్తావు చూడు
ఆల్ ది బెస్ట్!



## ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**7416 106 106**
www.ferty9.com

**IUI** | **IVF** | **ICSI** | **IMSI** | **HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్


Scanned with OKEN Scanner